RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 18 సంచిక: 274 హైదరాబాద్, బుధవారం, 8 మే 2024 పేజీలు: 12 వెల: 1.00

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

### పలు చోట్ల ట్రాఫిక్ జామ్





హైదరాబాద్ నగరంలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న నగరవాసులకు వరుణిడి రాక ఉపశమనం కలిగించింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో వేసవి తాపం నుంచి ప్రజలకు ఊరట కలిగింది. దాదాపు గంట సేపు వర్షం కురవడంతో రహదారులు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సికింద్రాబాద్, మారేడుపల్లి, చిలకలగూడ, బోయిన్‌పల్లి, ఆల్వాల్, ప్యారడైజ్, ప్యాట్నీ, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర జీడిమెట్ల, మలక్‌పేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట, యూసఫ్‌గూడ, ముషీరాబాద్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు చేరింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో..

తెలంగాణలోని పలు జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉమ్మడి కరీంనగర్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, ములుగు జిల్లాలో పలు చోట్ల ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానుకొండూర్, హుజూరాబాద్, పెద్దపల్లి, మల్యాల, పెగడపల్లి, వేములవాడలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

కరీంనగర్‌లో కూలిన టెంట్లు.. సీఎం సభ వాయిదా

సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనాల్సిన కాంగ్రెస్ జనజాతర సభకోసం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టెంట్లు కుప్పకూలాయి. ఈదురుగాలుల ధాటికి కుర్చీలు చెల్లాచెదురయ్యాయి. ఆ సమయంలో టెంట్ల కింద కార్యకర్తలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షం కారణంగా సీఎం సభ వాయిదా పడింది.

## ఖమ్మంలో విక్టరీ వెంకటేశ్ రోడ్ షో

ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి మద్దతుగా ఆయన వియ్యంకుడు సినీ నటుడు విక్టరీ వెంకటేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం ఖమ్మం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోకు వెంకటేశ్ అభిమానులతో పాటు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ వెంకటేశ్ ముందుకు సాగారు. రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



దిల్లీ: ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ న్యాయస్థానం పొడిగించింది. ఈ నెల 14 వరకు కస్టడీ పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. ఇవాల్టితో కస్టడీ ముగియడంతో మంగళవారం కవితను అధికారులు ప్రత్యక్షంగా న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. కస్టడీ పొడిగించాలన్న ఈడీ విజ్ఞప్తితో న్యాయమూర్తి ఏకీభవించారు. మే 14న కవితను కోర్టులో హాజరు పర్చాలని ఆదేశించారు.

ప్రజ్వల్ రేవణ్ణ లాంటి వాళ్లను దేశం దాటించి.. తన లాంటి వారిని అరెస్టు చేయడం దారుణమని కవిత వ్యాఖ్యానించారు. మరోవైపు కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కూడా రౌజ్ అవెన్యూ కోర్టు ఈ నెల 20 వరకు పొడిగించింది. సంచలనం సృష్టించిన దిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మార్చి 15న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్.. విచారణ జరిపిన సుప్రీం..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలను విన్న కోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపివేసింది. గురువారం, లేదంటే వచ్చేవారం కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పును వెలువరించే అవకాశం ఉన్నది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తే.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పరిగణలోకి తీసుకుంటామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఇటీవల విచారణ సమయంలో తెలిపింది.అయితే, విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. సీఎంకి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని.. ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని సింఘ్వీ తెలిపారు. ఈడీ ఎదుట విచారణకు హాజరుకాకపోవడం అరెస్టు ఆధారం కాదన్నారు. మధ్యంతర బెయిల్ వచ్చిన సమయంలో ప్రభుత్వ పనుల జోలికి వెళ్లొద్దని కోర్టు కోరుతుందని.. మధ్యంతర బెయిల్ ఇస్తే ప్రభుత్వ పనులతో పాటు.. ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన ఫైల్స్ జోలికి వెళ్లబోమని.. కోర్టుకు సంఘ్వీ హామీ ఇచ్చారు.కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. నేతల కోసం ప్రత్యేకంగా కేటగిరిని తీసుకురాలేమని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో ఎంపీలకు సంబంధించి దాదాపు 5వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. కేజ్రీవాల్ విచారణకు సహకరిస్తే అరెస్టు చేసేవారు కాదని.. తొమ్మిదిసార్లు సమన్లను జారీ చేసినా పట్టించుకోలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ 7స్టార్ గ్రాండ్ హయత్ హొటల్‌లో బస చేశారని, హొటల్ బిల్లును చన్‌ప్రీత్ సింగ్ చెల్లించారని కేసు విచారణ సందర్భంగా ఈడీ కోర్టుకు తెలిపింది.గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచారానికి నిధులు అందజేసినట్లు చన్‌ప్రీత్ సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈడీ తరపు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను వ్యతిరేకిస్తూ.. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు కాదని.. ఈ కేసులో జరుగుతున్న రాజకీయాల గురించి మాకు ఆందోళన లేదన్నారు. కానీ తమ ఆందోళన సాక్ష్యాల గురించేనన్నారు. ప్రారంభంలో తమ దృష్టి అరవింద్ కేజ్రీవాల్‌పై, ఆయనపై చర్యలు తీసుకోవాలనే ఆలోచన లేదని.. దర్యాప్తు పురోగతి సాధించిన సమయంలో ఆయన పాత్ర స్పష్టమైందని ఈడీ వివరించింది.

## నేను ముస్లిం, ఇస్లాంలకు వ్యతిరేకం కాదు..

# ప్రధాని మోదీ క్లారిటీ

తనతో పాటు బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమనే విమర్శలు వస్తున్న తరుణంలో.. ప్రధాని నరేంద్ర మోదీ (వాటిపై స్పందించారు. తాను ఇస్లాంకు ( ముస్లింలకుఏమాత్రం వ్యతిరేకం కాదని.. ప్రతిపక్షాలే ఈ కథనాల్ని ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. విపక్షాల అబద్ధాలు బయటపడటం వల్లే.. వాళ్లు తమపై ఈ అసత్య ప్రచారానికి తెరలేపాయని ఆరోపించారు. తాను ఎవరిపైనా వివక్ష చూపడం లేదన్న విషయం స్వయంగా ముస్లింలు కూడా అర్థం చేసుకున్నారని అన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన




ఇంటర్వ్యూలో భాగంగా.. మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

"మేము ముస్లింలకు గానీ, ఇస్లాంకి గానీ వ్యతిరేకం కాదు. అసలు అది మా విధానమే కాదు. నెహ్రూ కాలం నుంచే విపక్షాలు ఈ కథనాల్ని ప్రచారం చేస్తున్నాయి. బీజేపీ ముస్లిం వ్యతిరేకులంటూ ఆరోపణలు చేస్తూ.. దాన్నుంచి వాళ్లు లబ్ది పొందాలని చూస్తున్నారు. తాము ముస్లింలకి స్నేహితులమంటూ విపక్షాలు కపట ప్రేమని ప్రదర్శిస్తున్నాయి. కానీ.. ముస్లిం సమాజం చైతన్యవంతంగా మారింది. తాను ట్రిపుల్ తలాక్ సంప్రదాయాన్ని రద్దు చేయడంతో పాటు ఆయుష్మాన్ కార్డులు, కొవిడ్ వ్యాక్సిన్లు అందుబాటులోకి తెచ్చినప్పుడు.. నేను నిజాయితీగానే ఉన్నానని ముస్లిం సోదరీమణులు భావించారు. నేను ఎవరిపై కూడా వివక్ష చూపట్లేదని వాళ్లు అర్థం చేసుకున్నారు" అని ప్రధాని మోదీ ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. తప్పుదోవ పట్టించేందుకు విపక్షాలు రకరకాల అబద్ధాలు చెప్తూనే ఉంటారని ఆయన ధ్వజమెత్తారు.

ఇదిలావుండగా..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదని ముస్లింలకు పంచి పెడుతుందంటూ కొన్ని రోజుల క్రితం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. బంగారంతో పాటు సంపద మొత్తం సర్వే చేసి.. దాన్ని చొరబాటుదారులకి, ఎక్కువమంది పిల్లలున్న వారికి పంచుతారంటూ వ్యాఖ్యానించారు. దీనిపై విపక్షాలు స్పందిస్తూ.. ఎన్నికల్లో లబ్ది పొందడం కోసమే మోదీ ఇలా ఓ వర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డాయి. ఈ క్రమంలోనే మోదీ పై విధంగా బదులిచ్చారు. ముస్లిం సమాజాన్ని ఉద్దేశిస్తూ.. భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని, భయాందోళనతో కూడిన వాతావరణం కారణంగా ఏ సమాజమూ కట్టుబానిస జీవితాన్ని గడపాలని తాను కోరుకోవడం ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు.

## అధికారం కోసం మోదీ అండ్ కో ఎంతకైనా.....

న్యూఢిల్లీ, మే 07: ఈ ఎన్నికల్లో ఎలాగైన అధికారం అందుకోవాలని ప్రధాని మోదీ, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు.. మూడో దశ పోలింగ్ జరుగుతున్న వేళ ప్రధాని మోదీతోపాటు ఆయన పార్టీపై సోనియాగాంధీ గాంధీ మండిపడ్డారు.

మంగళవారం సోనియాగాంధీ మాట్లాడిన వీడియోను విడుదల చేశారు. దేశంలో ప్రతిచోట నిరుద్యోగం తాండవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు దౌర్జన్యాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన చెందారు. దళితులు, తెగల వారు, వెనకబడిన వర్గాలు, మైనార్టీలు తీవ్రంగా అంతరాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఈ విధమైన వాతావరణం దేశంలో ఏర్పాడడానికి కారణం ప్రధాని మోదీతోపాటు అయన పార్టీ అని సోనియాగాంధీ ఈ సందర్భంగా అభివర్ణించారు. రాజకీయ లబ్ది కోసం వారు ద్వేషాన్ని పెంచి పోషిస్తున్నారని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడిందని గుర్తు చేశారు.

అంతేకాదు.. దేశాన్ని ధృడపరచడమే కాకుండా.. అందరికీ న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుందని సోనియా గాంధీ వివరించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇండియా కూటమి



అంకితభావంతో పని చేస్తుందని స్పష్టం చేశారు.

ఆ క్రమంలో సమైక్య భారత దేశం కోసం.. దేశ ధృఢమైన నిర్మాణం కోసం... భవిష్యత్తు మరింత మెరుగుగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని దేశ ప్రజలకు సోనియా గాంధీ సందేశాన్ని ఇచ్చారు.

## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే టాప్ కమాండ్

## బాసిత్ అహ్మద్ దార్ సహా ఇద్దరు ఉగ్రవాదులు హతం

దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా రెడ్వానీ ప్రాంతంలో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతుల్లో లష్కరే తోయిబా టాప్ కమాండర్ బాసిత్ అహ్మద్ దార్ సైతం ఉన్నాడు. 2021 ఉగ్ర కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. శ్రీనగర్‌తో పాటు దక్షిణ కశ్మీర్‌లో భద్రతా దళాలు, మైనారిటీలపై దాడులతో సహా 18 కంటే ఎక్కువ కేసుల్లో అతని ప్రేమయం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అతడి తలపై రూ.10లక్షల రివార్డు సైతం ఉందని కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది పేర్కొన్నారు.

కశ్మీర్‌లో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించాలని చూస్తే సహించబోమన్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం పోలీసులకు అందిందని కశ్మీర్ ఐజీపీ తెలిపారు. పోలీసులతో పాటు భద్రతా బలగాలు సంఘటనా స్థలాలు చుట్టుముట్టాయని.. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య భారీగా ఎదురుకాల్పులు జరిగాయన్నారు. ఎన్‌కౌంటర్‌లో నిషేధిత లష్కరే తోయిబా సంస్థ టాప్ కమాండర్ బాసిత్ దార్‌తోపాటు రెడ్వానీకి చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని ఆయన చెప్పారు. ఈ మధ్యాహ్నం ఆపరేషన్ ముగిసిందని, సంఘటనా స్థలం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు.

ఇదిలా ఉండగా.. శనివారం సాయంత్రం పూంచ్ జిల్లాలోని సూరన్‌కోట్ తహసీల్‌లోని దన్నా షాసితార్ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్ వాహనాలపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఐదుగురు వైమానిక సిబ్బంది గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిలో విక్కీ పహాడే వీరమరణం పొందారు. దాడి ఘటన అనంతరం 20 కిలోమీటర్ల పరిధిలో భద్రతా బలగాలు భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. డ్రోన్లతోనూ ఉగ్రవాదుల గురించి ఆరా తీస్తున్నారు. పూంచ్ దాడి తర్వాత సోమవారం ఆర్మీ ఇద్దరు ఉగ్రవాదుల స్కెచ్‌లను విడుదల చేసింది. ఈ ఉగ్రవాదుల ఆచూకీ గురించి ఎవరైనా సమాచారం ఇస్తే వారికి రూ.20లక్షలు ఇస్తామని అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## ఎన్నికలకు అంత కాస్టీనా.....

లోక్‌సభకు ఏడు దశలలో జరుగుతున్న ఎన్నికలలో దాదాపు 49.70 కోట్ల మంది స్త్రీ, 47.10 కోట్ల మంది పురుషులతో కలిపి మొత్తం 96.80 (దాదాపు ప్రపంచ జనాభాలో పది శాతం, 27 ఐరోపా సభ్యదేశాల ఉమ్మడి జనాభా కన్నా అధికం)ఓటర్లు పాల్గొననుండడం ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల వేడుక అనవచ్చు. 140 కోట్ల దేశ జనాభాలో దాదాపు 69% ఓటర్లున్నారు. 44 రోజుల పాటు ఏడు దశలలో కొనసాగే ఈ ఎన్నికలలో మొదటి దశలో 102 నియోజకవర్గాలలో ఏప్రిల్ 19న ప్రారంభమై వరుసగా ఏప్రిల్ 26న 89 నియోజకవర్గాలలో, మే 7న 94 నియోజకవర్గాలలో, 13న 96 నియోజకవర్గాలలో, 20న 49 నియోజకవర్గాలలో, 25న 57, జూన్ 1న 57 నియోజకవర్గాలలో ఏడవ దశతో ముగుస్తాయి.దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే 543 మంది లోక్‌సభ సభ్యుల కోసం ఎన్నికలు నిర్వహించడం అత్యధిక ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. 2019లో అర్హులైన ఓటర్లు 91.20 కోట్లు కాగా, 2024లో అది 96.80 కోట్లకు చేరింది. అర్హత కలిగిన ఓటర్ల సంఖ్య పెరుగుదల, కాలానుగుణంగా సాంప్రదాయ ప్రచార పద్ధతులతో పాటు సామాజిక మాధ్యమాలను ఆశ్రయించడం ఎన్నికల నిర్వహణ ఖర్చుల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. అధికారులు, సాయుధ సిబ్బందిని మోహరించడం నుండి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు కొనుగోలు చేయడం, ఇండెలిబుల్ ఇంక్ వంటి ఇతర అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడం, ఓటు హక్కు గురించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడంలాంటి వాటిపై భారత ఎన్నికల సంఘం భారీగా ఖర్చు పెడుతుంది.ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించిన సమాచారం ప్రకారం 2019లో 32 జాతీయ, రాష్ట్ర పార్టీలు ఉమ్మడిగా ఖర్చు చేసిన రూ. 2,994 కోట్లలో, రూ. 529 కోట్లను నేరుగా తమ తమ అభ్యర్థులకు అందించాయి. 2009 ఎన్నికలలో ఆరు జాతీయ పార్టీలకు చెందిన 388 లోక్‌సభ సభ్యులు రూ.14.20 కోట్లు అందుకున్నట్లు, 2014 ఎన్నికలలో ఐదు జాతీయ పార్టీల నుండి గెలుపొందిన 342 అభ్యర్థులు ఉమ్మడిగా రూ.75.60 కోట్లు అందుకున్నట్లు తమ డిక్లరేషన్ పత్రాలలో వెల్లడించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ తెలిపింది.భారీ స్థాయిలో ఎన్నికల నిర్వహణకు వ్యయప్రయాసలతో పాటు ఖచ్చితమైన ప్రణాళిక అవసరం. 2019లో రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా, స్వాతంత్ర్యానంతరం అక్టోబర్ 25, 1951 నుండి ఫిబ్రవరి 21, 1952 వరకు 68 దశల్లో దేశంలో జరిగిన మొట్టమొదటి ఎన్నికలకు రూ. 10.45 కోట్లు, 2014 ఎన్నికలకు రూ.3,870 కోట్లు ఖర్చయినట్లు ప్రభుత్వం తెలిపింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ప్రభుత్వం రూ. 50,000 కోట్లు వెచ్చించినట్లునట్లు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ నివేదించింది. ఈ లెక్కన 2024 ఎన్నికలకు దాదాపు ఒక లక్షా ఇరవై వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇందులో 20% ఎన్నికల నిర్వహణ కోసం భారత ఎన్నికల సంఘం, మిగతా 80 శాతం వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం కోసం ఖర్చు పెడతారని ఫస్ట్ పోస్ట్ సంస్థ తెలిపింది.1951లో ఒక్కో ఓటర్ కోసం కేవలం 6 పైసలు వ్యయమవగా 2014లో అది రూ.46కి పెరగడం పెరుగుతున్న ఆర్థిక భారాన్ని సూచిస్తుంది. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చైర్మన్ ఎన్ భాస్కరరావు బ్లూమ్‌బెర్గ్‌తో మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులో ఎక్కువ భాగం సామాజిక మాధ్యమాల ప్రచారానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. భాస్కరరావు అభిప్రాయంతో ఏకీభవిస్తూ కొలంబియా యూనివర్సిటీ లెక్చరర్ సైమన్ చౌచర్డ్ ఓటర్లను ఆకర్షించడానికి రాజకీయ నాయకులు ఖర్చులకు ఏమాత్రం వెరవక వినూత్న పోకడలను ఆశ్రయిస్తున్నారన్నారు. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఎరవేయడం, బహుమతులు ఇవ్వడంతో పాటు విభిన్న రకాల వస్తువులతో ప్రచారం చేస్తుండడంతో అవి విక్రయించే వ్యాపారులు కూడా లబ్ధి పొందుతున్నారు అని అన్నారు.ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికలు పూర్తయినప్పటి నుండి ఇవిఎంల సేకరణ, నిర్వహణ వ్యయం గణనీయంగా పెరిగింది. ఎన్నికల తర్వాత తొలి బడ్జెట్‌లో కేంద్రం ఇందుకు గాను రూ. 25 కోట్లు కేటాయించగా ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్‌లో, ఇవిఎంల కోసం తొలుత రూ. 1,891.8 కోట్లు, తదుపరి శీతాకాల సమావేశాల్లో రూ. 611.27 కోట్ల గ్రాంట్‌ల కోసం అదనపు డిమాండ్‌ను ప్రవేశపెట్టింది. పాలనాపరంగా ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి వేతనాలతో పాటు వాలంటీర్లకు పారితోషికం, శిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి కరువు భత్యం, ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు.ఎన్నికల సంఘం ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయడం, అభ్యర్థుల ఎన్నికల ప్రచార పర్యవేక్షణ, సున్నితమైన పోలింగ్ బూత్‌ల వద్ద అవకతవకలు జరగకుండా సజావుగా పూర్తి పారదర్శకంగా జరిగేందుకు వీడియో రికార్డింగ్ చేయడం, ఎన్నికల అనంతరం ఇవిఎంలకు పకడ్బందీగా సీళ్లు వేసి పూర్తి బందోబస్తుతో ఎన్నికల లెక్కింపు తేదీ వరకు భద్రతా కేంద్రాలకు తరలించి అక్కడ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం, చివరిగా లెక్కింపు కేంద్రాలకు తరలించి అక్కడ ఓట్ల లెక్కింపు తరువాత ఫలితాలను వెల్లడించి గెలుపొందిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను అందచేయడానికి భారీ మొత్తంలో ఖర్చవుతుంది. భారత ఎన్నికల సంఘం మార్చి 22, 2024 న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల అధికారికి రోజుకు రూ. 350, పోలింగ్ అధికారులకు రోజుకు రూ. 250, సహాయ సిబ్బందికి రోజుకు రూ. 200 చెల్లిస్తుంది.

# వైసీపీలో ఫ్యామిలీ మంటలు

విజయవాడ, మే 7,

గతసారి తెలుగుదేశం పార్టీకి ఎదురైన పరిణామాలే.. ఇప్పుడు వైసీపీకి దాపురించాయి. చంద్రబాబుకు సొంత కుటుంబం నుంచే సెగలు తగిలాయి నాడు. జూనియర్ ఎన్టీఆర్ అంటీ ముట్టనట్టుగా వ్యవహరించారు. ఆయన మామ నార్నే శ్రీనివాసరావు టిడిపికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. వైసీపీలో చేరి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. టిడిపిలో చాలామంది నాయకుల కుటుంబాల్లో చీలిక తెచ్చి వైసీపీ లబ్ధి పొందింది అన్న ప్రచారం ఉంది. నాటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోదరుడు సన్యాసి పాత్రుడు వైసీపీలో చేరి ఎంత డ్యామేజ్ చేశారో తెలియంది కాదు.అయితే ఇప్పుడు వైసీపీ పరిస్థితి కూడా అలానే ఉంది. సీఎం జగన్ కుటుంబంలోనే భారీగా చీలిక వచ్చింది. ఆ కుటుంబం అడ్డగోలుగా చీలిపోయింది. చెల్లెలు షర్మిల, సునీత జగన్ ను వ్యతిరేకిస్తున్నారు. వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపి ఇబ్బంది పెడుతున్నారని జగన్ కూడా చెప్పుకొస్తున్నారు. వైయస్ కుటుంబంలో సగం మంది జగన్ వెంట ఉండగా.. మిగతా వారు షర్మిల వెనుక నిలబడ్డారు. దీంతో సగటు వైఎస్ కుటుంబ అభిమాని బాధపడుతున్నాడు. ఎటు ఉండాలో తెలియక సతమతమవుతున్నాడు. ఈ పోరాటంలో ఆ కుటుంబం ఎక్కడ నవ్వుల పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నాడు.తాజాగా మంత్రి అంబటి రాంబాబు సొంత అల్లుడు.. మామ పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆయనను గెలిపించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఆయన వ్యక్తిత్వం విషయంలో చాలా విషయాలు బయట పెట్టాడు. ఇప్పుడు ఇదే వైరల్ గా మారింది. కొద్దిరోజుల కిందట విశాఖకు చెందిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కుమారుడు కూడా ఇలానే వ్యాఖ్యానించాడు. తన తండ్రిని గెలిపించవద్దని నేరుగా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. మరోవైపు వైసీపీలోకి వెళ్లి జగన్ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ముద్రగడ పద్మనాభం ప్రయత్నిస్తున్నారు. తాజాగా ఆయన కుమార్తె సైతం సోషల్ మీడియాలో తండ్రి వైఖరిని తప్పు పట్టడం విశేషం. పైగా తన తండ్రి ప్రత్యర్థులైన పవన్ కళ్యాణ్ ను గెలిపించాలని, ఆయనకే తమ మద్దతు అని ప్రకటించడం విశేషం. అయితే ఎన్నడూ లేని విధంగా వైసీపీ నేతలకు కుటుంబ పోటు ఎదురు కావడం మాత్రం ఇబ్బందికర పరిణామమే. గత ఎన్నికలకు ముందు టిడిపికి ఎదురైన పరిణామాలే.. ఇప్పుడు వైసీపీకి ఎదురు కావడం విశేషం.

నోటి దురుసు నేతలకు ఇక్కట్లే

ఏపీ రాజకీయాలు అంటేనే ఒక రకమైన అపవాదు ఉంది. నోరు తెరిస్తే బూతులు, తిట్ల దండకానికి నేతలు దిగుతారన్న కామెంట్స్ ఉన్నాయి. ముఖ్యంగా వైసిపి మంత్రులు, మాజీ మంత్రుల మాటలు వివాదాస్పదమయ్యాయి. అలాగని ప్రతిపక్ష నేతలు ఏం తక్కువ కాదు. వారిలో కూడా చాలామంది తిట్లదండకంలో ఆరితేరిన వారే. అయితే రాజకీయాలంటేనే ఏహ్య భావం కలిగేలా.. ఏపీలో కొందరు నేతలు మాటల తీరు కొనసాగడం విచారకరం. అధినేతల తీరుతోనే, వారిని ఆకట్టుకోవాలని చాలామంది బూతులను ఆశ్రయించడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ నేతల నోటి దురుసు ఈ ఎన్నికల్లో కొంప ముంచుకున్నట్లు తెలుస్తోంది.అధికార వైసీపీలో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు గత ఐదేళ్లుగా ఎన్నో రకాలుగా వివాదాస్పదమయ్యారు. వారు వాడిన భాష ఇబ్బందికరంగా ఉండేది. అయితే అప్పుడే కాదు ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో కూడా అదే భాష వాడుతుండడం వారికి ప్రతికూలంగా మారుతుంది. ముఖ్యంగా గుడివాడ నుంచి పోటీ చేస్తున్న కొడాలి నాని, నగిరి నుంచి బరిలో దిగిన మంత్రి రోజా, నరసరావుపేట ఎంపీగా పోటీ చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్, సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తున్నా అంబటి రాంబాబు, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, వల్లభనేని వంశీ వంటి వారికి డేంజర్ బెల్స్ మోగుతున్నట్లు తెలుస్తోంది.అయితే వారు వాడిన భాష వైసిపి శ్రేణులకు ఫ్యాషన్ గా అనిపిస్తుంది. అబ్బో గొప్ప మాటలుగా వారు అభివర్ణిస్తుంటారు. వారిని హీరోలుగా చూస్తుంటారు. అంతవరకు బాగానే ఉంది కానీ.. తటస్తులు, ఏ పార్టీతో సంబంధం లేని వారు, విద్యాధికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు.. వీరు ఉపయోగించే భాషను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సభ్య సమాజంలో అటువంటి వారికి స్థానం లేదని చెబుతున్నారు. అయితే వీరు మాట్లాడే మాటలు నియోజకవర్గంలో వారికి ప్రయోజనం చేకూరుస్తాయి కానీ.. రాష్ట్రస్థాయిలో మాత్రం వారి పార్టీ విజయానికి గండి కొట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారి వ్యాఖ్యలు రోజురోజుకు శృతిమించడం, అవే బూతులు తిడుతుండడంతో సొంతవారికి సైతం రుచించని పరిస్థితి. ఇప్పటికే ఈ తరహా వ్యాఖ్యలు చేసే నాయకులు ఎదురీతున్నట్లు తెలుస్తోంది. సర్వేల్లో కూడా ఇదే స్పష్టమవుతోంది. కేవలం నోటి దురుసు మూలంగానే.. వీరంతా ఓడిపోతున్నారని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. జూన్ 4న తమ మాటలతో జేజేతులా రాజకీయ జీవితాన్ని నాశనం చేసుకున్నాం అన్న బాధ వారిలో వ్యక్తం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

## పెళ్లి రోజు సందర్భంగా తలసాని ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్..

మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్వర్ణ దంపతులు సోమవారం సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. తమ పెండ్లి రోజు సందర్భంగా అమ్మవారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పండితులు ఎమ్మెల్యే దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా పలువురు ఎమ్మె?ల్యే దంపతులకు పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసంలో మారేడ్ పల్లి లో గల సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కిషోర్, ఆంజనేయులు, ఆకుల హరికృష్ణ, నాగులు, మహేష్, మహేందర్, అరుణ్ భట్, ఓదెల సత్యనారాయణ, జగదీష్ ప్రసాద్ వర్మ, దుబాయ్ శ్రీను, లావణ్య తదితరులు ఉన్నారు.

## షర్మిల పై కేసు నమోదు

కడప

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రెడ్డి పై బద్వేల్ లో పోలీస్ కేసు నమోదు అయింది. మే 2వ తేదీన బద్వేల్ బహిరంగ సభలో వైఎస్ వివేకా హత్య కేసు గురించి ప్రసంగించారని, వైఎస్ షర్మిలపై బద్వేల్ నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా బద్వేల్ అర్బన్ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. 168 , ఐపిసి సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు పోలీసులు.

## నూతన డిజిపి హరీష్ కుమార్ గుప్తా ను కలిసిన ఎన్నికల నిఘా వేదిక

మంగళగిరి ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని, తప్పులు చేసిన వారిని ఎవరినీ ఉపేక్షించరాదని, నిబద్ధతతో, నిజాయితీతో ప్రజాస్వామ్యహితంగా పోలీస్ యంత్రాంగాన్ని నడిపించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, పూర్వ విజయవాడ నగర మేయర్ జంధ్యాల శంకర్ నూతనంగా నియమించబడిన డిజిపి హరీష్ కుమార్ గుప్తాను ఈనెల 7వ తేదీ న డిజిపి రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవల మచిలీపట్నం, పెనమలూరు లో దళిత కాలనీలో జరిగిన దాడులను డిజీపీ దృష్టికి తీసుకుని వచ్చి బాధ్యులు పై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, చట్టబద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. 13 ఉమ్మడి జిల్లాలలో ఎన్నికల నిఘా వేదిక ఏర్పడి సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ రిటైర్డ్ అధికారులు సమన్వయకర్తలుగా ఉండి క్షేత్రస్థాయిలో ఎన్నికల అక్రమాలను నివారించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నూతన డిజిపి హరీష్ కుమార్ గుప్తా సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తోడ్పడుతామని, ప్రజాస్వామ్యబద్ధంగా చ ట్టబద్ధంగా కృషి చేస్తామని, తప్పు చేసిన వారు ఏ స్థాయిలో ఉన్న కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు .అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రసంగిస్తూ ఎన్నికల నిఘా వేదిక లిలిలి.జీజూవశ్రీవఇబితినీనిలిజీబిఇష్ట.ఇనీఎ అనే వెబ్ సైట్ ను ప్రారంభించిందని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఈ వెబ్ సై ట్ ను వినియోగించుకుని ఎన్నికలు సక్రమంగా జరిగేటట్లు కృషి చేయాలన్నారు. పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని ఓటర్లకు, పౌరులకు నమ్మకాన్ని,ధైర్యాన్ని ,విశ్వాసాన్ని కల్పించాలని కోరారు. ఎన్నికల విధులలో ఉన్న దాదాపు మూడు లక్షల మంది ఎన్నికల సిబ్బందికి తమ ఓటు హక్కును సంపూర్ణంగా వినియోగించుకోవటానికి కావలసిన ఫెసిలిటేషన్ సెంటర్ను బలోపేతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అక్రమాలను నివారించడానికి ఎన్నికల నిఘా వేదిక చేస్తున్న కృషికి తోడ్పాటు అందించాలని ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ,ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు.

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్ల0 రెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గత ఐదు సంవత్సర కాలంగా రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం అధికార పార్టీ నేతల కనుసన్నులలో పనిచేస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తుందని ఈ పరిస్థితి మారాలని తెలిపారు. పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల సందర్భంగా దాడులు, ఘర్షణలు జరుగకుండా చూడాలని కోరారు. డబ్బులు, మద్యం లాంటి ప్రలోభాలకు లోను కాకుండా కుల మతాలకు అతీతంగా సమర్థులైన,నిజాయితీపరులైన అభివృద్ధి కాముకులను గెలిపించుకుని ఆంధ్రప్రదేశ్ సత్వర అభివృద్ధికి తోడ్పడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# రైట్ టూ విద్యా హక్కు 2వేల మందికి ఫ్రీ ఎడ్యుకేషన్

విజయనగరం, మే 7

నిర్బంద విద్యాహక్కు చట్టం ప్రకారం, సెక్షన్ 12 (సి ) ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలలలో చదువుకోడానికి అర్హులైన అల్పాదాయ వర్గాల నిరుపేద కుటుంబాల బాలలు, అనాథ బాలల నుంచి దరఖాస్తుల్ని స్వీకరించారు.ఏపీలో 26 జిల్లాలకు సంబంధించి “ 25125” మంది బాలలకి విద్యా హక్కు చట్టం ద్వారా రాష్ట్ర విద్యాశాఖ ఉచితంగా అడ్మిషన్లు కల్పించింది. ఎంపికైన విద్యార్థులకు అయా పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ఏటువంటి ఫీజులు వసూలు చేయకుండా ప్రవేశాలు కల్పించాలని బాలల హక్కుల కమిషన్ సూచించింది.రాష్ట్రం లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో అత్యధిక సంఖ్యలో ఆర్టీఈ చట్టం విద్యార్థులకు సీట్లు లభించాయి. అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరగడంపై ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. బాలల హక్కుల కమిషన్ విద్యాహక్కు చట్టం పనితీరుపై విద్యా శాఖ సమన్వయంతో పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.సీట్ల కేటాయింపులో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించి ప్రవేశాలు కల్పించాలని, ఉల్లంఘనకు పాల్పడిన విద్యాసంస్థలపై కమిషన్ ద్వారా కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో అడ్మిషన్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు మంగళగిరి లోని కమిషన్ కార్యాలయానికి జీజూబఇజూఇతీ2018ఏఐఎజీతిశ్రీ కు ఫిర్యాదు చేయవొచ్చని అప్పారావు సూచించారు.ఏపీలో విద్యా హక్కు చట్టం కింద పేద విద్యార్థులకు ప్రైవేటు బడుల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించేందుకు ఈ ఏడాది మార్చిలో దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ ఇబవ.జీజూ.ఐనీల.తిని లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ప్రకటించింది.రాష్ట్ర వ్యాప్తంగా 9350 ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టం కింద వివరాలు నమోదు చేసుకున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25శాతం సీట్లను ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తారు.సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణాల్లో 1.44 లక్షలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 ను సంప్రదించాలని సూచించారు. అయితే రాష్ట్ర సిలబస్ తో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలో చేరేందుకు ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నాటికి విద్యార్థికి ఐదేళ్లు నిండాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థికి 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి ఐదేళ్లు నిండాలని తెలిపారు.విద్యార్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను వివిధ దశల్లో పరిశీలించిన అనంతరం ఏప్రిల్ 1న మొదటి విడత ఫలితాలు విడుదల చేస్తారు. ఏప్రిల్ 15న రెండో విడత ఫలితాలు ప్రకటిస్తారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు.

విద్యాహక్కు(ఖీఇ) చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం(2024-25) అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు 1వ తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. .ఉచిత నిర్భంద విద్యాహక్కు చట్టం సెక్షన్12(1) (అ) ప్రకారం 2023-2024 విద్యా సంవత్సరంలో అన్ని రకాల బడుల్లో అడ్మిషన్లు కేటాయించారు. మొదటి విడత ఫేజ్1లో అడ్మిషన్ కేటాయించని పిల్లలతో పాటు రెండవ విడతలో దరఖాస్తు చేసుకున్న పిల్లలకు లాటరీ ద్వారా 14192 మంది విద్యార్థులను ఉచిత నిర్బంధ విద్య పథకానికి ఎంపిక చేశారు. గత ఏడాది 14192మంది అడ్మిషన్లు కల్పిస్తే ఈ ఏడాది 25125 మంది ఆర్టీఇ ద్వారా అడ్మిషన్లు కల్పించారు.

# బెజవాడలో కరెంట్ కోతలు

విజయవాడ, మే 7 (

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో రోడ్ షో కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు విజయవాడలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాని మోదీ పర్యటన విజయవాడలో ప్రజలకు కష్టాలు తెచ్చి పెట్టింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో జనం అల్లాడిపోయారు. బుధవారం సాయంత్రం విజయవాడలో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షో ఉంది. నగరంలోని మహాత్మ గాంధీ రోడ్డులో మోదీ బుధవారం పర్యటించనున్నారు. నగరంలోని ఇందిరా గాంధీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు ప్రధాని రోడ్ షో జరుగుతుంది.గన్నవరం విమానాశ్రయం నుంచి ఇందిరాగాంధీ స్టేడియంకు చేరుకునే ప్రధాని అక్కడి నుంచి నగరంలో రోడ్ షోలో పాల్గొంటారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆయన ప్రయాణించే మార్గంలో ఉన్న హెచ్‌టి లైన్లను మార్చాలని పిఎం సెక్యూరిటీ విభాగం ఆదేశించడంతో గత రెండ్రోజులుగా ఆ పనులు చేపట్టారు. శనివారం కొంత మేర పనులు నిర్వహించిన సిపిడిసిఎల్ సిబ్బంది ఆదివారం నీట్ పరీక్ష నేపథ్యంలో పనులు ఆపేశారు. సోమవారం ఉదయాన్నే సరఫరా నిలిపివేశారు.మరోవైపు విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లుకు గురయ్యారు. దాదాపు రెండున్నర గంటల పాటు నగరంలోని స్వరాజ్యమైదాన్, పిడబ్ల్యుడి గ్రౌండ్ సెక్షన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. మహాత్మగాంధీ రోడ్డు ఉన్న హెచ్‌టి లైన్లను పూర్తిగా తొలగించి లోడ్ డిస్పాచ్ మార్చేందుకు ఏర్పాట్లు చేశారు.గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల ఉక్కపోతతో అల్లాడిపోయారు. విద్యుత్ ఎందుకు పోయిందో కనీస సమాచారం కూడా లేకుండా పోయింది. సిపిడిసిఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912 కూడా అందుబాటులో లేకుండా పోయింది. ఆ నంబర్ పనిచేయక పోవడంతో సమాచారం ఇచ్చే వారు లేకుండా పోయారు. చివరకు ప్రధాని ప్రయాణించే మార్గంలో హెచ్ టి లైన్లు ఉండకూడదనే నిబంధనల నేపథ్యంలో సరఫరా నిలిపివేసినట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.దాదాపు రెండున్నర గంటల అంతరాయం తర్వాత ఉదయం 11 గంటలకు విజయవాడలో కాసేపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అప్పటి వరకు ఉక్కపోతతో తడిచి ముద్దైన జనం బతుకు జీవుడా అనుకున్నారు. పదినిమిషాల్లోపే మళ్లీ సరఫరా నిలిచిపోవడంతో జనం విలవిలలాడిపోయారు.

## బీఆర్ఎస్ కు మరో షాక్

కరీంనగర్

కరీంనగర్ లో బీఆర్ఎస్ కు మరో షాక్ తగిలింది.ఎంపి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేరారు. 50వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, 46వ డివిజన్ కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ కుమార్ సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. మాజీ జడ్పీటీసీ ఎడ్ల శ్రీను, 47 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నపూర్ణసహా వందలాది బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు.

## అవినీతి, ఆస్తిపాస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా?

### నా ఆస్తిపాస్తులపై సీబీఐకి లేఖ రాసేందుకు రెడీ

మీకు దమ్ముందా?

కాంగ్రెస్ పార్టీకి ఎక్స్పైరీ డేట్ వచ్చేసింది

నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ మధ్య కొనసాగుతున్న ఎన్నికలివి

ఎవరి నాయకత్వం కావాలో ఆలోచించి ఓటేయండి

కేసీఆర్ సుద్దపూసైతే సీబీఐ రాకుండా ఎందుకు అడ్డుకున్నట్లు?

కరీంనగర్ లో గరీబోళ్ల బిడ్డకుగడీల వారసులకు మధ్య జరుగుతున్న యుద్ధమిది

నావి ప్రజా పోరాటాలు వారివి అవినీతి సంపాదన కోసం ఆరాటం

ఎటువైపు ఉంటారో ఆలోచించి ప్రజాతీర్పు ఇవ్వండి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్

"వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేతలారా... నా ఆస్తిపాస్తులు, మీరు నాపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరేందుకు నేను సిద్ధం. మరి మీ ఆస్తిపాస్తులు, అవినీతి, బినామీ ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా? మీరు ఓకే అంటే సీబీఐకి లేఖ రాసేందుకు నేను సిద్ధం. దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి" అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ సహా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కరీంనగర్ లో గరీబోళ్ల బిడ్డకు, గడీల వారసులకు మధ్య ఎన్నికల పోరు జరుగుతోందని, ఎవరి పక్షాన నిలిచి ఓటేస్తారో ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. దేశంలో ఎన్నికలు సైతం నరేంద్రమోదీకి, రాహుల్ గాంధీకి మధ్య జరుగుతున్నాయని, ఎవరి నాయకత్వం కావాలో ఆలోచించుకోవాలని సూచించారు. అదే సమయంలో 10 ఏళ్ల ఎన్డీఏ పాలనపై... అంతకుముందు 10 ఏళ్ల యూపీఏ పాలనపై బేరీజు వేసి ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని విజ&ఞప్తి చేశారు. కేసీఆర్ పెద్ద డ్రామా ఆర్టిస్టు అని, అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. తనను, తన కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా ఉండేందుకు సీబీఐని రాష్ట్రంలోకి అడుగుపెట్టకుండా ఉత్తర్వులు ఇచ్చిన కేసీఆర్ .. సిగ్గులేకుండా తాను సుద్దపూసనని, మోదీ అరెస్ట్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని చెబుతున్నారని విమర్శించారు.

ఈరోజు కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ సమక్షంలో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. వీరితోపాటు మాజీ జడ్పీటీసీ ఎడ్ల శ్రీను, 47 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఆరెపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పాదం రాజుసహా వందలాది బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ నేత ఎర్రం వెంకట్రాజంతోపాటు సుమారు 50 మంది బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. మండలాధ్యక్షులు పాదం శివరాజు ఆధ్వర్యంలో చేరిన వీరందరికీ కాషాయ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇవి దేశానికి సంబంధించిన ఎన్నికలు. నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీకి మధ్య జరుగుతున్న ఎన్నికలివి. వీరిద్దరిని బేరీజు వేసుకోవాలని కోరుతున్నా. అదే సమయంలో 10 ఏళ్ల యూపీఏ పాలనను, 10 ఏళ్ల ఎన్డీఏ పాలనను బేరీజు వేయాలని కోరుతున్నా...కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్.... 10 ఏళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి... 2జీ స్కాం, బొగ్గు స్కాం, విమానాల స్కాం, కామన్ వెల్త్ గేమ్ స్కాం, ఆదర్శ స్కాం.. ఐపీఎల్, గడ్డి కుంభకోణం, సహారా, ఈఎస్ఐ, హవాలా స్కాం,... ఆఖరికి చెప్పుల స్కాం (ఫేక్ లెదర్ సొసైటీని ఏర్పాటు చేసి బ్యాంకుల నుండి వేల కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టిన వాళ్లను)లో వేల కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టిన వ్యాపారులను సంకలో వేసుకుని తిరిగి నీచ చరిత్ర కాంగ్రెస్ దే. దేశం పరువు తీసిన కాంగ్రెస్ పార్టీ నేతలా నీతులు చెప్పేది. గరీబీ హఠావో అనే నినాదంతో ముందుకొచ్చిన కాంగ్రెస్ నేతలు మాత్రమే అమీర్(సంపన్నులు) లు అయ్యారు. పేదలు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు. గాంధీ కుటుంబానికే ఈ నినాదం పనికొచ్చిందే తప్ప ప్రజలకు ఏమాత్రం మేలు చేయలేదు..కానీ మోదీది అవినీతి మచ్చలేని స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారు. ఈ దేశం కోసం పనిచేస్తున్నరు. కుటుంబాన్ని పక్కనపెట్టి దేశ ప్రజలే తన కుటుంబంగా భావిస్తున్నారు. అందుకే 140 కోట్ల మందికి గ్యారంటీ మోదీ మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారు. అవినీతి, కుంభకోణాలు, వారసత్వ పాలనతో దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ కు ఎక్స్పైరీ డేట్ వచ్చేసింది. జబ్బు వస్తే టాబ్లెట్లు వేసుకుంటాం. దానిమీద ఎక్స్పైరీ డేట్ ఉంటది... ఆ గడువు ముగిస్తే.. దానిని చెత్త కుప్పలో వేయాల్సిందే... వందేళ్ల కాంగ్రెస్ బతుకంతా కుంభకోణాలు, లంబకోణాలు, కుటుంబ రాజకీయాలే తప్ప ఏనాడూ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు.కరీంనగర్ లో కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా డబ్బులు ఖర్చు పెడుతూ గెలవాలని చూస్తున్నరు. ఇన్ని ప్రలోభాలు పెడుతున్నా లొంగకుండా బీజేపీలో చేరిన నేతలను అభినందిస్తున్నా...దయచేసి కరీంనగర్ లో పోటీ చేస్తున్న మూడు పార్టీల అభ్యర్థులను బేరీజు వేయండి.

# అంబటికి షాక్ తప్పదా

గుంటూరు, మే 7

ఏపీలో హాటెస్ట్ నియోజకవర్గాల్లో సత్తెనపల్లి ఒకటి. ఎంతోమంది యోధాను యోధులు ఈ నియోజకవర్గ నుంచి ప్రాతినిధ్యం వహించారు. గాంధేయవాది వావిలాల గోపాల కృష్ణయ్య, ఆమంచి నరసింహారావు వంటి వారు ఈ నియోజకవర్గానికి చెందిన వారే. మాజీ సీఎం భవనం వెంకట్రావుకు ఈ నియోజకవర్గంతో అనుబంధం ఉంది. 2014లో నవ్యాంధ్రప్రదేశ్ శాసనసభ తొలి స్పీకర్ గా స్థానిక ఎమ్మెల్యే కోడెల శివప్రసాదరావు ఎంపికయ్యారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచిన అంబటి రాంబాబు మంత్రి అయ్యారు. ప్రస్తుతం అంబటి మరోసారివైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.కూటమి అభ్యర్థిగా మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ బరిలో దిగారు. దీంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది.ప్రత్యర్థులు ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో.. ఇక్కడ టైట్ ఫైట్ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీకి జనసేన అదనపు బలం. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అంబటి రాంబాబు ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కన్నా లక్ష్మీనారాయణ స్థానికేతరుడు. కాంగ్రెస్లో సీనియర్ నాయకుడు కూడా. గతంలో పెదకూరపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో గెలిచిన కన్నా మంత్రిగా కూడా వ్యవహరించారు. సత్తెనపల్లిలో సైతం మంచి సంబంధాలు ఉన్నాయి. 2019లో నరసరావుపేట ఎంపీగా బిజెపి నుంచి పోటీ చేసిన కన్నా ఓడిపోయారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఎన్నికల అనంతరం పదవికి రాజీనామా చేశారు. టిడిపిలో చేరారు. దీంతో ఆయనకు సత్తెనపల్లి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు చంద్రబాబు. అప్పటినుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చారు. టిడిపి నేతలను సమన్వయ పరచడంతో పాటు వైసీపీలోని అసంతృప్త నాయకులను తెలుగుదేశం పార్టీలోకి రప్పించారు.అంబటి రాంబాబుకు సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రతి మండలంలోనూ ద్వితీయ శ్రేణి నాయకత్వం అంబటిని వ్యతిరేకిస్తోంది. ప్రతి పనికి రేటు పెట్టి వసూలు చేస్తున్నారన్న ఆరోపణ అంబటి పై ఉంది. చివరకు సీఎం సహాయనిధిలో సైతం చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉన్నాయి. సంక్రాంతి సంబరాలు పేరిట డబ్బులు వసూలు చేశారని ఆయనపై కేసు కూడా నమోదయింది. ముఖ్యంగా సత్తెనపల్లిలో వసూళ్ల పర్వం నచ్చక ఆర్యవైశ్యులు వైసీపీకి దూరమయ్యారన్న ప్రచారం ఉంది. ఇవన్నీ ప్రతికూలంగా మారనున్నాయి.అంబటి పై అభివృద్ధి కంటే.. వివాదాస్పద ముద్ర అధికంగా ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో.. పవర్ స్టార్ అభిమానులతో పాటు కాపు సామాజిక వర్గం ఆగ్రహంగా ఉంది. మంత్రిగా మంచి అవకాశం దక్కిన సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై అంబటి పెద్దగా దృష్టి సారించ లేదన్న విమర్శ ఉంది. కేవలం ఆర్భాటాల కోసమే మంత్రి పదవిని ఉపయోగించుకున్నారని.. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను గాలికి వదిలేసారు అన్న అపవాదు అంబటి పై ఉంది. అయితే జగన్ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని అంబటి నమ్మకంగా ఉన్నారు. కన్నా లక్ష్మీనారాయణ స్థానికేతరుడు కావడం, కోడెల శివప్రసాద్ కుటుంబం సహాయ నిరాకరణ చేయడంతో.. విజయం తనదేనని అంబటి రాంబాబు ధీమాతో ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆయనకు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి

# వంగా గీత.. పోటీ మాములుగా లేదుగా

కాకినాడ, మే 7,

పిఠాపురం నియోజకవర్గంలో ఈసారి పోటీ రసవత్తరంగా ఉంది. ఇద్దరు నేతల మధ్య పోటీ నువ్వా? నేనా? అన్న రీతిలో సాగనుంది. ఎవరికీ గెలుపు అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. ఇద్దరు నేతలకు తలో రకమైన పట్టు ఉండటంతోనే ఈ పరిస్థితి నెలకొంది. పవన్ కళ్యాణ్ పిఠాపురం కాకుండా భీమవరంలో నిలుచుని ఉంటే గెలుపు నల్లేరు మీద నడకలా ఉండేదన్న కామెంట్స్ కూడా జనసేన పార్టీలో వినపడుతున్నాయి. పిఠాపురంలో మారుతున్న సమీకరణాలు ఎవరికి లాభం చేకూరుస్తాయన్నది చెప్పలేని పరిస్థి?తి. పిఠాపురంలో జనసేన తరుపున పవన్ కల్యాణ బరిలో ఉండగా, వైసీపీ నుంచి వంగా గీత పోటీ చేస్తున్నారు. పవన్ కల్యాణ? ఈసారి ఒకే ఒక నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. గత ఎన్నికల్లో మాదిరిగా రెండు నియోజకవర్గాలను ఎంచుకోలేదు. పిఠాపురాన్ని ఒక్కదానినే ఎంచుకుని ఆయన తప్పు చేశారా? అన్న వ్యాఖ్యలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. తిరుపతి, భీమవరం వంటి సేఫ్ ప్లేస్ వదిలేసి పవన్ పిఠాపురాన్ని ఎంచుకుని తప్పు చేశారా? అన్న అంతర్మథనం పార్టీలో సాగుతుంది. ఎందుకంటే వైసీపీ అభ్యర్థి వంగా గీతను ఆషామాషీగా తీసేయలేని పరిస్థితి. వంగా గీత సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న నేత. ఆమె భర్త విశ్వనాథ్ కూడా అందరికీ అందుబాటులో ఉంటూ చేదోడు వాదోడుగా ఉంటారు. వంగా గీత ఇంట్లోకి పిఠాపురం ఓటర్లు ఎవరైనా నేరుగా వెళ్లే అవకాశాలున్నాయి. అందులోనూ ఆమె లోకల్. పవన్ నాన్ లోకల్ గా ముద్రపడ్డారు. వంగా గీతను ఏరికోరి అందుకే జగన్ ఎంపిక చేశారంటున్నారు. మరోవైపు సంక్షేమ పథకాలు కూడా ప్రభావం చూపనున్నాయి. ఏదైనా సమస్య కోసం పవన్ కల్యాణ్ ను కలవాలంటే కష్టమేనన్న భావన ఓటర్లలో నెలకొంది. అయితే యువ ఓటర్లు మాత్రం పవన్ కు మద్దతుగా ఉన్నారు. కానీ మహిళలు, వృద్ధులు, మధ్యతరగతి ఓటర్లు మాత్రం వంగా గీత వైపు ఉన్నట్లే కనిపిస్తుంది. కాపు సామాజికవర్గం ఓట్లు 90 వేలకు పైగానే ఉన్నారు. ఇద్దరూ అదే సామాజికవర్గం కావడంతో ఓట్లు చీల్చుకునే అవకాశాలున్నాయి. బీసీ ఓటర్లు 80 వేలకు పైగానే ఉన్నారు. బీసీలు ఎటువైపు మొగ్గు చూపితే వారిదే విజయం అవుతుంది. అందులోనూ మహిళలు వంగా గీత వైపు నిలిస్తే పవన్ కల్యాణ? గెలుపు అంత సులువు కాదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. వంగా గీత పిఠాపురానికి గతంలో అభివృద్ధి చేసిన విషయాన్ని కూడా ఓటర్లు విస్మరించడం లేదు. పైగా అందుబాటులో ఉండే నేత కావడంతో ఆమె వైపు మొగ్గు చూపే అవకాశముంది. ఆయన ప్రతి అడుగు అదే చెబుతుందిగా పవన్ గెలుపు కోసం... మరోవైపు పవన్ కల్యాణ్ ను గెలిపించుకోకపోతే కాపుల పరువు పోతుందన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. అయితే పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ గెలుపు అంత సులువుగా లేదన్నది అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ సారి ఎన్నికల్లో ఓటమి పాలయితే పార్టీని నడపటం అటుంచి.. నాయకుడిగా తన పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయని ఆయన భావిస్తున్నారు. అందుకే ఆయన అన్ని రకాలుగా గెలుపు కోసం శ్రమిస్తున్నారు. మెగా కుటుంబం నుంచి మద్దతు కోరుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తన అన్నయ్య చిరంజీవిని కూడా రంగంలోకి దించడం కూడా అనుమానంతోనే అన్న కామెంట్స్ వినపడుతున్నాయి. పిఠాపురంలో గెలుపు అంత సులువు కాదన్న నివేదికలు జనసేన వర్గాలను దడ పుట్టిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గం ఓటర్ల తీర్పు ఎప్పుడూ భిన్నంగా ఉంటుంది. ఈసారి ఎవరిది గెలుపు అన్న దానిపై ఇప్పటి నుంచే పెద్దయెత్తున బెట్టింగ్ లు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయి.

# పోరాడుతున్న కొడాలి నాని

విజయవాడ, మే 7

ఏపీలో హాట్ నియోజకవర్గాల్లో గుడివాడ ఒకటి. ఎన్టీఆర్ సొంత నియోజకవర్గం అయినా గుడివాడను కొడాలి నాని అడ్డాగా మార్చుకున్నారు. గత నాలుగు ఎన్నికల్లో గెలుపొందుతూ వచ్చారు. ఇప్పుడు ఐదోసారి గెలవాలన్న ప్రయత్నంతో ఉన్నారు. అయితే నాని దూకుడుకు చెక్ చెప్పి రాజకీయంగా సమాధి చేయాలని చంద్రబాబు స్ట్రాంగ్ గా డిసైడ్ అయ్యారు. అందుకే ఆర్థిక అంగ బలం ఉన్న ఎన్నారై వెనిగండ్ల రామును రంగంలోకి దించారు.ప్రస్తుతం గుడివాడలో అయితే కొడాలి నాని కి టైట్ ఫైట్ ఉంది. గత నాలుగు ఎన్నికల మాదిరిగా సులువుగా గెలుచుకుంటామంటే కుదిరే పని కాదు. అందుకే నాని సైతం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉండడం లేదు. తన ప్రత్యర్థులంతా ఏకం అవ్వడాన్ని ఆయన గుర్తించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో గుడివాడ నుంచి ఎన్టీఆర్ పోటీ చేశారు. 1985 ఎన్నికల్లోనూ పోటీ చేసి విజయం సాధించారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత పదిసార్లు ఎన్నికలు జరగగా.. ఆ పార్టీ ఏడుసార్లు విజయం సాధించింది. ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ గెలుపొందింది. గత రెండు ఎన్నికల్లోను వైసీపీ తరఫున కొడాలి నాని విజయం సాధించారు. అయితే వరుస ఓటములతో గుణపాఠం నేర్చుకున్న టిడిపి బలమైన అభ్యర్థిని ఈసారి రంగంలోకి దించింది. అయితే ఈ నిర్ణయాన్ని మాజీ మంత్రి రావి వెంకటేశ్వరరావు వ్యతిరేకించారు. కానీ హై కమాండ్ బలమైన హామీ ఇవ్వడంతో రంగంలోకి దిగారు. వెనిగండ్ల రాము కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. ఆయన భార్య ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉంది.ఒకవైపు ప్రత్యర్థులు ఏకం కావడం, మరోవైపు నియోజకవర్గంలో వ్యతిరేకత పెరగడంతో.. నాని స్టైల్ మార్చారు. సెంటిమెంట్ అస్త్రాన్ని తెరపైకి తెచ్చారు. ఇవే తనకు చివరి ఎన్నికలని.. గెలిపించి గౌరవప్రదంగా రాజకీయాలనుంచి నిష్క్రమించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే నియోజకవర్గంలో అపరిష్కృత సమస్యలు చాలా ఉన్నాయి. రాజకీయంగా దూకుడు కనబరిచే నాని.. అభివృద్ధి విషయంలో పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ప్రజలు విరక్తితో ఉన్నారు. ఇది కొడాలి నాని కి మైనస్ పాయింట్. అందుకే మరోసారి జూనియర్ ఎన్టీఆర్ పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని యోచనలో కొడాలి నాని ఉన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను సమీకరించి ప్రచారంలోకి దించారు.అయినా సరే ఆశించిన స్థాయిలో రెస్పాన్స్ రావడం లేదు. ముఖ్యంగా సొంత సామాజిక వర్గం నుంచి భారీ వ్యతిరేకత ఉంది. దీంతో ఇక్కడ కొడాలి నాని ఎదురీదక తప్పడం లేదు. బయటకు మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

# మహిళా ఓటర్లే కీలకం

తిరుపతి, మే 7,

వైసీపీకి బలం.. బలగం.. మహిళలే.. తొలి నుంచి జగన్ ఓటు బ్యాంకు కూడా మహిళలే. గత ఎన్నికల్లోనూ ఎక్కువ మంది మహిళలు జగన్ వైపు మొగ్గు చూపారు. అందుకే వైసీపీ 151 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఈ ఆలోచనతోనే జగన్ మరేమీ ఆలోచించలేదు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను ఆకట్టుకునేందుకే ప్రతి అడుగులో ప్రయత్నించారు. అక్కా చెల్లెమ్మలు అంటూ వారిని తన వైపున ఉండేలా చూసుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి పథకమూ వారికే. నగదు బదిలీ కూడా వారి ఖాతాల్లోనే. అక్క చెల్లెమ్మలంటూ జగన్ ప్రతి సభలో పిలుస్తున్న పిలుపు వెనక రహస్యం కూడా అదే. మహిళ ఓటర్లు జారిపోకుండా ఆయన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చివరకు ఫీజు రీఎంబర్స్మెంట్ దగ్గర నుంచి అన్నీ తల్లుల ఖాతాల్లోనే. గతంలో నేరుగా కళాశాలల యాజమాన్యాలకు పంపేవారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని మార్చి వేసి ఫీజు రీఎంబర్స్మెంట్ మొత్తాన్ని తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తూ వచ్చారు. ఒక్క రైతు భరోసా పథకం తప్ప మిగిలిన పథకాలకు సంబంధించిన నిధులన్నీ మహిళల ఖాతాల్లోనే జమ చేసేవారు. అమ్మఒడి, తల్లి దీవెన, జగనన్న వసతి దీవెన ఇలా ఏ పథకమయినా మహిళలఖాతాల్లోనే జమ చేశారు. దీంతో పాటు ఇంటి స్థలాలను కూడా మహిళలపేర్ల మీదనే ఇచ్చారు. దాదాపు 36 లక్షల మంది మహిళలకు పట్టాలు అందించి వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. ఇది జగన్ ఊరికే ఉబుసుపోక చేయలేదు. మహిళలు కష్టపడయినా.. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వస్తారు. అంతే కాదు.. వాళ్లు అనుకున్న పార్టీకే ఓటు వేసే వరకూ నిద్రపోరు. ఎవరెన్ని రకాలుగా వారిని ప్రలోభాలకు గురిచేసినా చివరకు పోలింగ్ తేదీ నాటికి వారి మనసులో మాత్రం తమకు సాయం చేసిన వారికి మాత్రమే ఓటు వేస్తారని తెలుసు. మైండ్ గేమ్ తో జగన్ మాస్టర్ ప్లాన్ వేశారు. అందుకే మహిళలలో ఎక్కువ భాగం ఇప్పుడు వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే పింఛన్ల దగ్గర నుంచి పథకాల వరకూ వేల రూపాయలు తమ ఖాతాల్లోకి వచ్చి పడుతుండటం గతంలో ఎన్నడూ జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం 154 స్థానాల్లో మహిళా ఓటర్లే గెలుపోటములను నిర్ణయిస్తారు.ఎన్నికల సంఘం ఓటర్ల వివరాలను వెల్లడించింది. మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దాదాపు 154 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 154 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 21 నియోజకవర్గాల్లో మహిళలకంటే పురుషులు అధికంగా ఉన్నారు. అందుకే చంద్రబాబు కూడా మహిళలను ఆకట్టుకోవడానికి ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు 1500 రూపాయల పింఛను, తల్లికి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రకటించారు. మరి మహిళలు ఈసారి ఎవరివైపు మొగ్గు చూపుతారన్నది ఆసక్తికరంగా మారింది.

## హోమ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

హైదరాబాద్, మే 7

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హోమ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా హోం ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నప్పటికీ.. పోస్టల్ బ్యాలెట్ మాత్రం కొంత మందకొడిగా సాగుతుంది. ఇక పోలింగ్ నిర్వహణ కోసం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్తోంది ఎలక్షన్ కమిషన్. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామంటోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామంటుంది. ఎన్నికల నిర్వహణలో మూడు లక్షల మంది పోలింగ్ సిబ్బంది పాల్గొంటున్నారని పేర్కొంది. ఎన్నికల విధుల్లో ఉన్నవారు దాదాపు 2,40,000 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం అప్లై చేసుకున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా హోమ్ ఓటింగ్ వేయడానికి 24,000 మందికి పైగా అప్లై చేసుకుంటే 23 వేల మందికి మాత్రమే అవకాశం కల్పించింది ఎలక్షన్ కమిషన్. మరో వెయ్యి మందికి వివిధ కారణాలవల్ల రిజెక్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఎలా సాగుతుందో ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు సిఈఓ వికాస్ రాజ్. ఇందులో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని పరిశీలించడానికి హైదరాబాద్ అబిడ్స్?లో ఉన్న ఓ పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్స్?ను సందర్శించి స్ట్రాంగ్ రూమ్, డేటా ఎంట్రీ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఎంతమంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగుల కోసం వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మే 3 నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారిగా ఈవీఎం రాండమైజేషన్ జరిగిందని, బ్యాలెట్ కమిషనింగ్ ప్రక్రియ మొదలు అయిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు త్రాగునీరు, షెడ్స్, మెడికల్ బృందాలు, షామియాన, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశించామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం వరకు హోమ్ ఓటింగ్ 50 శాతం కంటే ఎక్కువగా పూర్తయిందని తెలిపారు. ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఇంటి నుండి ఓటు వేసేందుకు ముందుకు రావాలని సూచించారు.జిల్లాలో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా ఫేసిలిటెషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా హోం ఓటింగ్ పక్రియా కూడా కొనసాగుతుందని ఇప్పటి వరకు రెండు పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటుగా కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోస్టల్ బ్యాలెట్ కూడా వినియోగిచుకుంట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్?లో ఆదివారం నాటికి 571 ఓటర్లకుగానూ 479 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల రోజు ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్?లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఓటు ప్రజాస్వామ్యం మనుగడకి వారి వారి బాధ్యతను గుర్తు చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు.

## ఏలూరు జిల్లాలో పోస్టల్ బ్యాలట్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభం

ఏలూరుజిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు ఏలూరు జిల్లాలో పోస్టల్ బ్యాలట్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని జిల్లా మీడియా సమన్వయకర్త మరియు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులు తమ ఓటుహక్కు సజావుగా ఉపయోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారన్నారు. పోలింగ్ సజావుగా జరగడానికి ప్రత్యేక కౌంటర్లు, టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేసారని, అలాగే హెల్ప్ డెస్కులు, త్రాగునీరు, మినీ వైద్య శిభిరాలు, చలువ పందిళ్ళు ఏర్పాటు చేసారని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవడానికి వస్తున్నా ఉద్యోగులకు సమాచారం అందించడానికి, సహకరించడానికి పోలింగ్ కేంద్రాల వద్ద లైజన్ అధికారులను ఏర్పాటు చేసారన్నారు. తక్షణ సమాచారం కోసం తనను 9849903321 ఫోన్ నెంబరుపై సంప్రదించ వచ్చున్నారు.

## కాపులు శెట్టిబలిజలు ఐక్యంగా ఉండాలి .. త్రిమూర్తులును గెలిపించాలి.... పిల్లి సుభాష్ చంద్రబోస్....

మండపేట

గోదావరి జిల్లాల్లో కాపులు శెట్టి బలిజలు ఏకమైతే ప్రభంజనం సృష్టించవచ్చుననీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. మండపేట పట్టణం రూరల్ మండలం శెట్టి బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం విజయ ఫంక్షన్ హాల్ లో జరిగింది. మండపేట జడ్పిటిసి కుడిపూడి భవాని అధ్యక్షత వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపేట అసెంబ్లీ నియోజకవర్గం లో కాపులు, శెట్టి బలిజ సంఘియులు సంయుక్తంగా కలసి పనిచేసి తోట త్రిమూర్తులు విజయానికి కృషి చేయాలని బోస్ పిలుపునిచ్చారు. శెట్టి బలిజలకు గౌరవం వచ్చిందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వల్లనేనని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత శెట్టి బలిజలు గుర్తింపు రాలేదన్నారు. గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రులు శెట్టి బలిజ లను నిర్లక్ష్యం చేస్తారన్నారు. గోదావరి జిల్లాల్లో రెండు ఎంపి టిక్కెట్లు, తనని రాజ్యసభకు ఎంపిక చేయడం లో జగన్ తీసుకున్న నిర్ణయం యావత్ భారత దేశంలో చర్చనీయాంశమైందన్నారు. శాశన మండలికి ఒకరు,శాశనసభకు ఐదుగురు కి టికెట్ లు ఇచ్చారన్నారు. ఎన్.డి.ఏ కూటమి కంటే ఎక్కువగా ఇచ్చారని బోస్ వివరించారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి రుణం తీర్చుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండపేట నుంచి తోట త్రిమూర్తులు ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. 2019 ఎన్నికల్లో తాను మండపేట నుంచి పోటీ చేసినప్పుడు ఇక్కడ పెత్తందార్లు తనను ఓడించారన్నారు.మరోసారి ఆ తప్పు జరుగకూడదనీ పేర్కొన్నారు. రామచంద్రపురం , మండపేట అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ రెండు కులాలు ఐకమత్యంగా ఉండి రెండు నియోజకవర్గాలలో వైసిపి అభ్యర్థులను గెలిపించి శెట్టి బలిజల సత్తా చాటాలని బోస్ కోరారు.

## ప్రారంభమైన ఎపెసెట్ ఫేషియల్ రికగ్నైజేషన్ తో పరీక్ష

హైదరాబాద్, మే 7

తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించనున్నపరీక్షలు మే 7న ప్రారంభమయ్యాయి. మే 11 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఇందులో మే 7, 8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా విభాగాలకు; మే 9 - 11 వరకు ఇంజినీరింగ్ విభాగానికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయాతేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలను మే నెలాఖరులో విడుదల చేయనున్నారు. ఎప్‌సెట్ పరీక్షల్లో తొలిసారిగా ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. 74169 23578, 74169 08215 నంబర్లను సంప్రదించవచ్చు. కాగా గతంలో ఎంసెట్‌గా ఉన్న పేరును ఈసారి ఎప్‌సెట్‌గా మార్చి పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతంతో పోలిస్తే.. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు 35 వేలమంది అదనంగా దరఖాస్తు చేసుకున్నారు. పెరిగిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకుని 20 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇంజినీరింగ్‌కు 166, అగ్రికల్చర్ ఫార్మసీకి 135 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలుగు, ఉర్దూల్లో ఏవైనా పొరపాట్లుంటే ఇంగ్లిష్ ప్రశ్నపత్రాలనే ప్రామాణికంగా తీసుకోనున్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి సమాధానం ఇవ్వాలి.

పరీక్ష విధానం..

మొత్తం 160 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో రాతపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్/ బయాలజీ నుంచి 80 ప్రశ్నలు- 80 మార్కులు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు-40 మార్కులు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు-40 మార్కులు. ప్రతిప్రశ్నకు ఒకమార్కు ఉంటుంది. పరీక్షలో నెగెటివ్ మార్కులు ఉండవు. ఇంటర్ మొదటి సంవత్సరం, చివరి సంవత్సరం నుంచి 100 శాతం సిలబస్‌తో పరీక్ష నిర్వహించనున్నారు. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మూడు భాషల్లో ఎప్‌సెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉర్దూ మీడియం వారికి చివరి రోజు అయిన మే 12న పరీక్ష ఉంటుందని, వీరికి ఉర్దూ/ఇంగ్లిష్ భాషల్లో పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష కేంద్రాలివే...

ఎప్‌సెట్ పరీక్షల కోసం రెండు రాష్ట్రాలు కలిపి మొత్తం 135 కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ; 166 కేంద్రాల్లో ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణలో హైదరాబాద్, నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేటలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఏపీలో కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరులలోని కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి.

విద్యార్థులకు ముఖ్య సూచనలు..

? ఈసారి పరీక్షల్లో తొలిసారిగా ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలుచేయనున్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో జతచేసిన ఫొటోను, అభ్యర్థి ముఖంతో సరిపోల్చి లోపలికి అనుమతిస్తామన్నారు.

? పరీక్ష సమయానికి 90 నిమిషాల ముందు నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమయ్యాక నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు.

? పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను పరీక్ష హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డు లేదా కాలేజీ ఐడీ కార్డును పరీక్ష రోజు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ముఖ గుర్తింపుతోపాటు.. బయోమెట్రిక్ విధానంలో ఫొటో, కుడిచేతి వేలిముద్ర ద్వారా సరిపోల్చి లోపలికి అనుమతిస్తారు.

# సర్వశక్తులు ఒడ్డుతున్న టీడీపీ

గుంటూరు, మే 7,

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్లే కనపడుతున్నాడు. ఆయన ప్రతి అడుగులోనూ టెన్షన్ కనిపిస్తుంది. నిర్ణయాల్లో కావచ్చు.. ప్రసంగాల్లో కావచ్చు.. కొంత తేడా కనపడుతుంది. గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు చంద్రబాబు ప్రసంగాల్లో కొంత మాటలు కూడా స్లిప్ అవుతున్నారు. ఎప్పుడు ఏం మాట్లాడతారో తెలియని పరిస్థితి. గత ఎన్నికల్లో లక్ష కోట్ల రూపాయలు అవినీతి చేశాడని జగన్ పై పదే పదే ఆరోపణలు చేసినప్పటికీ జనం నమ్మలేదు. ఈసారి చంద్రబాబు తాను చేసే ఆరోపణలను జనం నమ్ముతారా? లేదా? అన్న భయంలో మాత్రం ఆయన ఉన్నట్లే స్పష్టంగా కనిపిస్తుంది. తాను జైలులోకి వెళ్లి వచ్చిన తర్వాత కూడా సింపతీ పెద్దగా కనపడక పోవడంపై కూడా టీడీపీ అధినేత కొంత కలత చెందుతున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.. గత నలభై ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా రాజకీయంగా వత్తిడిని అయితే ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రజాగళంలో చేస్తున్న ప్రసంగాలే ఇందుకు అద్దం పడుతున్నాయి. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తానని చెప్పేదానికంటే ఎక్కువగా జగన్ ప్రభుత్వంపై విమర్శలకు ఆయన తీవ్ర స్థాయిలో దిగుతున్నారు. సాధారణంగా సూపర్ సిక్స్ తో పాటు మ్యానిఫెస్టోను కూడా విడుదల చేసిన తర్వాత వాటి గురించి ఎక్కువ చెప్పాల్సి ఉండగా, వాటిని పెద్దగా ప్రస్తావించకుండా జగన్ మరోసారి అధికారంలోకి వస్తే మీ ఆస్తులు కాజేస్తారంటూ ప్రజలను భయపెట్టే పనిలో ఉన్నారు. ఎవరైనా భయపడే వారే ఎదుటి వారిని భయపెడతారన్న మానసిక నిపుణులు చెబుతున్న మాటలకు అనుగుణంగానే ఆయన రాజకీయ ప్రసంగాలు సాగుతున్నాయని చెప్పాలి. అందుకే ఆయన వత్తిడిలో ఉన్నారని చూసే వారికి ఎవరికైనా అర్థమవుతుంది. ఇక చంద్రబాబు నాయుడు గతంలో మాదిరి కాకుండా అంతా తానే అయి ప్రజాగళం పేరిట విస్తృతంగా పర్యటిస్తున్నారు. చివరకు తన కుమారుడు లోకేష్ ను కూడా మంగళగిరిలోనే ఎక్కువ సేపు ఉండేలా కట్టడి చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో ఎంచుకున్న ప్రాంతాల్లోనే ఉమ్మడి సభలను ఏర్పాటు చేస్తున్నారు. అదీ తనపైన, తనకుటుంబంపైన తీవ్ర స్థాయి విమర్శలు చేసే వైసీపీ నేతల నియోజకవర్గాలకే పవన్ ను వెంట తీసుకెళుతున్నారు. ఇక మోదీ, అమిత్ షా సభలకు కూడా ఆయన హాజరవుతూ తన బలం.. బలగం ఇదీ అని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు అనేది ఎంత అవసరమో ఆయన పార్టీ నేతలకు తెలియజేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఏ మాత్రం తేడా జరిగినా పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని ఆయనకు తెలియని విషయం కాదు. అందుకే ప్రతి అడుగూ ఆచి తూచి వేస్తున్నారు ముఖ్యంగా మ్యానిఫేస్టోలో అలివి కాని హామీలు ఇవ్వడం కూడా ఆ వత్తిడి కారణమని చెప్పక తప్పదు. బడ్జెట్ సరిపోతుందా? లేదా? అన్నది ఆలోచించకుండా యాభై ఏళ్లు వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పింఛను ఇస్తామని చేసిన ప్రకటన కూడా ఇందులో భాగమేనని చెప్పక తప్పదు. అలాగే ఇంట్లో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం ఇస్తామని, పింఛను మొత్తాన్ని నాలుగువేల రూపాయలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం కావచ్చు.. రైతులకు ఇరవై వేల రూపాయల పెట్టుబడి సాయం అవ్వొచ్చు... దీంతో పాటు కులాల వారీగా కార్పొరేషన్లకు కేటాయించే నిధులు కూడా వేల కోట్లు కేటాయిస్తామని చెబుతూ ఆయన ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన ఇన్ని రకాల హామీలు, వాగ్దానాలు ఇస్తున్నారంటే ఎంత వత్తిడిలో ఉన్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మరి చివరకు గెలుపు ఎవరికి దక్కుతుందో తెలియదు కానీ చంద్రబాబు మాత్రం అంత హ్యాపీగా లేరన్నది వాస్తవం.

## కూటమికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న నారా రోహిత్

అభివృద్ధి కాదని విధ్వంసానికి ఓటు వేసి నష్టపోయాం

తప్పును సరిదిద్దుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది

ల్యాండ్, శ్యాండ్, మైన్, వైన్ ద్వారా కోట్లు కొట్టేసిన దుర్మార్గుడుకి గుణపాఠం చెబుదాం

గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే సమర్థుడు చంద్రబాబును సీఎం చేద్దాం

ల్యాండ్ టైటిలింగ్ తీసుకువచ్చి పేదల భూములను కొట్టేయాలని చూస్తున్న కబ్జాదారుడు జగన్ రెడ్డి

ఉమ్మడి కృష్ణా జిల్లా నందిగామ, కైకలూరు రోడ్ షోలో నారా రోహిత్ ఉద్ఘాటన

ఉమ్మడి కృష్ణా జిల్లా:- తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రముఖ సినీ నటుడు నారా రోహిత్ చేపట్టిన మన కోసం మన నారా రోహిత్ పర్యటన మూడో రోజు ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొనసాగింది. మొదటి నందిగామ నియోజకవర్గంలో పర్యటించి రోడ్ షో నిర్వహించిన నారా రోహిత్‌కు కూటమి నేతలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. పూలమాలలతో మళిళలు నారా రోహిత్‌ను సత్కరించారు. అనంతరం చందర్లపాడులో నిర్వహించిన బహిరంగ సభలో నారా రోహిత్ పాల్గొన్నారు.

చందర్లపాడు బహిరంగ సభలో నారా రోహిత్ మాట్లాడుతూ...

"అభివృద్ధి చేసే నాయకుడు కాదని విధ్వంసం చేసే రాక్షసునికి ఓటేసి గత ఎన్నికలలో మనం మోసపోయాం.. ఓటేసిన తప్పుకి ఐదేళ్లు శిక్ష అనుభవించాం.. ఇప్పుడు ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశం ఓటు అనే ఆయుధం ద్వారా మనకు వచ్చింది.. ఒక్కసారి ఓటేసినందుకే రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయింది. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలతో పోటీపడే స్థాయికి చంద్రబాబు తీసుకువెళ్ళారు.. కానీ నేడు చిన్న రాష్ట్రాలతో కూడా జగన్ రెడ్డి నిర్వాకం వలన పోటీ పడలేక పోతున్నాం.. ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు వలస పోతున్నాం.. రాష్ట్రంలో అవినీతి, దోపిడి, అరాచకాలు తప్ప ఉద్యోగ కల్పన లేదు.. చంద్రబాబు ఎంతో కష్టపడి తీసుకొచ్చిన కియా, లూలు కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసిన కీచకుడు జగన్మోహన్ రెడ్డి.. రాష్ట్రంలో ల్యాండ్, శ్యాండ్, మైన్, వైన్ మాఫియాతో వేల కోట్లు దోచుకున్న దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి.. కొత్తగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చి మన భూములను కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్న కబ్జాదారుడు జగన్మోహన్ రెడ్డి.. మరోసారి అవకాశం ఇస్తే మన ఆస్తులు మన సొంతం కాకుండా పోతాయి. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఉత్తిత్తి బటన్‌లు నొక్కి ప్రజలను మోసం చేస్తున్నాడు.. వైసిపి పాలనలో అన్ని వర్గాలపై దాడులు.. వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయి. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు వరప్రసాద్ అనే వ్యక్తికి శిరోముండనం చేశారు.. మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్‌ను పిచ్చోన్ని చేసి హత్య చేశారు.. పెళ్లి కానుక, చంద్రన్న కానుకలు, దళితులకు విదేశీ విద్య వంటి ఎన్నో సంక్షేమ పథకాలను దూరం చేశారు.. పేదవారికి అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను ఆపేశారు. అవన్నీ తిరిగి మళ్లీ అమలు చేయాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలి. మీరందరూ మే 13న ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య, ఎంపీ అభ్యర్థి కేసినేని చిన్నికి ఓటు వేసి గెలిపించాలి" అని నారా రోహిత్ కోరారు.

హాస్య నటుడు రఘు మాట్లాడుతూ : సునామి చూడలేదు, మిడతల దండు చూడలేదు, కానీ పసుపు సైన్యం కనబడుతుంది.. చందర్లపాడు పసుపు సైన్యముగా మారిపోయిందని అన్నారు.. రాష్ట్రంలో అభివృద్ధి లేదు, నిరుద్యోగులకు ఉద్యోగం లేదు, తాగునీరు లేదు, వ్యవసాయానికి సాగునీరు లేదు, అవసరమా ఇలాంటి అసమర్థ ప్రభుత్వము.. రాష్ట్రాన్ని బాగు చేసే సమర్థవంతమైన చంద్రబాబు నాయుడు గారిని గెలిపించుకుందాం.. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించమని కోరారు.

కైకలూరులో నారా రోహిత్ రోడ్ షో...

అనంతరం కైకలూరులో నారా రోహిత్ రోడ్ షో నిర్వహించారు. నారా రోహిత్ ఎన్నికల ప్రచారంలో అడుగడున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ... "కైకలూరులో ఏదైనా అభివృద్ధి జరిగిందా అంటే అది కామినేని శ్రీనివాస్ మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లోనే జరిగింది. 2019లో అరాచక పాలన ఏర్పడ్డాక అభివృద్ధి నిలిచిపోయింది. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అభివృద్ధి చేసిందేది లేదు. రోడ్లు దారుణంగా ఉన్నాయని ప్రజలు ఈ దుస్థితికి రావడానికి కారణం జగన్ రెడ్డి ప్రభుత్వమే. నిలిచిపోయిన అభివృద్ధి తిరిగి గాడిలో పడాలన్నా, యువతకు ఉద్యోగాలు, ఉన్నత విద్య అందాలన్నా చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యం. అందుకు ప్రజలు చేయాల్సిందల్లా తెలుగుదేశం, జనసేన బలపరిచిన బిజెపి కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపైన, జనసేన, బిజెపిలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఏలూరు పార్లమెంటు అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలి" అని పిలుపునిచ్చారు.

ఈ రోడ్డు షోలలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల కన్వీనర్ అట్లూరి నారాయణరావు, తాడికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## నిధుల విడుదలకు బ్రేక్

విజయవాడ, మే 7

ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే అమలులో ఉన్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల విడుదలకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. ప్రస్తుతం ఏపీలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు, సార్వత్రిక ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. నోటిఫికేషన్ విడుదల కాగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున నిధుల విడుదలకు అడ్డుకట్ట పడింది. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో ఇప్పటికే పలు ఈసీ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. తాజాగా నిధుల విడుదల విషయంలోనూ అంతే వ్యవహరించింది. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రతి నెల విడుదల చేస్తున్న సంక్షేమ పథకాల నిధుల విడుదల కోసం ఈసారి కూడా ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరింది. అయితే, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిధుల విడుదల కుదరదని ఈసీ తేల్చిచెప్పింది. ఈ మే నెలలో విడుదల చేయాల్సిన సంక్షేమ పథకాల్లో భాగంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ (విద్యాదీవెన), ఇన్ పుట్ సబ్సిడీ (రైతు భరోసా) లాంటి పథకాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వీటి విడుదలకు పర్మిషన్ ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇవి గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న పథకాలు అని, కొత్త పథకాలు కావని స్పష్టత ఇచ్చింది. కాబట్టి, ఇవి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి రావని వివరించింది. అయినప్పటికీ ఎన్నికల సంఘం మాత్రం సదరు సంక్షేమ పథకాల సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయడానికి పర్మిషన్ ఇవ్వలేదు.ఏపీలో గత నెల నుంచే ఆసరా పింఛన్లను నేరుగా ఇంటికి వెళ్లి అందించే ప్రక్రియను ఈసీ ఆపేసింది. అంతకుముందు వరకూ ఆసరా పెన్షన్లను ఇంటింటికీ వాలంటీర్లు వెళ్లి అందించేవారు. అందుకు ఈసీ ఒప్పుకోకపోవడం.. అంతకుముందే వాలంటీర్లను దూరం పెట్టాలనే ఆదేశాలు ఉండడంతో.. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులను జమ చేశారు. కదల్లేని స్థితిలో ఉన్నవారి ఇంటికి సచివాలయ సిబ్బంది ద్వారా అధికారులు డబ్బులను పంపిణీ చేయించారు. దీనిపైనే అధికార పార్టీ, విపక్షపార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్, ఇన్ పుట్ సబ్సిడీ పథకాల డబ్బులను విడుదల చేయడానికి ఈసీ నిరాకరించింది.

## లౌకికవాదం ముసుగులో హిందుత్వాన్ని దూషిస్తే ఊరుకోము

జగిత్యాల లౌకికవాదం ముసుగులో భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఎవరైనా హిందూ మతాన్ని, హిందూ ధర్మాన్ని, హిందూ దేవి దేవతలను దూషిస్తే ఊరుకునేది లేదనిబీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ హెచ్చరించారు.మంగళవారం జిల్లాలోని పెగడపెల్లి మండల కేంద్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో బీజేపీకి పెరుగుతున్న ఆధరణను చూసి జీర్ణించుకోలేక హిందూ సమాజాన్ని విడదీయడం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్ర పన్నుతున్నాయని అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి మైనార్టీ ప్రజల సంతుష్టీకరణ కోసం అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట కాకముందే అయోధ్య రాముని అక్షింతలు అని రేషన్ బియ్యానికి పసుపు రాసి గ్రామాల్లో పంచారని బహిరంగ వేదికల ద్వారా విమర్శించడం ముఖ్య మంత్రికి హిందువుల పట్ల ఉన్న దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. కొమురం భీం జిల్లాలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకిస్తాన్ ప్రేమికుడు రోహింగ్యాల నాయకుడు అద్దంకి దయాకర్ బిజెపి వాళ్లు మేము హిందువులం హిందువులం అంటున్నారు శ్రీరాముడు మీకేమైనా చిన్నయ్య అవుతాడా సీతమ్మ మీకేమైనా చిన్నమ్మ అవుతుందా మీరేమైనా రాముని వంశంలో పుట్టారా అంటూ చేసిన వ్యాఖ్యలు దేశములోని కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని అడ్డం దిడ్డం మాట్లాడిన అద్దంకి దయాకర్ హిందూ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పలు వేదికలపై అద్దంకి దయాకర్ జై సోనియమ్మ అంటూ సంభోదిస్తాడు మరి అలాంటప్పుడు సోనియాగాంధీ దయాకర్ కు ఏమైనా అమ్మ అవుతుందా లేదా రాజీవ్ గాంధీ తండ్రి అవుతాడా స్పష్టం చేయాలని ప్రశ్నించారు.సాక్షాత్తు ఒక ప్రధానమంత్రి వ్యక్తిగత జీవితం మీద మాట్లాడిన దయాకర్ అదే సోనియాగాంధీ వ్యక్తిగత జీవితం మీద వివాహానికంటే ముందు ఒక క్లబ్ డ్యాన్సర్ అని ఎందుకు మాట్లాడడం లేదన్నారు. మోడీ అమిత్ షా లను ఏక వచనంతో సంబోధిస్తూ రారా పోరా అని మాట్లాడడం చూస్తే కాంగ్రెస్ పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతుందని అభద్రత భావంతో ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మతప్రాతిపదికన దేశాన్ని మూడు ముక్కలు చేసి ముస్లింల కోసం ప్రత్యేక దేశం ఇచ్చి ఇవాళ ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ఏ పార్టీ మతతత్వ పార్టీయో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు.

# పవర్ ఛాలెంజ్.. పక్కా ప్లాన్

హైదరాబాద్, మే 7

ఎండలతో పగటి ఉష్ణోగ్రతలు తెలంగాణలో 46 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో పంకాలు, ఏసీలు నిరవధికంగా వినియోగిస్తున్నారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవడంతో తెలంగాణలో విద్యుత్ డిమాండ్, వినియోగం రెట్టింపు స్థాయిలో పెరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ నెల 3న అత్యధికంగా 89.71 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. గతేడాది సరిగ్గా అదే రోజు 58.34 మిలియన్ యూనిట్ల వినియోగంతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 2న 228.50 మి.యూ. వినియోగం నమోదైంది. గతేడాది మే 2 (151.71 మి.యూ.)తో పోలిస్తే ఇది మరింత అదనం. ముందు ముందు హైదరాబాద్‌లో రోజువారీ వినియోగం 90 మిలియన్ యూనిట్లకు పెరిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు. దాదాపు వర్షాలు పడేదాకా ఇదే పరిస్థితి. మే నెలాఖరు దాకా విద్యుత్ వినియోగం ఇదే తీరుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్ ముగిసే వరకు ప్రతి 11 కేవీ ఫీడర్‌కు ఇన్‌ఛార్జిగా ఒక ఇంజినీర్‌ను నియమించామని అధికారులు చెబుతున్నారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో పని చేస్తున్న దాదాపు 300 మంది ఇంజినీర్లకు ఆపరేషన్ విధులు కేటాయించారు. సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే అకౌంటింగ్ సిబ్బందికి సైతం విధులు అప్పగించాలని ఆదేశించారు. వేసవి డిమాండ్ నేపథ్యంలో అదనంగా 4,353 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. మరో 250 ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని విద్యుత్ సంస్థ ప్రధాన అధికారులు చెబుతున్నారు.తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొలువు తీరాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆయా రంగాలకు చెందిన అధికారులు, నిపుణులతో తొలి నెల రోజుల పాటు ప్రత్యేకంగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎలా ఉంటుంది? వేసవి రోజుల్లో ఏమేరకు పెరుగుతుంది? రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం, కొనుగోలు అంశాలపై సుధీర్ఘంగా చర్చలు జరిపారు. అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ఫలితాలే ఇప్పుడు ప్రజలకు అందుతున్నాయని అంటున్నారు అధికారులు.గత ఏడాది మే తొలివారంలో రాష్ట్ర విద్యుత్ వినియోగం సరాసరి 150 ఉంచి 160 మిలియన్ యూనిట్లుగా ఉండేది. ఇప్పుడు ఈ విద్యుత్ వినియోగం 225 నుంచి 230 మిలియన్ యూనిట్లు ఉంది. రాష్ట్ర స్థాపిత విద్యుత్ విద్యుత్ ఉత్పత్తి 100 మిలియన్ యూనిట్లు ఉంటే.. దాదాపుగా 150 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేసి ప్రజలకు పవర్ కట్స్ లేకుండా విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఉప ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారు.తాత్కాలిక అవసరాల కోసం విద్యుత్ కొనుగోళు చేపడుతున్నా.. భవిష్యత్ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేందుకు తగు నిర్ణయాలను కూడా ఈ ప్రభుత్వం తీసుకుంది. ముఖ్యంగా ఆల్టర్నేటివ్ పవర్ తో పాటు, గ్రీన్, సోలార్ ఎనర్జీ దిశగా అడుగులు వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పటికు స్పష్టంగా చెప్పారు.

## షర్మిల మరో 9 ప్రశ్నలు

విజయవాడ, మే 7

మరో తొమ్మిది ప్రశ్నలతో సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల లేఖ రాశారు. గత కొద్ది రోజులుగా రోజుకో 9 ప్రశ్నలతో అన్నయ్య జగన్‌కు లెటర్స్ రాస్తున్నారు. ఇవాళ(7 మే 2024) రాజధాని, ఇతర మౌలిక సదుపాయాలు, స్మార్ట్ సిటీలపై ప్రశ్నలు సంధించారు.

జగన్‌కు షర్మిల సంధించిన ప్రశ్నలు ఏంటంటే....

1) స్మార్ట్ సిటి, హెరిటేజ్ సిటీగా కేంద్రం గుర్తించిన రాజధాని అమరావతిని మూడు రాజధానుల వాదనతో ఎందుకు విధ్వంసం చేశారు.? పోనీ విశాఖలో అయినా మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదు? కర్నూలులో ఏం నిర్మాణాలు జరిపారు?

2) రాష్ట్ర విభజన టైంలో రెవెన్యూ రాబడులు తెలంగాణకు 51 వేల కోట్లు, ఏపికి 65 వేల కోట్లు ఉండేవి. ఇప్పుడు తెలంగాణ రాబడులు 1.59లక్షల కోట్లకు పెరిగాయి. ఏపి 1.58లక్షల కోట్ల మధ్య ఉన్న వాస్తవాన్ని కాదనగలరా ?

3) రాష్ట్రంలో 5 ఏళ్లలో మౌలిక సదుపాయాల కల్పన ఎందుకు చేయలేదు ?

4) ఐటీ రంగాన్ని పూర్తిగా ఎందుకు నిర్లక్ష్యం చేశారు ? ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ 1.81 లక్షల కోట్లు సాధిస్తే ఏపీ కేవలం 962 కోట్లా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

5) విశాఖ రైల్వే జోన్ ప్రకటన జరిగినా అమలు కాలేదు అంటే మీరు భూ కేటాయింపు చేయలేదు. దీనికి నైతిక బాధ్యత మీది కాదా?

6) పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేవలం కక్ష్య, నిర్లక్ష్యంతో వదిలేసిన మాట వాస్తవం కాదా ?

7) కనిగిరి, ఏర్పేడులో నిమ్జ్ అనుమతులు వస్తే 25 వేల ఎకరాల భూ కేటాయింపులు జరపని మాట వాస్తవం కాదా ?

8) విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారు?

9) వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా మీరు ఏం చేశారు ? కేంద్రం ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీని ఎందుకు సాధించలేక పోయారు ? అంటూ తొమ్మిది ప్రశ్నలతో లేఖ రాశారు.

## పవన్ ను గెలిపించండి అన్నయ్య సందేశం

హైదరాబాద్, మే7

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక దృశ్యం ఆవిష్కృతమైంది. పిఠాపురంలో పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ మెగాస్టార్ చిరంజీవి వీడియో విడుదల చేశారు. అందరిలో ఆఖరివాడు అయినప్పటికీ మంచి చేయడంలో ముందుండే వ్యక్తిని గెలిపించే అంతా మంచే జరుగుతుందని చిరంజీవి ఆకాంక్షించారు. “కొణిదెల పవన్ కల్యాణ్. అమ్మ కడుపున ఆఖరివాడిగా పుట్టినా అందరికీ మంచి చేయాలని మేలు జరగాలని విషయంలో ముందువాడుగానే ఉంటాడు. తన గురించి కంటే జనం గురించి ఎక్కువ ఆలోచించే మనస్తత్వం నా తమ్ముడు కల్యాణ్ బాబుది. ఎవరైనా అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏదైనా చేయాలని అనుకుంటారు. కానీ కల్యాణ్ తన సొంత సంపాదనను కౌలు రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ఖర్చు పెట్టడం, సరిహద్దుల దగ్గర ప్రాణాలు ఒడ్డి పోరాడే జవానుల కోసం పెద్ద మొత్తంలో ఇవ్వడం, అలాగే మత్స్యాకారులు ఇలా ఎందరికో తను చేసిన సహాయం చూస్తుంటే ఇలాంటి నాయకుడు కదా జనాలకు కావాల్సింది అనిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే సినిమాల్లోకి తను బలవంతంగా వచ్చాడు. రాజకీయాల్లోకి మాత్రం ఇష్టంతోనే వచ్చాడు. ఏ తల్లికైనా తన కొడుకు కష్టపడుతుంటే గుండె తరక్కుపోతుంది. ఏ అన్నకైనా తన తమ్ముడు అనవసరంగా మాటలు పడుతుంటే బాధేస్తుంది. అలా బాధపడుతున్న నా తల్లికి ఈ అన్నయ్యగా ఓ మాట చెప్పాను. ఎంతో మంది తల్లుల కోసం వారి బిడ్డల భవిష్యత్ కోసం చేసే యుద్ధం అని నా తల్లికి చెప్పాను. మన బాధ కంటే అది ఎంతో గొప్పది అన్నాను.

అన్యాయాన్ని ఎదిరించకుండా మౌనంగా ఉండే మంచి వారి వల్ల ప్రజాస్వామానికి మరింత నష్టం అని నమ్మి జనం కోసం జనసైనికుడు అయ్యాడు. తను బలంగా నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని రాజకీయాలకు అంకితం చేసిన శక్తిశాలి పవన్. ప్రజల కోసం రాష్ట్రం కోసం ఆ శక్తిని వినియోగించాలి అంటే... చట్టసభల్లో అతని గొంతును మనం వినాలి. జనమే జయం అని నమ్మే జనసేనాని ఏమి చేయగలడో చూడాలి అంటే మీరు పిఠాపురం ప్రజలు కల్యాణ్ గెలిపించాలి. మీకు సేవకుడిగా ,సైనికుడిగా అండగా నిలబడతాడు. మీకు ఏమైనా సరే కాపాడతాడు. మీ కలలను నిజం చేస్తాడు. పిఠాపురం వాస్తవ్యులకు మీ చిరంజీవి విన్నపం గాజు గ్లాసు గుర్తుకు మీ ఓటు వేసి పవన్ కల్యాణ్‌ను గెలిపించండి. “ అని తన వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో చిరంజీవి పోస్టు చేశారు. ఇది పోస్టు చేసిన కొద్ది సమయంలోనే వైరల్‌గా మారిపోయింది.

## ఆ రెండు రోజులు పెయిడ్ హాలీడే

హైదరాబాద్, మే 7

లోక్‌సభ ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో పాల్గొనేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు మే 13న పెయిడ్ హాలిడే ప్రకటించింది. ఎన్నికల ఫలితాల తేదీ జూన్ 4న కూడా వేతనంతో కూడా సెలవును ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేతనంతో కూడిన సెలవులను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మే 13, 2024న ఒకే దశలో జరగనున్నాయి. కాగా మొత్తం ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. రాష్ట్రంలో వడగాలుల కారణంగా 12 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంటే.. ఒక గంట పొడిగించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో భాగమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు మే 13న రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది.

## 3 కోట్ల మన్ననలు పొందిన యాప్

మెదక్, మే 7

పంటలకు సోకే వివిధ రకాల తెగుళ్లను, క్రిమి కీటకాలాను గుర్తించడంలో, ఈ మొబైల్ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు అంటున్నారు. మూడు కోట్ల మంది రైతులు ఉపయోగిస్తున్న ఇప్పటివరకు 60 రకాల పంటలకు సంబంధించిన 10 కోట్ల ఫోటోలను ప్లాంటిక్స్ యాప్ లోకి అప్లోడ్ చేయగా, వాటిని విశ్లేషించి, సుమారుగా 700 రకాల తెగుళ్లను, క్రిమికీటకాలు ప్లాంటిక్స్ యాప్ గుర్తించందని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు సులువుగా అర్థం చేసుకోవడానికి, వారి వారి భాషలోనే సమాచారం ఇచ్చేవిధంగా ఈ యాప్ ని అభివృద్ధి చేసారు ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు. ప్రపంచవ్యాప్తంగా, అత్యంత ప్రాచుర్యంలో ఉన్న 20 భాషల్లో ప్లాంటిక్స్ యాప్ తన సేవలను అందిస్తుంది. పదేండ్ల కింద తయారు చేసిన ఈ యాప్ యొక్క వాడకం ఇటీవల బాగా పెరిగింది. సామాన్య రైతులలో కూడా మొబైల్ ఫోన్ వాడకం బాగా పెరగడంతో రైతులు వ్యవసాయ విజ్ఞానాన్ని మొబైల్ ద్వారా తెలుసుకుంటున్నారనే దానికి నిదర్శనం ఈ మార్పు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సహాయంతో, ఈ మొక్కకు, ఆ తెగులును, క్రిమికీటకాలు ఎలాంటి మందులు వాడాలని ప్లాంటిక్స్ యాప్ రైతులకు సూచిస్తుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు తెలిపారు. టెక్నాలజీ ని ఉపయోగిస్తూ రైతులకు యాజమాన్య పద్ధతుల పైన సులువుగా సలహాలాలు ఇవ్వటమే ఇక్రిశాట్ లక్షమని, ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ జాక్వెలిన్ డి ఆరోస్ హ్యూస్ తెలిపారు. టెక్నాలజీ వినియోగం రోజు రోజుకు పెరుగుతున్న సమయంలో, రైతులు అందరు కూడా ఇప్పుడు మొబైల్ ఫోన్ వాడుతున్నారని, దానివలన ప్లాంటిక్స్ వినియోగం పెరిగిందని ఆమె తెలిపారు. ప్లాంటిక్స్ వల్ల ఉపయోగం ఉండటం వలెనే, రైతులు ఆ మొబైల్ యాప్ ని విరివిగా వాడుతున్నారని ఆమె అన్నారు. రైతులకు ఇప్పుడు ప్లాంటిక్స్ తో అందించే సేవలను కూడా పెంచాలని ఆ సంస్థ యోచిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా, మారుమూల గ్రామాల్లాలో కూడా చిన్న చిన్న కమతాల్లో పంటలు పండిస్తున్న రైతులు కూడా ఈ యాప్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్లాంటిక్స్ యాప్ సిమోన్ స్త్రే మాట్లాడుతూ ప్లాంటిక్స్ ప్రయాణంలో ఎందరో పాత్ర ఉన్నదని అయన కొనియాడారు. పది సంవత్సరాలు పూర్తీ చేసుకున్న సందర్భంగా, తాము ఆ యాప్ ని రైతులకు మరింత ఉపయోగపడే విధంగా ముందడుగు వేస్తున్నామని అయన ప్రకటించారు. రాబోయే రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగల సంస్థలతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని సిమోన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, ప్లాంటిక్స్ సాధించిన పురోగతి పైన ఒక బ్రోచర్ విడుదల చేసారు. ప్లాంటిక్స్ అబివృద్ధి లో సహకరించిన సంస్థలకు, ఉద్యోగాలకు సిమోన్ కృతజ్ఞతలు తెలిపారు.

## సొంతూళ్లకు జనం

హైదరాబాద్, మే 7

: ఎన్నికలకు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉండడంతో నగర ప్రజలు తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పిల్లలకు వేసవి సెలవులు, ఇటు ఎన్నికలు ఉండడంతో వారం రోజుల ముందే ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. ఈనెల 13న తెలంగాణలో లోక్ నభ ఎన్నికలకు పోలింగ్......ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఏపీకి చెందిన నగరవాసులకు హైదరాబాద్ తో పాటు తమ సొంత గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉండడంతో.... గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అక్కడ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే ఆర్టీసీ బస్సులకు, రైళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ ట్రైన్స్ ఇప్పటికే రద్దీ పెరుగుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కోచ్ లలో రిజర్వేషన్లు కూడా త్వరగా ముగుస్తున్నాయి. ఇటు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినప్పటికీ......గడిచిన రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. సాధారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షలు రాకపోకలు సాగిస్తే.....గత కొద్ది రోజులుగా ఆ సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరిందని అధికారులు అంటున్నారు. అయితే ఈసారి సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, వాచ్ మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా పని చేసే లక్షలాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉంటే హైదరాబాద్ లో స్థిరపడ్డ ఏపీ ప్రజలను తమ సొంతూళ్లకు తరలించేందుకు రాజకీయ పార్టీలు ప్రైవేట్ బస్సులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాయట. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. సుమారు 1500 ఆర్టీసీ బస్సులు ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆలోచిస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సైతం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచేందుకు యోచిస్తోంది. ఆర్టీసీ బస్సుల సంగతి ఇలా ఉంచితే.....అటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. ప్రైవేట్ బస్సులో బుకింగ్స్ కూడా పెరిగిపోయాయి. సాధారణం కంటే నగరంలో 1000 ప్రైవేట్ బస్సులు అదనంగా ఏపీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, సికింద్రబాద్, కేపీహెచ్బీ నుంచి అధిక బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.

## భారీగా పెరుగుతున్న అద్దెలు

హైదరాబాద్, మే 7

వేగవంతంగా పెరిగిపోతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. నగరం నాలుగు దిశలలో డెవలప్ మెంట్ పరుగులు తీస్తోంది. ఇక్కడ అన్ని ప్రాంతాల వారూ ఉండదగిన వాతావరణం ఉండటం ప్లస్ పాయింట్. పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన రవాణా సౌకర్యాలు ఉండటం మరో ప్లస్ పాయింట్. అయితే ఎక్కడ నుంచే ఉద్యగోలు, వ్యాపారాల కోసం వలస వస్తుంటారు నగరానికి వచ్చీ రాగానే వాళ్లు ముందుగా సొంతింటి కన్నా అద్దె ఇల్లు అందుబాటుల ఎక్కడ ఉంటుందా అని వెదుకుతారు. విద్యాసంస్థలు, ఉద్యోగ శిక్షణ సంస్థలు, సాఫ్ట్ వేర్ కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా ఉండటంతో సమీప ప్రాంతాలలో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. గత నాలుగేళ్లలో గృహాల అద్దెలు గణనీయంగా పెరిగాయి. నెలవారీ సగటు అద్దెలు కొవిడ్ ముందుతో పోలిస్తే ఎనిమిది ప్రధాన నగరాల్లో 25 నుంచి 30 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ టెక్ ప్లాట్‌ఫాం హౌసింగ్.కామ్ తాజాగా ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 25 శాతం పెరిగాయి. మూలధన విలువల పెరుగుదల కంటే నెలవారీ సగటు అద్దె వృద్ధి ఎక్కువగా ఉందని వెల్లడించింది. దేశీయ ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను తప్పనిసరిగా కార్యాలయానికి వచ్చి పనిచేయాల్సిందిగా ఆదేశించడంతో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. బహుళజాతి కంపెనీలు హైబ్రిడ్ మోడల్ అనుసరిస్తున్నప్పటికీ సిటీలో నివాసం అనివార్యంగా మారింది. దీంతో కొవిడ్ సమయంలో ఖాళీ అయిన నివాసాలన్నీ తిరిగి భర్తీ కావడమే కాదు.. గత రెండేళ్లలో కొత్త ఉద్యోగుల రాకతో డిమాండ్ పెరిగింది. ఇవన్నీ కూడా అద్దెల ధరలు పెరగడానికి దోహదం చేశాయి. స్థిరాస్తుల ధరలు పెరగడం కూడా : కొవిడ్ అనంతరం ఇళ్లు, భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఆ తర్వాత కూడా పెరుగుదల స్థిరంగా కొనసాగింది. ఇంటిపై వ్యయం చేసేటప్పుడు వచ్చే అద్దెలు ఎంత అనేది కూడా చూస్తారు. దీని ఆధారంగానే కొందరు పెట్టుబడి పెడుతుంటారు. ఐటీ వంటి సేవా రంగం ఆధిపత్యం ఉన్న నగరాల్లోని కొన్ని కీలక ప్రాంతాల్లో అద్దెలు 30 శాతానికి మించి పెరిగాయి. ముమ్ముందు ఇదే విధంగా రాబోయే రెండు మూడేళ్లలో సిద్ధమైన ఇళ్లు మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నప్పటికీ అద్దె డిమాండ్ కొనసాగుతుందని ఈ రంగంలోని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందులో నిరంతర వృద్ధి కారణంగా దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని చెబుతున్నారు. ఇంటి అద్దెలు పెరగడానికి ఆర్థిక అంశాలు కూడా మరో కారణం. ఇల్లు కొనాలంటే డౌన్ పేమెంట్, నెలవారీ వాయిదా, నిర్వహణ తదితర ఖర్చులు భరించాల్సి ఉంటుంది. దీంతో చాలామందికి అద్దె ఇళ్లలో ఉండటమే మెరుగైన ఎంపికగా ఉంటుంది. ఆర్థికంగా కాస్త వెసులుబాటు ఉండాలనుకునేవారికి, ఇప్పుడిప్పుడే కెరీర్ ప్రారంభిస్తున్నవారికి ఇల్లు కొనడం కంటే అద్దె ఇంట్లో ఉండటమే మంచి ఆప్షన్ గా ఉంటోంది. దీంతో దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. అద్దె మార్కెట్ పెరగడానికి మిలీనియల్ జనరేషన్ కూడా ఓ కీలక కారణం. మిలీనియల్స్ ఆస్తుల కంటే అనుభవాలకు ప్రాధాన్యత ఇస్తారు. దీంతో ఒక్కరే సొంతింట్లో ఉండటం కంటే స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో ఉండటానికే మొగ్గు చూపిస్తున్నారు. మారుతున్న జీవనశైలి, మిలీనియల్స్ కు పెరిగిన కొనుగోలు శక్తి కూడా దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగడానికి కారణాలు. మొత్తానికి చూస్తే.. దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగడానికి చాలా కారణాలున్నాయి. వాటిలో సామాజిక, ఆర్థిక అంశాలతోపాటు జీవనశైలి మార్పులు కూడా ఉన్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న యువతరం ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుంటే అద్దె ఇళ్ల డిమాండ్ భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉంది. దీంతో అద్దె మార్కెట్ లో రియల్ పెట్టుబడిదారులకు మరిన్ని అవకాశాలు పెరుగుతాయి.

## ఛలో తెలంగాణ...

హైదరాబాద్, మే 7

టార్గెట్ తెలంగాణ.. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్.. మధ్యలో బీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ను కాసేపు పక్కన పెడదాం. ఇప్పుడు జాతీయ పార్టీల మెయిన్ టార్గెట్ తెలంగాణ. ఇక్కడ ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో గెలుపు కోసం కిందా మీదా పడుతున్నాయి. తెలంగాణ.. మే 13న జరిగే ఎన్నికల్లో 17 లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రం. పదిహేడే కదా అని సింపుల్‌గా తీసేసే పరిస్థితి లేదు. ప్రస్తుత ఎన్నికల పరిణామాలు చూస్తుంటే.. ప్రతి సీటు ఇంపార్టెంటే.. అందుకే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ.. ప్రతి సీటును గెలుచుకునేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా 6 రోజులున్న విషయాన్ని గుర్తించి.. జోరు పెంచాయి. సభలు, సమావేశాలు, రోడ్ షోలతో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే చలో తెలంగాణ అని పిలుపునిస్తున్నారు జాతీయ పార్టీ నేతలు.. ఇప్పటికే రాహుల్, ప్రియాంకగాంధీ తెలంగాణలో విచ్చేశారు. బీజేపీ నుంచి ప్రధాని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా తెలంగాణ చుట్టే చక్కర్లు కొడుతున్నారు..మోడీ 8న వేములవాడ, వరంగల్ సభల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత 10న నారాయణపేట, హైదరాబాద్‌లో జరిగే సభలో కూడా పాల్గొంటారు. ఇప్పటికే జేపీ నడ్డా.. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్.. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ.. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై.. వీరంతా తెలంగాణ గడ్డపైనే ఉన్నారు.. ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇలా ఏదో ఒక దాంట్లో పాల్గొన్నారు.. పాల్గొంటున్నారు కూడా. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే తెలంగాణ నేతలతో సమావేశమైన అమిత్ షా.. ఈ టార్గెట్ ఫిక్స్ చేశారు. అప్పటి నుంచి ప్రత్యేకమైన రూట్ మ్యాప్‌తో ముందుకు వెళుతున్నారు. అటు రిజర్వేషన్ల విజయంలో బీజేపీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దు అంటూ చెలరేగిపోతున్నారు. ఎట్ ది సేమ్ టైమ్.. తెలంగాణకు బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు తప్ప మరోటి ఏం లేదని చెబుతున్నారు. మోడీ, అమిత్‌షా, నడ్డా స్పీచ్‌ల కంటే.. తెలంగాణ ప్రజలకు ఇది బాగా రీచ్ అవుతుంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా తెలంగాణలో చక్కర్లు కొడుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లిఖార్జున ఖర్గేతో పాటు.. ఇతర పార్టీ నేతలు కూడా తెలంగాణలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదిలాబాద్‌లో రాహుల్ ప్రచారం నిర్వహించగా.. ఎల్లారెడ్డిలో ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓవరాల్‌గా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ.. ప్రచారపు చివరి రోజైన 11వ తేదీ వరకు ప్రచారంలో బిజీ బిజీగా గడపనున్నారు. ఈ రెండు పార్టీల పరిస్థితి ఇలా ఉంటే.. బీఆర్ఎస్‌ది మరో బాధ అన్నట్టుగా కనిపిస్తుంది. ప్రస్తుతం సీట్ల సంగతి ఏమో కానీ.. ఓట్ బ్యాంక్‌ను కాపాడుకునే పనిలో బిజీగా ఉంది బీఆర్ఎస్.. ఈ ఎన్నికలు నిజానికి బీఆర్ఎస్ చాలా ప్రతిష్టాత్మకం.. కాంగ్రెస్, బీజేపీలకు ఇతర రాష్ట్రాలు ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ బేస్ మొత్తం తెలంగాణానే.. ఇక్కడ ఓడిందంటే.. పార్టీ కథ కంచికే.. అందుకే గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతుంది. ఇప్పటికే ఐదు నియోకవర్గాలను వదిలేసిన పార్టీ అధినేత కేసీఆర్.. మిగిలిన 12 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అటు కేటీఆర్, హరీష్‌రావు కూడా సైలెంట్‌గా ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. బట్ బీఆర్ఎస్ కేడర్‌లో కాస్త అసంతృప్తి ఉన్నట్టు కనిపిస్తుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్ పర్సంటేజ్.. 41.71 శాతం.. అదే కాంగ్రెస్‌కు 29.79 శాతం. ఇక బీజేపీకి వచ్చిన ఓటింగ్ పర్సంటేజ్ 19.65 శాతం. బట్ ఈసారి ఈ లెక్కలన్నీ తారుమారు కానున్నాయి. కావొద్దన్నది బీఆర్ఎస్ కోరిక.. కానీ అది నెరవేరే అవకాశం కనిపించడం లేదు. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులతో పాటు స్టార్ క్యాంపెయినర్లు ప్రచారంలో జోరు పెంచారు. ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇకపై మరో లెక్క.. అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికలకు కౌంట్‌డౌన్ కంటిన్యూ అవుతున్న కొద్దీ.. ప్రచారపర్వం ఊపందుకుంటుంది. ఇప్పటి వరకు జరిగిందంతా పాస్ట్.. ఇకపై ఎవరు ప్రజల మనసులు గెలుచుకుంటే.. వారే కింగ్‌లు.

### వైఎస్ కుటుంబంలో ఆస్తి వివాదాలు

## అన్నపై చెల్లెళ్ల ఫైటింగ్ దాని కోసమేనా

కడప, మే 7

ఏపీ పాలిటిక్స్‌లో నడుస్తున్న ఫ్యామిలీ వార్స్ ఆసక్తి రేపుతుంది. సీఎం, డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు. ఇలా పలువురు [illegible] ఫ్యామిలీ మెంబర్లే ప్రత్యర్ధులుగా మారారు. సొంతవారిపై పోటీకి దిగి సవాళు విసురుతూ రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారు. ఆ క్రమంలో వైసీపీ అధ్యక్షుడు జగన్‌కి మిత్రపక్షాల సవాళ్ల కంటే కుటుంబ పోరు తలనొప్పిగా తయారైంది. చెల్లెళ్లు షర్మిల , సునీత చేస్తున్న విమర్శలతో సీఎం పరిస్థితి సెన్సిటివ్‌గా మారిందంటున్నారు. చెల్లెళ్ల విమర్శలపై కొంత కాలం సైలెంట్‌గా సీఎం పరిస్థితి చేయిదాటుతుండటంతో వారిపై డైరెక్ట్ యటాక్ మొదలుపెట్టారు. ఇది చాలదన్నట్లు వారి మేనమామ, మేనత్త, తల్లులు సీన్‌లోకి వస్తూ ఎవరి వాదనలు వారు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ కుటుంబంలో మొదలైన విభేదాలు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం జగన్‌లను టార్గెట్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, డాక్టర్ వైఎస్ సునీతలు చేస్తున్న విమర్శలు కాక రేపుతున్నాయి. కడప జిల్లాలో వైఎస్ వివేకా హత్య చుట్టూ రాజకీయం తిరుగుతూ వివేకా కుమార్తె సునీత ఎన్నికల ప్రచారంలో షర్మిలకు మద్దతు ప్రకటిస్తుండటం. రాజకీయం వైసీపీ శ్రేణుల్లో గుబులు రేపుతున్నట్లు కనిపిస్తుంది. వైఎస్ ఫ్యామిలీలో అన్నతమ్ములు ఒకవైపు అక్క చెల్లెళ్లు ఒకవైపు అన్నట్లు విడిపోయి చేస్తున్న రాజకీయంతో జిల్లాలో సమీకరణలు మారిపోతున్నాయి. సోదరులపై యుద్ధం ప్రకటించి కడప ఎంపీ అభ్యర్థి షర్మిల, సునీతలు న్యాయం కోసం ధర్మం కోసం అండగా ఉండాలని కొంగు పట్టి అభ్యర్థిస్తుండటం వైఎస్ అభిమానులను ఆలోచనలో పడేస్తోందంట. ముఖ్యమంత్రి కాకముందు జగనన్న వేరు ఇప్పుడు జగనన్న వేరు అని షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు ఆ ఫ్యామిలీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. వివేకా హత్యపై షర్మిల చేస్తున్న ప్రకటనలు, జగన్ పాలనపై ఆమె చేస్తున్న విమర్శలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. అయితే జగన్‌ని షర్మిల, సునీతలు టార్గెట్ చేస్తున్న తీరును కుటుంబసభ్యులు ఖండిస్తున్నారు. వైయస్ కుటుంబ పరువును రోడ్డున పెడుతున్నారని జగన్ మేనత్త విమలా రెడ్డి ఇటీవల షర్మిల, సునీతలపై ఫైర్ అయ్యారు ? కేవలం ఆస్తులు కోసం షర్మిల అన్న జగన్ పై ఇలా చేయడం సరికాదనే వాదనను వినిపించారు విమలా రెడ్డి ఇప్పటికే మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సైతం ఆ అక్కచెల్లెల్లపై విమర్శలు గుప్పిస్తున్నారు. జగన్ వ్యతిరేకుల కుట్రలో షర్మిల, సునీత పావులుగా మారారని జగన్ అనుకూల కుటుంబ సభ్యులు ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారి వాదనలు తమకు అనుకూల వాతావరణం కల్పిస్తాయో? లేదో అన్న భయం వైసీపీ నేతలను వెంటాడుతూనే ఉందంట.. తన చిన్నాన్న హత్య కేసులో నిందితుడైన అవినాష్‌రెడ్డిపై పోటీ చేస్తున్న షర్మిల ప్రచారంలో చూపిస్తున్న దూకుడు ఆ రేంజ్లో ఉందంటున్నారు. జిల్లాలో వైఎస్ షర్మిల ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పటి నుంచి పదేపదే తన చిన్నాన వైఎస్ వివేకానంద రెడ్డిని హత్య చేయించింది అవినాష్ రెడ్డే అని ఆరోపిస్తున్నారు. ఆ ప్రచారానికి అడ్డుకట్ట వేయించడానికి వైసీపీకి చెందిన కడప మేయర్ సురేష్‌బాబు కడప జిల్లా కోర్టులో మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారు? వివేకా హత్య ప్రస్తావన ఎత్తకూడదని కోర్టు షర్మిల, సునీతలతో పాటు ప్రతిపక్షనేతలను ఆదేశించింది. అయితే ఆ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయిస్తానంటున్నారు సునీత .. హత్యజరిగి అయిదేళ్లు అవుతున్నా ఇప్పటిదాకా నిందితులపై చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తునే ఉన్నారు. కొద్దీ రోజుల క్రితం ప్రచారంలో భాగంగా పులివెందుల కేంద్రంగా వివేకా కుమార్తె సునీత చేసిన సవాల్ స్థానికంగా పెద్ద సంచలనమే రేపింది. అవినాష్ రెడ్డి తప్పు చేయలేదని పులివెందుల పూల అంగళ్ళ వద్ద చర్చకు సిద్ధమా అంటూ సునీత చేసిన సవాల్‌పై మేనత్త విమలా రెడ్డి కౌంటర్ ఎటాక్ చేశారు. కుటుంబ ఆడబిడ్డలు కుటుంబ పరువును బజారున పెడుతున్నారని షర్మిల కొంగు పట్టుకొని ఓట్లు అడుక్కోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎండిపోతున్న చేపలు

రంగారెడ్డి, మే 7

తెలంగాణలో ఎండలు హడలెత్తిస్తున్నాయి. నానాటికీ రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగలు ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలతో జనాలు బయటికి రావటానికే వణికిపోతున్నారు. మరోవైపు వాడు వగిలే ఎండలతో జనాలు పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజులోనే 19 మంది వడదెబ్బలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. మనుషులతో పాటు మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. తాజాగా ఎండ ధాటికి తాళలేక రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలోని చెరువులో సుమారు రెండు టన్నుల చేపలు మృత్యువాత పడ్డాయి.ఎండ వేడిమికి చెరువుల్లోని నీరు సలసల కాగిపోతుంది. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతుండటంతో చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా రెండు టన్నుల చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ చెరువుపై ఆధారపడి 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, చేపలను బతికించుకోవడం కోసం నీటి కొరత ఉన్నప్పటికీ కష్టపడి నీటి వనరు ఏర్పాటు చేశామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. అయినా లాభం లేకపోయిందని మత్స్యకారులు బోరుమంటున్నారు.ఎంత తీవ్రత వల్ల ఒకేసారి 2 టన్నుల చేపలు చనిపోవడంతో భారీ నష్టం వచ్చిందని వాపోయారు. మిగిలిన చేపలను రక్షిచుకునేందుకు బోరు మోటారు సహాయంతో చెరువులోకి నీటిని వదులుతున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దానం కు మాలల మద్దతు

హైదరాబాద్

దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు, రాజ్యాంగ రక్షణకోసం తమ మద్దతు కాంగ్రెస్ పార్టీకి, దానం నాగేందర్ కు ఇస్తున్నట్లు మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జీ. చెన్నయ్య స్పష్టం చేశారు.

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కు మద్దతుగా న్యూ బోయిగూడలో మాల ప్రజా సంఘాల జేఏసీ నాయకులతో కలిసి చెన్నయ్య ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియా సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ బీజేపీ మతతత్వ, కులతత్వ పార్టీ అని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చుడానికి ప్రయత్నిస్తున్న, రిజర్వేషన్ లకు వ్యతిరేకంగా పని చేస్తున్న బీజేపీ ని గద్దె దించడమే ధ్యేయంగా పని చేయనున్నట్లు తెలిపారు. 10ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ కూడా దళిత బహుజనుల కోసం చేసిందేమీ లేదని వెల్లడించారు..

## ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు

వేములవాడ

రాజన్న సిరిసిల్ల జిల్లా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణంలో రేపు జరిగే బిజెపి బహిరంగ సభకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారు.. ఈ మేరకు బిజెపి నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కు చెల్లిస్తారు. తదనంతరం కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మద్దతుగా పట్టణంలోని బైపాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ మేరకు కేంద్ర భద్రత సిబ్బంది మోడీ పర్యటన సందర్భంగా భద్రత అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయ గుడి చెరువులో నాలుగు హెలిప్యాడ్ లను సిద్ధం చేశారు. ఉదయం హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. రాజన్న దర్శించుకునే తొలి ప్రధానిగా నరేంద్ర మోడీ కానున్నారు.

## బి అర్ ఎస్ పార్టీ పదేళ్ల పరిపాలన లో రాష్ట్రం అస్తవ్యస్తం

పెద్దపల్లి

బీఆర్ఎస్ పదేళ్లచ, పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం అయిందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎం చెయ్యలేని బీ అర్ ఎస్ పార్టీ అభ్యర్థి కి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. బీజేపీ అభ్యర్థి మాటలు కోట లు తప్ప చేసేది ఎం ఉండదు. బీజేపీ పార్టీ మోడీ,అమిషా ఇద్దరి తో నడిపతున్నారు.ఇతరులకు అవకాశం లేదు. జేపీ నడ్డ కు కాంగ్రెస్ రాహుల్ గాంధీ నీ విమర్శించే మాట్లాడే నైతిక హక్కు లేదు. పదవి త్యాగం చేసిన ఘనత రాహుల్ గాంధీ కుటుంబానికి దక్కుతుంది. బీజేపీ కి ఓటు వేస్తే అధని,అంబానీ లాంటి వారికే మేలు. యువతను,రైతులను,మహిళలను మోసం చేసిన పార్టీ బీజేపీ. భారత రాజ్యాంగాన్ని అవమాన పరిచిన బీజేపీ జేపీ నడ్డ ఓటు ద్వారా బుద్ధిచెప్పలి. కేంద్రం లో పదేళ్ల పరిపాలనలో ఎం చేశారో చెప్పకుండా ప్రజలకు అబద్ధాలు చెప్పారని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికలలో బి అర్ ఎస్,బీజేపీ పార్టీలకు ఓటు వేస్తే శూన్యం. కచ్చితంగా ఆరు గ్యారంటీ పథకాలలో ఐదు అమలు చేసినం. రైతుల రైతు బంధు ఆపేది లేదు రైతులు ఎకరానికి 7500 రూ త్వరలోనే అందిస్తాం. రైతులకు రుణమాఫీ,నష్ట పరిహారం విషయం కాంగ్రెస్ కట్టుబడి ఉంది. పట్టిపాక రిజర్వాయర్ నిర్మాణం చేసి ఈ ప్రాంత రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నిరు అందిస్తాం. దేశ చరిత్రలో కుల గణన ను మొదలు పెట్టింది కాంగ్రెస్ పార్టీ. కుల గణన తో బడుగు బలహీనర్గాలకు మేలు చేసే విధంగా చూస్తాం. జిల్లా కు సంబంధించి నా సహకారం పూర్తి స్థాయి లో ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి తీరుతాం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ను అధిక మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నాని అన్నారు.

## నిజామాబాద్ లోనే పసుపు బోర్డు

నిజామబాద్దేశం అభివృద్ధి కావాలంటే మరోసారి నరేంద్రమోది ప్రధాని కావాలని అన్నారు నిజామాబాద్ ఎంపి అభ్యర్థి దర్మపురి అరవింద్. ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వగురువుగా చేసిన ఘనత మోదికే దక్కుతుందని తెలిపారు. మోపాల్ మండల కేంద్రం లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు..

# సూపర్ సిక్సే ప్రధాన అస్త్రాలు

నిజామాబాద్, మే 7

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల అమలు సాధ్యమేనా అని ప్రశ్నించిన విమర్శకుల నోళు మూయిస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు దూసుకుపోతోంది. ఇప్పటికే ఆరు హామిలలో 5 హామిలు అమలు చేసి ఆరవ కీలక హామి అయిన రైతు రుణమాఫీపై తేదీని సైతం నిర్ణయించి ప్రకటించారు. దశాబ్దాల తన రాజకీయ ప్రయాణంలో ఎప్పుడూ విపక్ష పార్టీ ప్రతినిధిగా ఉన్న రేవంత్.. నేరుగా సీఎం కావటంతో ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారో అనే అనుమానాలకు చెక్ పెడుతూ.. ఇచ్చిన 6 హామిల్లో ఐదింటిని నాలుగు నెలల్లోనే అమలు చేసి చూపించారు. సీఎం ధీమా చూసిన కాంగ్రెస్ నేతలు కూడా మిగిలిన ప్రతి హామినీ ఎన్నికల కోడ్ తర్వాత అమలు చేసి తీరతామని ప్రజలకు చెబుతూ లోకసభ ఎన్నికల ప్రచారంలో క్షేత్రస్థాయిలో తమ బలాన్ని పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు.ఈ ఎంపీ ఎన్నికల్లో మహాలక్ష్మి ,గృహజ్యోతి వంటి పథకాల అమలు తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి అంశాలు కుల, మతాలకు అతీతంగా మహిళల మనసు గెలిచాయనీ, దీంతో ఈసారి వారి ఓట్లు తమకేననే అంతర్గత సర్వేలూ చెబుతున్నాయి. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు, గొర్రెల పంపిణీ స్కాం, హెచ్ఎండీఏ అధికారుల అవినీతి, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కామ్‌లో కవిత అరెస్టు వంటి వాటి మూలంగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు గండిపడటం ఖాయమని, అందులో చెప్పుకోదగ్గ మొత్తం తనవైపు మళ్లుతుందని హస్తం పార్టీ అంచనా వేస్తోంది. తాము వచ్చిన 3 నెలల్లో ఉద్యోగాల నోటిఫికేషన్లు, నియమాకాలు పూర్తైన ఉద్యోగాలకు సంబంధించిన నియమాక పత్రాలు అందించటంతో ఈసారి నిరుద్యోగుల ఓటూ తమకే మళుతుందని, ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్స్ వంటి కార్యక్రమాలు కూడా తమకు ప్లస్ అవుతాయని కాంగ్రెస్ భావిస్తోంది.నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వారికి గృహజ్యోతి స్కీమ్ కింద మాఫీ కోసం రూ. 2,418 కోట్లు కేటాయించింది కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ కోసం రూ. 22,500 కోట్లు కేటాయించి, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 3,500 చొప్పున మొత్తం నాలుగున్నర లక్షల ఇండ్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధంచేసింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి నెలకు సుమారు రూ. 250 కోట్ల ఖర్చు అవుతుండగా, ఏడాదికి దాదాపు రూ. 1,500 కోట్లు అవుతోందని ఆర్టీసీ అంచనావేసింది. ఇందులో ఫిబ్రవరిలో రూ. 374 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి అందజేసింది. మహాలక్ష్మి స్కీమ్‌లోని రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ కోసం మార్చి నెల అడ్వాన్సుగా రూ. 80 కోట్లను ఫిబ్రవరిలోనే ప్రభుత్వం విడుదల చేసింది. దీనికోసం ఏడాదికి దాదాపు 40 లక్షల మందికి రూ. 3,200 కోట్లు ఖర్చవుతుందని అంచనా. రైతు భరోసాకు ఒక సీజన్‌కు రూ. 9,650 కోట్ల చొప్పున రెండు సీజన్‌లకు కలిపి దాదాపు రూ. 19 వేల కోట్లు అవుతుందని అంచనా. వరి పంటకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్‌గా ఒక్కో సీజన్‌కు సగటున కోటి టన్నులకు రూ. 5 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. 'ఆసరా' పేరుతో ఉన్న పింఛన్లను 'చేయూత' పేరుతో రూ. 4,000కు పెంచినందున ఏటా దాదాపు 18 వేల కోట్లు అవసరమని సర్కారు అంచనా వేసింది.ఇప్పటికే అమలవుతున్న హామిలతో ప్రజలు రేవంత్ సర్కార్ పట్ల సుముఖంగా ఉన్నారని సర్వేలు సూచిస్తున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచి డిసెంబరు 9, 2023 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అదే రోజు అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 27, 2024 నుంచి 200 యూనిట్ల (నెలకు) వరకు ఉచిత విద్యుత్, తెల్ల రేషను కార్డు ఉన్నవారికి రూ.500కే వంట గ్యాస్ పథకం అమలులోకి వచ్చాయి. సొంతిల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కల్పించే స్కీమ్ మార్చి 11, 2024 నుంచి అమలవుతోంది.ప్రతి నెలా రూ. 2,500 చొప్పున మహాలక్ష్మి ఆర్థిక సాయం, రైతు భరోసా పేరుతో రైతులు, కౌలు రైతులకు ఏటా రూ. 15,000 పంట పెట్టుబడి సాయం, రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 సాయం, వరి పంటకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ (ఎంఎస్పీకి అదనంగా), ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గజాల చొప్పున ఇంటి స్థలాలు, ప్రస్తుతం ఉన్న రూ. 2,016 పింఛను (ఆసరా)ను 'చేయూత' పేరుతో నెలకు రూ. 4,000కు పెంపు, విద్యార్థులకు రూ. 5 లక్షల చొప్పున విద్యా భరోసా కార్డు, ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు వంటి పథకాలను ఈ ఎన్నికల కోడ్ అనంతరం మెదలుపెట్టేందుకు సిద్ధంగా ఉంది కాంగ్రెస్ సర్కార్.

# ఐదు రోజులు వానలే..వానలు

హైదరాబాద్, మే 7,

ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీల వరకు టెంపరేచర్స్ నమోదవుతున్నాయి. ఎండవేడిమి, ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఓ వైపు ఎండలతో అల్లాడిపోతుంటే మరో వైపు వడగాల్పులు బెంబేలెత్తిస్తున్నాయి. వడగాల్పుల తీవ్రతకు జనాలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఈక్రమంలో మండుటెండల్లో వాతావరణ శాఖ ప్రజలకు చల్లని కబురును అందించింది. తెలంగాణ రాష్ట్రంలో 5 రోజులు వర్షాలు కురుస్తాయని తెలిపింది.ఎండలతో సతమతవుతున్న ప్రజలకు ఉపశమనం లభించనుంది. రాగల ఐదురోజులు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. నేడు (ఆదివారం) కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. సోమవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయని ప్రకటించింది. సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం నుంచి గురువారం వరకు పలు చోట్ల భారీ, మరికొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల రాకతో ప్రజలకు మండే ఎండల నుంచి రిలీఫ్ కలుగనున్నది.

# హోరెత్తుతున్న ప్రచారం

హైదరాబాద్, మే 7,

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీల ప్రచారం జోరందుకుంది. ఇక మిగిలింది ఐదు రోజులే కావడంతో ఎన్నికల ప్రచారం తుదిదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే జాతీయ పార్టీల ఢిల్లీ నేతలు తెలంగాణ గల్లీలకు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రంలో పర్యటించిన బిజెపి, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ఆదివారం నుంచి విస్తృతంగా పర్యటించేలా ప్రణాళికలు ఖరారు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆయా పార్టీల కీలకనేతలందరూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు.బిజెపి తరపున ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆ పార్టీ జాతీయ అధ్యకుడు జెపి నడ్డా, కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు వరుసగా రాష్ట్రంలో పర్యటిస్తారని ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరో వైపు రాష్ట్రంలో కీలకమైన బిఆర్ఎస్ తరపున ఆ పార్టీ అధినేత కెసిఆర్ కూడా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో 400 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి అందుకు తగినట్టుగా తెలంగాణలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని భావిస్తోంది. బిజెపి తరపున ఆ పార్టీ జాతీయ నేతలు నెల రోజులుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఇతర అగ్రనేతలు పలుమార్లు రాష్ట్రానికి వచ్చారు. పోలింగ్‌కు ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు మరోమారు ముందుకు వస్తున్నారు.ప్రధాని మోడీ ఈనెల 8, 10 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించి బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. నేడు అమిత్‌షా, ఆరో తేదీన జేపీ నడ్డాలు రాష్ట్రానికి వస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరిల్లో అమిత్ షా, పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండలో నడ్డా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించనున్నారు.కాంగ్రెస్ నుంచి అతిరథ మహారథులు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తరుణంలో రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ ప్రచార బరిలోకి దిగుతున్నారు. నిజానికి ఈ ఎన్నికల్లో తెలంగాణలో ప్రియాంకగాంధీ కేంద్రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, వీలైనన్ని ఎక్కువసార్లు ఆమెను ప్రచారానికి తీసుకురావాలని టిపిసిసి భావించింది. కానీ, ఇతర రాష్ట్రాల ప్రచార షెడ్యూల్ కారణంగా అది సాధ్యం కాలేదు. 10వ తేదీ వరకు రాహుల్‌గాంధీ, ప్రియాంకలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్ధతుగా సభలు, రోడ్ షోలలో పాల్గొంటారు. నాంధేడ్ నుంచి నేరుగా నిర్మల్‌లో జరుగనున్న ఎన్నికల ప్రచార సభకు రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. అక్కడ అదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఆ తరువాత అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని అలంపూర్, ఎర్రవల్లి కూడలి వద్ద జరురగనున్న ఎన్నికల ప్రచార సభకు సాయంత్రం 5 గంటలకు రాహుల్‌గాంధీ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 9వ తేదీన ఉదయం కరీంనగర్, సాయంత్రం 5 గంటలకు సరూర్ నగర్‌లోనూ రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు.గాంధీ రాష్ట్ర పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో తెలంగాణకు రావాల్సిన ప్రియాంక గాంధీ రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. ఈ నెల 10వ తేదీన ఎల్లారెడ్డి, తాండూర్, షాద్‌నగర్‌లలో ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. వీరితోపాటు ఏఐసిఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఎన్నికల ప్రచారానికి హాజరవుతారని టిపిసిసి వర్గాలు తెలిపాయి.బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సైతం ఎన్నికల ప్రచారంలో ముందుకెళుతున్నారు. గతంలో రూపొందించిన షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈ నెల 10వ తేదీ వరకు కెసిఆర్ బస్సుయాత్ర ఉంటుందని బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఈనెల 10వ తేదీన సిరిసిల్లలో రోడ్ షో, సిద్ధిపేటలో బహిరంగ సభతో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగుస్తుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రచారానికి వడదెబ్బ

తెలంగాణలో బడా నాయకుల సభలకు ప్రజలను తీసుకు రావడం ఇప్పుడు చాలా పార్టీలకు కష్టమైపోయింది. దాంతో అనేక సభలను, రోడ్ షోలను తగ్గించేసుకుంటున్నారు. లోక్ సభ ఎన్నికలకు ఇంకా వారం రోజుల సమయమే ఉంది. ఎండలు ఇటు తెలంగాణలోనూ,అటు ఆంధ్రలోనూ రాజకీయ పార్టీల ప్రచారానికి పెద్ద అడ&ఢంకిగా తయారయ్యాయి. ఆంధ్రలోనైతే అత్యధిక ఉష్ణోగ్రత 47 డిగ్రీల సెల్సియస్ కూడా దాటుతోంది. వడ దెబ్బకి ఇరు రాష్ట్రాలలో అనేక మంది చనిపోయారు కూడా. వచ్చే వారం అయితే ఎండలు మరింత తీవ్రం కానున్నాయి.మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ప్రజలు బయట తిరగొద్దని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 తర్వాత నుంచి సాయంత్రం 5.00 వరకు ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల చాలా మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. నంద్యాల జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత 47.7 డిగ్రీల సెల్సియస్ దాటింది. ప్రకాశం, కడప జిల్లాల్లో కూడా ఎండలు మండిపోతున్నాయి.తెలంగాణలో కూడా గరిష్ఠంగా 42 డిగ్రీల సెల్సియస్ ఎండలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 3 నుంచి 4 పబ్లిక్ మీటింగ్ లలో ప్రసంగిస్తున్నారు. ఆయన తన ఆరోగ్యం గురించి కూడా పట్టించుకోవడం లేదనే చెప్పాలి. ఆయన హెలికాప్టర్ ద్వారా ఆయా నియోజకవర్గాలకు సమయానికి చేరకుంటున్నారు.బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అయితే చాలా వరకు సాయంత్రం దాటాకే ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆయన బస్సు యాత్ర ద్వారా రోజుకు ఒకటి లేక రెండు పబ్లిక్ మీటింగ్ లలో ప్రసంగిస్తున్నారు. బిజెపి చెవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అయితే ఇటీవల తాండూర్ సెగ్మెంట్ లో ప్రచారం చేస్తూ డీహైడ్రేషన్ కు గురయ్యాడు. ఇప్పుడాయన ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)ను త్రాగు నీటితో కలుపుకుని ప్రచారం చేస్తున్నాడు. అసదుద్దీన్, అక్బరుద్దీన్, మాధవీలత అయితే పొద్దున, సాయంత్రం అన్న తేడా లేకుండా ప్రచారం చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అయితే రోజుకు రెండు మూడు జిల్లాల్లో బస్సు యాత్ర కొనసాగిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆయన రోడ్ షోకు జనం కూడా బాగానే వస్తున్నారు. ఇక మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అయితే హెలికాప్టర్ లో తిరుగుతూ రోజుకు రెండు మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు.

==========================చీచీ

## చర్లలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

భద్రాద్రి కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ, ఎఎస్పి, ఒయస్డి ఆదేశాల మేరకు రాబోయే లోక్సభ ఎన్నికల్లో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛ గా వినియోగించు కోవడానికి చర్ల పోలీస్, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ ఆధ్వర్యంలో చర్ల ప్రధాన రహదారిపై ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఓటు హక్కు ని అందరూ వినియోగించుకొని సమర్ధవంతంమైన నాయకున్ని గెలిపించుకోవాలని ఈ సందర్భంగా చర్ల సిఐ రాజువర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్ల పోలీస్, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ అధికారులు, ఎస్సై నర్సిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు వేసిన అమిత్ షా

అహ్మదాబాద్

దేశంలో మూడో విడత ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. కేంద్ర హోం మంత్రి, గాంధీనగర్ లోక్సభ అభ్యర్థి అమిత్ షా అహ్మదాబాద్లోని నిషాన్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీసీసీఐ కార్యదర్శి జై షా సహా ఆయన కుటుంబ సభ్యులు ఓటేశారు. అనంతరం అమిత్ షా, భార్య సోనల్ షా సమేతంగా అహ్మదాబాద్లో ఉన్న కామేశ్వర్ మహాదేవ్ ఆలయంలో పూజలు చేశారు.

## పవన్ కళ్యాణ్ ను గెలిపించండి: చిరంజీవి

హైదరాబాద్

పిఠాపురం ప్రజలు జనసేనాని పవన్ కళ్యాణ్ ను గెలిపించాలని కోరుతూ మెగాస్టార్ చిరంజీవి ఓ వీడియోను విడుదల చేశారు. 'అమ్మ కడుపులో ఆఖరికి పుట్టినా.. జనానికి మంచి చేయడంలో ముందుంటాడు. తాను బలంగా నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని రాజకీయాలకు అంకితం చేసిన శక్తిశాలి పవన్. ప్రజల కోసం ఆ శక్తిని వినియోగించాలంటే, ఆ గొంతు చట్ట సభల్లో వినిపించాలంటే పిఠాపురం ఓటర్లు జనసేనాని గెలిపించాలి' అని పిలుపునిచ్చారు.

## అన్యాయం జరిగింది కాబట్టి పోటీలో నిలబడ్డా: షర్మిల రెడ్డి

కడప

కమలాపురం నియోజక వర్గంలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ఎన్నికల ప్రచారం కొనసాగింది. అవినాష్ రెడ్డి చిన్నపిల్లాడు కాదు...అమాయకుడు కాదు..వివేకా హత్య నిందితుడు. హత్య జరిగినప్పుడు ఎంపి అయి ఉండి సాక్ష్యాధారాలు తుడిచేస్తుంటే పోలీసులకు చెప్పాల్సిన భాధ్యత లేదా ? సాక్షిలో హార్ట్ ఎటాక్ అంటూ నడిపింది జగన్ మోహన్ రెడ్డి భార్య. ఆనాడు అన్న కోసం 3200 ఐఓ పాదయాత్ర చేశా..ఇవ్వాళ వివేకా విషయంలో అన్యాయం జరిగింది కాబట్టి ఎదురు తిరిగా. నేను చేసింది తప్పా ? కడప ప్రజలు ఆలోచన చేయాలి. న్యాయాన్ని గెలిపిస్తారా ? నేరాన్ని గెలిపిస్తారా అని ప్రశ్నించారు.

అన్ని ఆధారాలు ఉన్నా...హంతకులకు శిక్ష పడలేదు. అరెస్ట్ చేయాలని చూస్తే ఏకంగా ముఖ్యమంత్రి అడ్డుపడ్డాడు. వైసిపి మూకలను పెట్టీ అరెస్ట్ కాకుండా చూశాడు. వివేకా ను గొడ్డలితో అతి దారుణంగా నరికి చంపారు. ఇల్లంతా రక్తం మయం. ఎముకలు,మెదడు బయటకు వచ్చేలా నరికారు.

# పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ను గెలిపించండి: సిపిఎం పార్టీ ప్రచారం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 (భారతశక్తి):జిల్లాలోని భీమారం మండలంలోని ఖాజిపల్లి, దాంపూర్ గ్రామాలలో ఇండియా కూటమి బలపరిచిన పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ను గెలిపించాలని మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తో కలిసి బిజెపి బందిఖాన నుండి దేశాన్ని విముక్తి చేద్దాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఈ కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శిలు సంకె రవి, యాకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముత్యంరావు, ప్రకాష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించండి: జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ రవీందర్ రెడ్డి

(భారత శక్తి) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 07: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాల ప్రకారం పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ మాసంలో 3వ తేదీ నుండి 13వ తేదీవరకు నిర్వహించబడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఏ.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మార్చి 2024 లో పదవ తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన లేదా అసలే పరీక్షలు రాయకపోయిన అభ్యర్థులు జూన్ 2024 మాసంలో నిర్వహించే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎటువంటి ఆలస్యం రుసుము లేకుండా విద్యార్థులు మే 16లోగా పరీక్ష రుసుమును ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మే 17వ తేదీన బ్యాంకులో పరీక్ష ఫీజులు చెల్లించి, సంబందిత నామినల్ రోల్స్ ను మే 20వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు. సంబంధిత విషయ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు ఆలస్య రుసుముతో పరీక్ష ఫీజును చెల్లించే అవకాశం కూడా ఉందని ఆయన తెలిపారు.పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో ప్రధాన పరీక్షలు జూన్ 3వ తేది నుండి జూన్ 11వ తేదీ వరకు ఉదయం 9.30 గం. ల నుండి 12.30 గం. ల వరకు నిర్వహించబడతాయని, జూన్ 12వ తేదీన ఓ ఎస్ ఎస్ సి.మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష, మరియు జూన్ 13వ తేదీన ఓ.ఎస్.ఎస్.సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. జూన్ మూడో తేదీన నిర్వహించే ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు పార్ట్1, పార్ట్2 పరీక్షలు




9:30 నుండి 12:50 వరకు, అలాగే జూన్ 8వ తేదీన భౌతిక రసాయన శాస్త్ర పరీక్ష 9:30గం. ల నుండి 11.00 గంటల వరకు, జూన్ 10వ తేదీన జీవశాస్త్ర పరీక్ష 9:30 గం. ల నుండి 11.00 గంటల వరకు నిర్వహించబడుతాయని ఆయన తెలియజేశారు. కావున పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా మే 16వ తేదీలోగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని సూచించారు.

# మే 9న పట్టణానికి విచ్చేయనున్న మందకృష్ణ మాదిగ

మందమర్రి, మే 07 (భారతశక్తి ప్రతినిధి):జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ ను గెలిపించాలని కోరుతూ, మే 9న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పట్టణానికి విచ్చేయుచున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ జీడి సారంగం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ పోరాటం చివరి దశకు వచ్చిందని, వర్గీకరణ పై నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ మేరకు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బిజెపికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ, బిజెపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెడ్ల, మాల ల పాలన నడుస్తుందని, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉన్న ఒక్క పార్లమెంట్ స్థానాన్ని సైతం మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలను, నేతకాని లను అవమానపరిచిందన్నారు. రాష్ట్రంలో మూడు ఎస్సీ ఎంపీ స్థానాలైనా వరంగల్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనకు వంత పాడుతూ, ఒకే కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను కేటాయించడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అంటేనే కుటుంబ పాలన అని విమర్శించారు. పెద్దపల్లి



పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గడ్డం కుటుంబం ది రాజరిక పాలన నడుస్తుందని, మిగతా సామాజిక వర్గాలను ఎదగకుండా ఒక కుటుంబం మాత్రమే కుటుంబ పాలన చేస్తుందని విమర్శించారు. నియోజకవర్గంలో గడ్డం కుటుంబాన్ని అంతం చేయాలంటే బిజెపి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ ల ఏబిసిడి వర్గీకరణ జరగకుండా అడ్డుపడింది సైతం గడ్డం వెంకటస్వామి కుటుంబమే అని ఆరోపించారు. మే 9న పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో జరగబోయే బహిరంగ సభకు మాదిగలు, నేతకానిలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నూరి శ్రీనివాస్, జిలకర శంకర్, ఆసంపల్లి శివకుమార్, కుషనపల్లి రాజలింగు, చిలుముల రాజకుమార్, సునాని తరంగి, ఎల్కరి రాజేష్, ఇడిగిరాల అరుణ్, మాడుగుల రాజ్ కుమార్, తైదల మారుతి, ఆసంపల్లి అనిల్, గారే కుమార్, అసంపల్లి రమేష్, కాంపల్లి కుమార్, రామగిరి వరుణ్, నక్క శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్లేయులకు సింహస్వప్నం సీతారామరాజు వందో వర్ధంతిలో క్షత్రియ పెద్దలు ఘన నివాళి.

తిరుపతి,భారతశక్తి క్రైమ్ బ్యూరో, మే 07:భారతదేశ స్వాతంత్ర్య సమరపోరాటంలో తెలుగు గడ్డపై మొట్టమొదటి గా బ్రిటీష్ వారిని ఎదుర్కొన్న గొప్ప పోరాటయోధుడు,మన్యం వీరుడు,క్షత్రియజాతి ముద్దు బిడ్డ అల్లూరి సీతారామ రాజు పోరాటపటిమను స్మరణ చేసుకొంటూ 100వ వర్ధంతి కార్యక్రమమును ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రము తిరుపతిలో ఎస్ టి ఆర్ఎఫ్ సభ్యులు గుండ్రాజు సుకుమార్ రాజు,తితిదే క్షత్రియ ఉద్యోగ సంఘము వ్యవస్థాపకులు పి.రుక్మాంగధ రాజు బృందముచే అత్యంత భక్తి శ్రద్ధలతో స్వర్గయ అల్లూరి సీతారామరాజుకి ఘనంగా నివళులు అర్పించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘము అధ్యక్షులు





డా.బలరామరాజు,తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన రాజు, రాజు క్షాత్రాని ఐక్య వేదిక అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి, కన్వీనర్ వసంత,తిరుపతి నియోజక వర్గ బీఎస్ పి అభ్యర్థి జగదబీ వేణుగోపాల్ రాజు,చంద్ర కుమార్రాజు,గురుప్రసాద్ రాజు,రవిరాజు,నవీన్ కుమార్రాజు,సూర్య నారాయణరాజు,రంగ రాజు, స్థానిక క్షత్రియ పెద్దలు సంధ్యా రాణి,శ్రీలత,నీరజ, భార్గవి,వాణి,శంకర్ రాజు, వెంకటేశ్వర్లరాజు,పరమానంద రాజు,జ్యోతి స్వరాజు, మధురాజు,ప్రసాద్ రాజు, అశోక్ రాజు,గిరిరాజు స్థానిక క్షత్రియ మహిళలు హాజరై భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారితో అల్లూరి సీతారామరాజు వారి పోరాటపటిమ,నిస్వార్ధదేశభక్తిని వేనోళ్ళ కీర్తిస్తూ ఘన నివాళులు అర్పించారు.

# టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను,మున్సిపాలిటీ నర్సరీని, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే 7: అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద చేపట్టిన పనులను పాఠశాలలు తెరిచే లోపు పూర్తి చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం టేక్రియాల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మున్సిపాలిటీ నర్సరీని, టేక్రియాల్ చౌరస్తాలో ఉన్న అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పనులు పురోగతిని పరిశీలించి పాఠశాలలో చేపడుతున్న మరమ్మత్తు, ప్రహరీ గోడ మరమ్మతు పనులు టాయిలెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం మునిసిపల్ నర్సరీలో పెంచుతున్న వట్టివేరు మొక్కలను పరిశిలిస్తూ ఔషధ గుణాలు కలిగినఈ మొక్క ప్రాశస్త్యం పట్ల ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. ఈ మొక్కను చెరువుకట్టలపై పెంచడం వల్ల చెట్టు వేర్లు 10,15 అడుగుల వరకు క్రిందికి వెళ్లి బుంగ పడకుండా కట్ట బలంగా ఉంటుందని అన్నారు. అనంతరం టేక్రియాల్ చౌరస్తాలో గల అంతర్ జిల్లా చెక్ పోస్టును సందర్శించి స్టాటిక్స్ సర్వేలెన్స్ బృందంతో



మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఇంజనీరింగ్ అధికారులు సుబ్బారాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల సప్లమెంటరీ రాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టడం జరిగింది : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





(భారత శక్తి) ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 07: కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ఈ వి ఎం ల ర్యాండమైజేషన్ పై ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి, రెండవ ర్యాండమైజేషన్, ఈ వి ఎం ల కమిషనింగ్ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల సప్లమెంటరీ రాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, ఎండలు అధికంగా ఉన్నందున ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, త్రాగునీరు, బెంచీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో రేపు పట్టణంలోని ఆర్ డి ఓ కార్యాలయం నుండి ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న 5కె రన్ కార్యక్రమం లో అన్ని వర్గాల ప్రజలు, యువత అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలనీ కలెక్టర్ కోరారు.అనంతరం కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ను కలెక్టర్, రాజకీయ పార్టీ ల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. గోధాంలో గల ఈవీఎం లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల సెగ్రిగేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్. నిర్మల్, ముధోల్, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జివాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్ రెడ్డి, రవి, సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్, మజార్, హైదర్, ఎన్నికల సూపరిండెంట్ శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత వల్ల నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు : జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) మే 07:వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు ఆర్డీఓ లు ఇంజనీరింగ్ అధికారుల స్పెషలాఫీసర్ లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనప కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రియాంక మిషన్ భగీరథ ఎస్సీ వెంకటేశ్వర్లు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా త్రాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, రాగల 15 రోజులు అధికారులు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ అధికారులు మున్సిపాలిటీ పరిధిలో వారికి కేటాయించిన వార్డుల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల అభిప్రాయాలను స్వీకరించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. మట్టపల్లి, కృష్ణాపురం డబ్ల్యూ టిపీల ద్వారా 90 ఆవాసాల గ్రామాలకు త్రాగునీటి సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా త్రాగునీటి సరఫరా గురించి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత వల్ల నీటి ఎద్దడి ఏర్పడినట్లయితే గ్రామాలలో ప్రత్యామ్నాయ చర్యల ద్వారా త్రాగునీటిని అందించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని నియోజకవర్గాలలో త్రాగునీటి నిల్వల కొరకు శాశ్వత ఏర్పాట్ల పై నివేదికలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలకు



ప్రతిరోజు నీటి సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అధికారులు చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రానున్న 15 రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు తాగునీరు అందే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి వి అప్పారావు, సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్, కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, హుజూర్ నగర్ ఆర్డిఓ వి శ్రీనివాసులు, మిషన్ భగీరథ అధికారులు శ్రీనివాసరావు, అరుణాకర్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, కోదాడ రమాదేవి, తిరుమలగిరి రామదుర్గారెడ్డి, హుజూర్ నగర్ శ్రీనివాస్ రెడ్డి, నేరేడుచర్ల అశోక్ రెడ్డి, ఆర్టీఓ సురేష్ కుమార్ మున్సిపల్ ప్రత్యేక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విస్తృతంగా కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



మందమర్రి, మే 07 (భారతశక్తి ప్రతినిధి):పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా పట్టణంలోని 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్తృతంగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 3, 14, 17 వార్డులలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను, ప్రజలకు వివరించి, ప్రతి ఇంటికి గ్యారెంటీ కార్డులు ఇస్తూ, ప్రచారం నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకుడు సోత్కు సుదర్శన్, గుడ్ల రమేష్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ



ప్రవేశపెట్టిన పథకాలన్నీ అమల్లోకి వస్తాయని, ఇచ్చిన మాటకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మే 13న పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, కాకా వెంకటస్వామి మనవడు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తనయుడు, గడ్డం వంశీకృష్ణ హస్తం గుర్తుకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేరువట్ల శ్రీనివాస్, నాయకులు ఎండి ఇసాక్, కనకం రాజు, ఎండి చోటే మియా, గాదె రాజు, ఎం రామారావు, యెలుకటూరి రాజ్ కుమార్, సుందిళ్ల ప్రవీణ్, దేశమల్ల సిద్దార్థ్, బండ రాకేష్, పచ్చిక చంద్ర తేజ, బచ్చలి మనోహర్, తన్నీరు మాలాద్రి, సిహెచ్ దుర్గాప్రసాద్, సాయికుమార్, వేణు, కాసీపేట స్వామి, కిరణ్, రవికుమార్, శ్రీలత, రమ్య, రాజేశ్వరి, క్రాంతి, సంతోష్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే పాల్వాయి

బెజ్జూరు, మే 7: బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని రెబ్బెన గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధానిమోదీ ఆధ్వర్యంలో అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఎంపీగానగేష్‌ను గెలిపించినట్ల యితే ఇద్దరం కలిసి జోడెద్దుల్లాగా పని చేసి సిర్పూర్ అభివృద్ధికి పాటుపడు తామన్నారు. ఇప్పటికే కేంద్రం నుంచి 100కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీఅభ్యర్థి నగేష్ మాట్లాడుతూ తనకు ఒకసారి అవకాశం కల్పించినట్లయితే నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి పాటుపడుతానన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వీరభద్రా చారి, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లి రైల్వేఓవర్‌బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి రైల్వేఓవర్ బ్రిడ్జిపనులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీని వాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం టోంకిని సిద్ధిహనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

# అరుణమ్మ గెలుపు ఖాయం : పీవీఆర్

కొత్తూర్/షాద్‌నగర్‌రూరల్/చౌదరిగూడ, మే 7: ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు ఖాయమనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వ, సిద్దాపూర్, వైఎం తండా, ఎస్‌బీ పల్లి, కొడిచర్ల, పెంజర్ల గ్రామాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి ప్రచారం చేశారు, బావండ్ల మాణిక్యం, మంగలి రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులున్నారు. కాగా, కొత్తూర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొత్తూర్ జీపీ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కడెంపల్లి



సదానంద్‌గౌడ్ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో డీకే అరుణకు మద్దతుగా సీనియర్ నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. అరుణమ్మకు మద్దతుగా చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, గాలిగూడ, ఎదిర తదితర గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు కురుమయ్య, నాయకులు భూపాలచారి, దిలీపరెడ్డి, లింగం, బీమయ్య, తదితరులున్నారు.

# రామగుండంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కళ్యాణ్‌నగర్, మే 7: భానుడు భగభగమంటున్నాడు. నిన్నమొన్నటి వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నా గత పదిరోజులుగా ఎండలు మం డుతున్నాయి. ఉదయం 6గంటలకే భగభగమంటున్నాడు. రామగుండం లో బుధవారం రాష్ట్రంలోనే అత్యధికంగా 46డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. 44డిగ్రీలు నమోదు కాగా రెండు డిగ్రీలు పెరిగి 46డిగ్రీలు నమోదు అయ్యింది. ఉదయం 11గంటలకు లక్ష్మీ నగర్‌లోని వాణిజ్య, వ్యాపార కేంద్రాలు బోసిపోయాయి. ఎండవేడిని తట్టు కోలేక ప్రజలు బయటకురావడం లేదు. ఉదయం 10గంటలకే రామగుం డంలో 41డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు చేసుకోవడం గమనార్హం. జనం అత్య వసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావడం



లేదు. రాత్రి 10గంటలు దాటినా ఎండవేడి తగ్గడం లేదు. రెండు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం విలవిలాడుతున్నారు. ఎండ వేడికి ఏసీలు, కూ లర్ల ప్రభావం కూడా సరిపోవడం లేదు. ఓసీపీల్లో 49డిగ్రీల వరకు ఉష్ణో గ్రతలు నమోదు అవుతున్నాయి. రెండవ షిఫ్టు విధులకు వెళ్లాలంటే కార్మి కులు భయపడుతున్నారు. షిఫ్టు సమయాలు మార్చాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదు. మరో నెల రోజు లు ఎండల ప్రభావం ఎలా ఉంటాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

# ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

మామిళ్లగూడెం, మే7: లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, హెూం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై ఇతర ఉ న్నతాధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో మే 07: జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు, ఓటర్లకు అవగహన కల్పించేందుకు మంగళవారం ఉదయం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఆర్డీఓ నుండి నిర్వహించిన 5కే రన్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీఓ కార్యాలయం నుండి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీగా చేరుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప వరమని, ఓటర్లంతా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో తక్కు వ ఓటింగ్ నమోదయ్యిందని, ఈ ఎన్నికల్లో పట్టణప్రాంత ఓటర్లుందరూ తమ ఓటు హక్కు వినియోగించుకొని వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబందించి అన్నీ ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, బెంచీలు, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని, వికలాంగులకు ఇబ్బందులు కలగకుండా వీల్ చైర్స్, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్వో భుజంగ్ రావ్, డిఆర్ డిఓ విజయలక్ష్మి, డీఈవో రవీందర్ రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, యువత, తదితరులు పాల్గొన్నారు.










# బిజెపి కబంధహస్తాల నుండి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ**



మందమర్రి, మే 07 (భారతశక్తి ప్రతినిధి):జరగనున్న పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించి, దేశాన్ని, రాజ్యాంగాన్ని ,ప్రజలను రక్షించుకుందామని, అదేవిధంగా సిపిఐ బలపరుస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ను గెలిపిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ లు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టడంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరిత, కుట్రలు, కుత్రంతాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తుందని ఆరోపించారు. ఒకప్పుడు నష్టం వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తామని, ఆతర్వాత కల్లబొల్లి కబుర్లతో లాభాలు వచ్చే సంస్థలను సైతం అమ్మకానికి పెట్టారని, ఇప్పుడు ఏకంగా ప్రభుత్వం వ్యాపారం చేయబోదంటూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు, గనులు, రవాణా, టెలికాం, బ్యాంకులు, ఇన్సూరెన్స్, తదితర ప్రభుత్వ రంగాలను, ఆఖరికి దేశ రక్షణ కోసం పని చేసే రక్షణ రంగాన్ని సైతం వదలలేదని, ల్యాబ్,ఇస్రో లాంటి ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలను సైతం అంబానీ, ఆదాని లాంటి పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మి వేశారని ఆరోపించారు. దేశ సహజ సంపదను బంగారు పళ్లెంలో పెట్టి కార్పొరేటర్లకు అప్పచెప్పారని విమర్శించారు. దీంతో సంతృప్తి చెందక ఆర్థిక బకాసురులైన పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులను 30 నుండి 90 సంవత్సరాల లీజు పేరుతో ధారాదత్తం చేస్తున్నారన్నారు. దేశం 200 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రతి పౌరుడిపై లక్షల రూపాయల అప్పు ఉ ందంటే బిజెపి హయాంలో ఎంత మోసం జరుగుతుందో అవగతం అవుతుందని తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో పాలకులతో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం ఏకంగా రద్దు చేస్తుందని, బడా పారిశ్రామికవేత్తల నిర్ణయానికి అడుగులకు మడుగులు ఒత్తుతూ ప్రభుత్వరంగ సంస్థలను దోచుకునేలా చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. అదేవిధంగా ప్రశ్నించే గొంతుకలను దేశద్రోహులని ముద్రిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి బిజెపి దుర్మార్గపు పాలన ఓడించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజు, నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌల్, పట్టణ సహాయ కార్యదర్శి బండారి రాజేశం నాయకులు బియ్యాల పద్మ, రాయబారపు వెంకన్న, రాయబారపు జనార్దన్, సమేందర్, గడ్డం సంతోష్, ఎస్ కొండయ్య, శ్రీనాథ్, నరసయ్య, మిట్టపల్లి పౌల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పార్లమెంట్ వెనుకబాటుకు కారణం గత పాలకులే: పెద్దపల్లి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి ముల్కల రాజేంద్రప్రసాద్

మందమర్రి, మే 07 (భారత శక్తి ప్రతినిధి):పెద్దపల్లి పార్లమెంట్ వెనుకబాటుకు గత పాలకులే కారణమని పెద్దపల్లి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి ముల్కల రాజేంద్రప్రసాద్ మంగళవారం ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వర్గీయ కాకా వెంకటస్వామి పెద్దపల్లి నుండి నాలుగు సార్లు ఎంపీగా గెలుపొంది, కేంద్ర మంత్రిగా పనిచేశారని, ఆయన తనయుడు ప్రస్తుత బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చెన్నూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారని, ప్రస్తుతం చెన్నూరు



ఎమ్మెల్యే గడ్డం వివేక్ సైతం గతంలో పెద్దపల్లి ఎంపీ గా ఉన్నారని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుండి రాజకీయ ప్రస్తానాన్ని మొదలుపెట్టిన కాకా కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కొన్ని సంవత్సరాలుగా పెద్దపల్లి పార్లమెంట్ నుండి గెలుపొంది, తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కాకా కుటుంబం పెద్దపల్లి, పార్లమెంట్లో పరిధిలో ఎన్ని ఫ్యాక్టరీలు పెట్టి ఎంతమందికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని ప్రశ్నించారు. కనీసం పట్టణంలో ఉన్న లెదర్ పార్క్ ను సైతం ప్రారంభించలేదని, అదేవిధంగా సింగరేణి కార్మికులకు ఐటీ మాఫీ చేయించలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న ప్రతి పార్టీలో కాకా కుటుంబం ఉండేదని అయినప్పటికీ పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధిని వారు పట్టించుకోలేదని విమర్శించారు. అదేవిధంగా పెద్దపల్లి ఎంపీగా బాల్క సుమన్ ను, బోర్లకుంట వెంకటేష్ నేత లను బిఆర్ఎస్ నుండి గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంట్ కు వారు చేసింది శూన్యమని విమర్శించారు. సింగరేణి కార్మికుడిని అని చెప్పుకునే మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర మంత్రిగా ఉ న్నప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమిటో తెలపాలని ప్రశ్నించారు. గడ్డం వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి ఉన్నాడా, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాడా ముందు చూసుకోవాలని హితవు పలికారు. పెద్దపల్లి పార్లమెంట్ ను అభివృద్ధి చేయని కుటుంబం నుండి వచ్చిన మూడోతరమే గడ్డం వంశీకృష్ణ అని ఎద్దేవా చేశారు. వీరందరికీ ఓటు వేయడం వల్ల పెద్దపల్లి పార్లమెంట్ కు ఎటువంటి ఉపయోగం లేదని, గడ్డం వంశీకృష్ణ కు, కొప్పుల ఈశ్వర్ కు ఓటు వేస్తే మన సమాధులు మనమే తవ్వుకున్నట్లే అవుతుందని తెలిపారు. మే 13న జరుగు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచేందుకు స్థానికుడైన స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ముల్కల రాజేంద్రప్రసాద్ వజ్రం గుర్తుకు ఓటు వేసి, అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను ఎంపీగా గెలిపిస్తే, నియోజకవర్గంలో అభివృద్ధి సాధిద్దామని పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరిక

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే 07: మంగళవారం కామారెడ్డి నియోజకవర్గం పాల్వంచ మండలానికి చెందిన యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవయ్య, రైతు సమన్వయ కమిటీ గ్రామ అధ్యక్షులు శివయ్య, మున్నూరు కాపు మండల అధ్యక్షులు మల్లయ్య, రైతు సమన్వయ కమిటీ కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గౌడ సంఘం గ్రామ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు రంజిత్ గౌడ్, బిఆర్ఎస్ యువజన విభాగం గ్రామ మాజీ అధ్యక్షులు కృష్ణ గౌడ్, మున్నూరు కాపు గ్రామ అధ్యక్షులు లింగం, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నరహరి, కిష్టాగౌడ్, రాజా గౌడ్, మైనారిటీ సెల్ గ్రామ అధ్యక్షులు జకీర్, అందరు బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో



చేరిన వారికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థి సురేష్ శెట్కార్ ని భారీ మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం

నల్లగొండ, మే 7 ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను మూడేళ్లలో పూర్తిచేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎసకు ఓటువేస్తే మూసీలో వేసినట్లేనని, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు తన నియోజకవర్గం నల్లగొండలో ఎంత మెజార్టీ వస్తుందనే ది ప్రతీ ఒక్కరు చర్చించుకుంటున్నందున అందరి కంటే ఎక్కువగా నల్లగొండ నియోజకవర్గంలో మెజార్టీ ఇచ్చి తన మాట నిలబెట్టాలన్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి 75వేల నుంచి లక్ష ఓట్ల మెజార్టీని కట్టబెట్టి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ని భారీ



మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభు త్వం బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.3,900కోట్ల లోటుతో ఉందని, గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో జూన్ 2 నుంచి ప్రతీక్ ఫౌండేషన్ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువస్తానని, వారి ద్వారానే ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందే లా ప్రణాళికను సిద్ధం చేశానన్నారు. వారికి నెల కు రూ.10వేల జీతం ఫౌం డేషన్ ద్వారా చెల్లిస్తానన్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో చేసింది ఏమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు శ్రీశై లం సొరంగ మార్గాన్ని 30కిలోమీటర్లు పూర్తి చేస్తే బీఆర్ఎస్ 10కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేదన్నారు. ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికల్లో తమ గెలుపు ప్రతీ ఒక్కరి గెలుపు అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షు డు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎన్నికల ఇన్‌చార్జి నిరంజన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేషగౌడ్, జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మ య్య, నాయకులు సుమన్, కొండేటి మల్లయ్య, గుత్తా జితేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, విజయలక్ష్మి, జూకూరి రమేష్, బొడ్డుపల్లి లక్ష్మి, గోపగాని మాధవి, పాశం సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ స్లిప్పులు అందించాలి

పెద్దపల్లి, మే 7: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పులను అందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికా స్‌రాజ్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు ర్యాం



డమైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఈవీఎం యంత్రాలపై బ్యాలెట్ పత్రాల కమీషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అవసరమైన మేర పోస్టల్ బ్యాలెట్ పేపర్లు అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా పంపిణీ చేయాలని సూచించారు. పారదర్శకంగా హెూం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి పార్లమెంట్ పరిధిలో తుది ఓటర్ జాబితా రూపొందించామని, ప్రతి ఓటర్ కు ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతు లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, అరుణశ్రీ, ఆర్డీఓలు హనుమా నాయక్, డీపీఓ ఆశాలత పాల్గొన్నారు.

# సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దు

కోల్‌సిటీ, మే 7 సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దని, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని గోదావరిఖని సైబర్ సెక్యూరిటీ ఏసీపీ వెంకట రమణ పిలుపునిచ్చారు. సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవా రం గోదావరిఖనిలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైనెస్(సిమ్స్)లో విద్యార్థు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఓటీపీ ఫ్రాడ్స్, బయోమెట్రిక్ కెడిక్ కార్డ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, ఆన్‌లైన్ పేమెంట్స్, అడ్వటైజ్‌మెంట్స్, పెటెక్స్ కొరియర్‌ల పేర ఫ్రాడ్‌లు, లోన్‌యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్ల గురించి తెలిపారు. ఆన్‌లైన్ మోసాలను అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్య లను వివరించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, కళాశా ల ప్రొఫెసర్లు, సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతశక్తి



# ‘భారతీయుల వల్లే అమెరికా టెక్ ఇండస్ట్రీ మనుగడ’



సిలికాన్ వ్యాలీ: నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా భావించే అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో జరిగే అత్యధిక ఇన్నోవేషన్లకు భారతీయులే నాయకులని ‘సిలికాన్ వ్యాలీ సెంట్రల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్’ సీఈఓ హర్బీర్ కె భాటియా తెలిపారు. ఇండియన్స్ లేకుండా అగ్రరాజ్య టెక్ పరిశ్రమ మనుగడ సాగించలేదని పేర్కొన్నారు.గతంలో సేకరించిన సమాచారం ప్రకారం.. సిలికాన్ వ్యాలీలోని 40 శాతం సీఈఓలు/వ్యవస్థాపకులు దక్షిణాసియా లేదా ఇండియా నుంచి వచ్చినవారేనని భాటియా తెలిపారు. గూగుల్, యూట్యూబ్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రధాన కంపెనీలన్నింటికీ భారతీయులే నేతృత్వం వహిస్తున్నారని గుర్తుచేశారు. కష్టపడేతత్వం, మెరుగైన ఉత్పాదకత వంటి విలువలే మనల్ని ఉన్నతస్థానాలకు చేర్చుతున్నాయని అభిప్రాయపడ్డారు.‘మనం స్కూళ్లో ఉన్నప్పుడు 98 శాతం మార్కులు సాధిస్తే 100 శాతం ఎందుకు రాలేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తారు. ఈ సంస్కృతే మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా ఉంచుతోంది. మనం ఎప్పటికీ సంతృప్తి చెందబోం. ఆ తహతహే మరింత ముందుకు తీసుకెళ్తోంది” అని భాటియా వివరించారు. సమస్యలను పరిష్కరించడంలో భారతీయులది చాలా ప్రత్యేకమైన మార్గమని కొనియాడారు. సిలికాన్ వ్యాలీ విజయంలో మనది చాలా కీలక పాత్ర అని తెలిపారు.అమెరికా టెక్ పరిశ్రమ కార్యకలాపాలన్నీ భారతీయులే నిర్వహిస్తున్నారని భాటియా తెలిపారు. ఒక ఉద్యోగి అమెరికన్ అయితే.. ముగ్గురు భారత్ నుంచి పనిచేస్తుంటారని పేర్కొన్నారు. ప్రతి టెక్ కంపెనీ ఆదాయానికి భారతీయులే మూలమని తెలిపారు. టెక్, సాగు, ఆరోగ్య సంరక్షణ ఇలా ఏ రంగంలోనైనా పనిచేయగల సామర్థ్యం ఇండియన్స్‌లో ఉందని తెలిపారు. అందుకే వీసాలపై అమెరికా పరిమితి విధిస్తోందని చెప్పారు. లేదంటే ఉద్యోగాలన్నింటినీ మనవాళ్లే సొంతం చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# వేతనంలోఎంత పొదుపు చేయాలంటే



వచ్చిన ఆదాయాన్నంతా ఖర్చు చేస్తే.. భవిష్యత్ లక్ష్యాలను సాధించడం కష్టమవుతుంది. కాబట్టి, పొదుపు, పెట్టుబడులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వేతనం రాగానే ఖర్చుల కోసం కేటాయించకుండా, కొంత పొదుపు చేయడం ఒక అలవాటుగా మారాలి.ఆర్థిక ప్రణాళిక ఒక్క రోజుతో సాధ్యం కాదు. లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో పెట్టుబడులు కొనసాగాలి. వేతనంలో ఎంత శాతం పొదుపు చేయాలనే విషయంలో ఒక కచ్చితమైన అభిప్రాయానికి రాలేం. బాధ్యతలు, ఆర్థిక లక్ష్యాలు, నష్టభయం భరించే సామర్థ్యం ఇలా అనేక అంశాలు పొదుపును నిర్ణయిస్తాయి.ఆర్థిక లక్ష్యాలేమిటి?వేతనంలో ఎంత శాతాన్ని పెట్టుబడులకు కేటాయించాలని నిర్ణయించుకునే ముందు.. మీ ఆర్థిక లక్ష్యాలను విశ్లేషించడం చాలా కీలకం. పదవీ విరమణ ప్రణాళికలు, సొంత ఇల్లు, పిల్లల చదువులు ఇలా కొన్ని స్వల్పకాలిక, మరికొన్ని దీర్ఘకాలిక అవసరాలు ఉంటాయి. వీటికి అనుగుణంగా పెట్టుబడులు ఉండేలా చూసుకోవాలి. ఏ అవసరానికి ఎంత పెట్టుబడి అవసరం, వేటిని వాయిదా వేయొచ్చు.. ఇలా ఒక కచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. అప్పుడే ఎంత మేరకు పొదుపు చేయాలన్నది స్పష్టత వస్తుంది.

50:30:20 సూత్రంతో..

పెట్టుబడులకు సంబంధించి ఒక ప్రామాణిక సూత్రాన్ని పాటించవచ్చు. అదే 50:30:20 నియమం. మీకు వచ్చిన ఆదాయంలో 50 శాతం వరకూ అవసరాల కోసం కేటాయించాలి. 30 శాతం విచక్షణా ఖర్చులకు వినియోగించాలి. మిగతా 20 శాతాన్ని పొదుపు, పెట్టుబడులకు మళ్లించాలి. కొంతమందికి 15 శాతం వరకే అనుకూలంగా ఉండొచ్చు. నిత్యావసరాలు, బిల్లులు, పిల్లల ఫీజులు, రుణ వాయిదాల చెల్లింపుల్లాంటివన్నీ అవసరాలు. విచక్షణ ఖర్చుల్లో విందులు, వినోదాలు, విహార యాత్రల్లాంటివి ఉంటాయి. పెట్టుబడులకు తగిన మొత్తం అందుబాటులో లేదు అనుకున్నప్పుడు విచక్షణ ఖర్చులను నియంత్రించడం అలవాటు చేసుకోవాలి. ఆదాయంలో ఎంత మేరకు మదుపు చేయాలనేది నిర్ణయించుకునే ముందు.. మీ నష్టభయ సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలి. పెట్టుబడుల్లో నష్టభయం దాగి ఉంటుందన్న సంగతి మర్చిపోవద్దు. అధిక నష్టభయం ఉన్న పథకాల్లో మంచి రాబడి వస్తుంది. సురక్షితమైన పథకాల్లో పొదుపు చేస్తే, ద్రవ్యోల్బణాన్ని మించి రాబడిని అందుకోలేం.

వైవిధ్యంగా ఉండేలా..పెట్టుబడులు పెట్టేటప్పుడు ఏదో ఒక పథకంలోనే మదుపు చేయడం మంచిది కాదు. వీలైనంత వరకూ వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలి. ఈక్విటీలు, బాండ్లు, స్థిరాస్తులు, మ్యూచువల్ ఫండ్లు, బంగారం ఇలా అన్ని రకాల పథకాలనూ ఎంచుకోవాలి. దీనివల్ల పోర్ట్‌ఫోలియోలో నష్టభయం పరిమితం అవుతుంది.సమీక్షిస్తూ ఉండాలి..ఎంచుకున్న పథకం పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం మర్చిపోవద్దు. వేతనం పెరిగినప్పుడు దీంతోపాటు పెట్టుబడులనూ పెంచుకునేందుకు ప్రయత్నించాలి. బాధ్యతలు, లక్ష్యాల్లో మార్పులు రావచ్చు. వాటికి అనువైన పథకాలను ఎంచుకోవాలి. మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా మీ ఆర్థిక ప్రణాళికనూ సమీక్షించుకోవడం మంచిది.

# ఆరోగ్య బీమా మరింత భారం




పెరుగుతున్న ఆసుపత్రి ఖర్చులను తట్టుకునేందుకు ఆరోగ్య బీమా తప్పనిసరిగా మారింది. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఇటీవలి కాలంలో ఆరోగ్య బీమా పాలసీలకు సంబంధించి కొన్ని కీలక మార్పులు చేసింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మార్పుల నేపథ్యంలో బీమా సంస్థలు ప్రీమియాన్ని మరింత పెంచాలనే యోచనలో ఉన్నాయి.ఏ వయసు వారికైనాఆరోగ్య బీమా పాలసీ తీసుకునేందుకు గరిష్ఠ వయోపరిమితి 65 ఏళ్లుగా ఉన్న నిబంధనను ఐఆర్‌డీఏఐ తొలగించింది. దీంతోపాటు ముందస్తు వ్యాధుల విషయంలో వేచి ఉండే వ్యవధిని నాలుగేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించింది. ఈ నేపథ్యంలో బీమా సంస్థలకు అధిక క్లెయింలు వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రీమియాలను సర్దుబాటు చేసేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి.15 శాతం వరకు పెంపుప్రీమియం పెంచుతున్నట్లు ఇప్పటికే బీమా సంస్థలు పాలసీదారులకు సమాచారమిస్తున్నాయి. పాలసీలను బట్టి, కొత్త ప్రీమియం రేట్లు జులై, ఆగస్టు నుంచి అమలవుతాయని వెల్లడిస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం బీమా సంస్థల ప్రీమియం రేట్లు 10-15% అధికమయ్యే సూచనలున్నాయి. సాధారణ, స్టాండలోన్ ఆరోగ్య బీమా సంస్థలూ తమ పాలసీదారులకు ప్రీమియం పెంపు సమాచారాన్ని పంపిస్తున్నాయి.ఏడాదికోసారి..సాధారణంగా బీమా ప్రీమియాలు వయసును బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు 35 ఏళ్ల వరకు ఒకే ప్రీమియం ఉంటుంది. ఆ తర్వాత మారుతుంది. ఇలా 10-20% వరకు ప్రీమియం అధికమవుతుంది. దేశంలో సగటున ఈ పెంపు 15% ఉంటోంది. బీమా ప్రీమియాన్ని సంస్థలు మూడేళ్లకోసారి సమీక్షించేవి. క్లెయింలు, వైద్య ద్రవ్యోల్బణం ఆధారంగా ఈ పెంపును నిర్ణయించేవి. దీనికి ఐఆర్‌డీఏఐ అనుమతి తీసుకోవాలి. గతంలో నియంత్రణ సంస్థ ఈ నిబంధనను సవరిస్తూ, బీమా సంస్థలకు ఏటా ప్రీమియం పెంచుకునే వెసులుబాటు ఇచ్చింది. ఈ పెంపు గురించి తప్పనిసరిగా ఐఆర్‌డీఏఐకు సమాచారం ఇచ్చి, ఆమోదం తీసుకోవాలి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు బీమా సంస్థలు ప్రీమియం పెంచేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాయి. పెద్దలకు కష్టమే..65 ఏళ్లు దాటిన వారికి ఇచ్చేందుకు వీలుగా ప్రత్యేక పాలసీలు తీసుకొచ్చేందుకు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఇవి ప్రామాణిక పాలసీల ప్రీమియం కంటే ఖరీదైనవిగా ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఉదాహరణకు 65 ఏళ్ల వ్యక్తికి రూ.10 లక్షల విలువైన బీమా పాలసీ అందించేందుకున్న ప్రీమియం ఇప్పుడు రూ.55,000 వరకు ఉంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

# ఉన్నత చదువులకు భరోసానిద్దాం...



పిల్లల చదువుల ఖర్చులు ఏటా 7-10 శాతం పెరుగుతున్నాయి. మరోవైపు క్షీణిస్తున్న రూపాయి విలువ దీనికి అదనం. ఒకప్పటితో పోలిస్తే పిల్లల ఉన్నత చదువుల ప్రణాళిక ఇప్పుడు క్లిష్టంగా మారింది. ఈ ఆర్థిక సవాలును అధిగమించేందుకు ఏం చేయాలన్నది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. దీనికి సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.భారతీయుల ఆర్థిక ప్రణాళికల్లో పిల్లల చదువులకే అధిక ప్రాధాన్యం. బడిలో చేరింది మొదలు.. ఉన్నత విద్య వరకూ ఎంత మొత్తం కావాలో ముందే ఆలోచించాల్సిన అవసరం ఉంది. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే దీర్ఘకాలిక దృష్టితో అధిక రాబడిని అందించే పథకాల్లో మదుపు చేయడం ప్రారంభించాలి. అప్పుడే ఎలాంటి చిక్కులూ లేకుండా పిల్లల ఆశలు తీర్చడంలో తల్లిదండ్రులు విజయం సాధిస్తారని చెప్పొచ్చు.కాస్త పేరున్న పాఠశాలలో పిల్లలను చేర్చాలంటే ఏడాదికి రూ. 1.5 లక్షల వరకూ ఖర్చవుతోంది. దీనికి ఇతర ఖర్చులు అదనం. బడిలో చేరినప్పటి నుంచీ ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ ఎంత ఖర్చు అవుతుందన్నది ఒక అంచనా వేసుకోవాలి. దీనివల్ల ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలనే విషయంపై ఒక స్పష్టత వస్తుంది. మొత్తం ఒకేసారి అవసరం ఉండదు. దశల వారీగా, ఎప్పుడు ఎంత మొత్తం కావాలి అన్నది తెలుసుకుంటే.. అందుకు అనువైన పథకాల్లో మదుపు చేసేందుకు వీలవుతుంది. పిల్లల అవసరాలకు పెట్టుబడులు పెట్టేటప్పుడు దీర్ఘకాలంలో అధిక రాబడినిచ్చే వాటిని ఎంచుకోవాలి.పలు పథకాల్లో...పిల్లల చదువులకు అవసరమైన మొత్తం కూడబెట్టేందుకు ఏదో ఒక పథకంపైనే ఆధారపడితే సరిపోదు. సురక్షితంగా ఉండే రికరింగ్ డిపాజిట్లు మొదలు.. అధిక నష్టభయం ఉండే షేర్ల వరకూ పెట్టుబడులు ఉండాలి. ఈక్విటీ ఫండ్లతోపాటు, డెట్ పథకాలనూ ఎంచుకోవాలి. అధిక నష్టభయం ఉండే ఈక్విటీ పథకాలకు ఎంత కేటాయించాలి, సురక్షిత పథకాలకు ఎంత మళ్లించాలి అనేదీ కీలకమే. 10-12 ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు ఈక్విటీ ఆధారిత పెట్టుబడులను ఎంచుకోవాలి. 4-5 ఏళ్లలోనే డబ్బు వెనక్కి రావాలనుకుంటే డెట్ పథకాలను పరిశీలించాలి.ఫండ్లలోనూ మదుపు

పిల్లల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రత్యేక పథకాలనూ తీసుకొస్తున్నాయి. చైల్డ్ కెరీర్ ప్లాన్, చైల్డ్ గిఫ్ట్ ప్లాన్ వంటి పేర్లతో ఇవి ఉంటాయి. సెబీ నిబంధనల ప్రకారం ఈ పథకాలకు అయిదేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. లేదా పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకూ.. ఈ రెండింటిలో ఏది ముందయితే అప్పుడు పెట్టుబడిని వెనక్కి తీసుకునే వీలుంటుంది. ఇవి ఓపెన్ ఎండెడ్ హైబ్రిడ్ పథకాలు. ప్రధానంగా ఈక్విటీ, డెట్‌లలో మదుపు చేస్తాయి. అధిక వడ్డీ కోసం కొంత మొత్తాన్ని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు రుణం ఇచ్చేలా బాండ్లలోనూ కొంత పెట్టుబడి ఉంటుంది. మొత్తంగా వీలైనంత అధిక రాబడిని ఆర్జించేలా, అదే సమయంలో కొంత సురక్షితంగా ఉండేలా పోర్ట్‌ఫోలియోను రూపొందిస్తారు. ఈక్విటీల్లో 65 శాతం వరకూ, డెట్ ఫండ్లలో 35 శాతం వరకూ మదుపు చేస్తాయి. కొన్నిసార్లు ఈక్విటీలకు 75 శాతం వరకూ కేటాయించే అవకాశాలూ ఉంటాయి. కొంత నష్టభయం ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఇది పెద్దగా ప్రభావం చూపదు. పిల్లల ఫండ్ల లక్ష్యం ఒకటే.. వారి భవిష్యత్తుకు తగిన ఆర్థిక భరోసా కల్పించడం. వారి ఉన్నత చదువులు, విదేశీ విద్యాభ్యాసం, వారి ఇతర కలలకు తగ్గట్టుగా పెట్టుబడులు పెట్టాలి. వీలైనంత వరకూ లక్ష్యం సాధించే వరకూ ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోకూడదు.పిల్లల పాలసీలతో...చాలామంది తల్లిదండ్రుల మొదటి ప్రాధాన్యం తమ పిల్లల కోసం పొదుపు చేయడమే. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకునే వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తుంటారు. పిల్లలకు నిజంగా డబ్బు అవసరమైనప్పుడు, వారి అవసరాలను తీర్చేందుకు ఈ ఒక్క వ్యూహం సరిపోదు. పిల్లల అవసరాలకు అవసరమైన మొత్తం డబ్బు అందుబాటులో ఉంటుందని ఏ పథకమూ హామీ ఇవ్వదు.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, బంగారం, స్థిరాస్తి ఎందులోనైనా సరే మనం పెట్టుబడి పెడుతూ వెళ్తేనే అవి దీర్ఘకాలంలో తగిన రాబడిని అందిస్తాయి.ఉదాహరణకు ఏడాది వయసులో ఉన్న అబ్బాయి/అమ్మాయికి 21 ఏళ్ల వయసుకు వచ్చే నాటికి రూ.20లక్షలు అవసరం అనుకుందాం. దీనికోసం తల్లిదండ్రులు 12 శాతం వార్షిక రాబడి వచ్చే పథకాల్లో ఏటా కనీసం రూ.25వేల వరకూ మదుపు చేయాలి. దీన్ని కూడబెట్టాలంటే.. వారికి ఎలాంటి అనుకోని పరిస్థితులూ ఎదురుకాకూడదు. ఒకవేళ ఏదైనా సంఘటనతో ఆర్జించే కుటుంబ పెద్ద దూరమైతే.. అప్పుడు పెట్టుబడులన్నీ ఆగిపోతాయి. పిల్లల ఆర్థిక అవసరాలు ప్రశ్నార్థకం అవుతాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి తప్పించేందుకే పిల్లల కోసం ప్రత్యేకంగా ఉన్న బీమా పాలసీలను ఎంచుకోవాలి. పాలసీ తీసుకున్న తల్లిదండ్రులు అనుకోకుండా దూరమైనప్పుడు వెంటనే పాలసీ విలువను పరిహారంగా చెల్లిస్తుంది. పాలసీ గడువు తీరే వరకూ కొనసాగుతుంది. దీనికోసం ప్రీమియం వైవర్ రైడర్ తోడ్పడుతుంది. వ్యవధి ముగిసిన తర్వాత బీమా పాలసీ నుంచి అందాల్సిన డబ్బు చేతికి వస్తుంది. ఇలాంటి పాలసీలనూ పిల్లల చదువుల ప్రణాళికలో భాగం చేయాలి.సురక్షితంగా..తల్లిదండ్రులు తమ కుటుంబ సభ్యులకు తగిన ఆర్థిక రక్షణ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా పిల్లల బాధ్యతలను నెరవేర్చేలా ఉండాలి. అందుకే, సంపాదించే వ్యక్తి తన పేరుమీద.. వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ ఉండేలా చూసుకోవాలి. కుటుంబానికి అంతటికీ వర్తించేలా కనీసం రూ.10లక్షల ఆరోగ్య బీమా పాలసీని తప్పనిసరిగా తీసుకోవాలి.

# ఫిక్స్‌డ్ డిపాజిట్.. ఈ పత్రాలు ఇచ్చారా?

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయా? వీటిపై వచ్చే వడ్డీపై మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్) విధించకుండా ఫారం 15జీ / ఫారం15హెచ్ సమర్పించేందుకు సమయం ఇదే.ఆదాయపు పన్ను పరిధిలోకి రాని వారు, వడ్డీ ఆదాయంపై పన్ను విధించకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఈ పత్రాలను అందించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం 1961, సెక్షన్ 194ఏ ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం రూ.40వేల వరకూ ఉన్నప్పుడు ఎలాంటి టీడీఎస్ విధించరు. సీనియర్ సిటిజన్లకు ఈ పరిమితి రూ.50,000. ఈ పరిమితులు దాటినప్పుడు బ్యాంకులు 20 శాతం చొప్పున టీడీఎస్‌ను విధిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో వడ్డీ తప్ప ఇతర ఆదాయాలేమీ లేనప్పుడు ఈ పత్రాలను బ్యాంకులో అందించాల్సి ఉంటుంది. వడ్డీ ఆదాయం నుంచి ఎలాంటి మినహాయింపులూ చేయొద్దని ఇచ్చే స్వీయ ధ్రువీకరణలివి.



ఈ పత్రాలను నేరుగా బ్యాంకు శాఖలకు వెళ్లి ఇవ్వొచ్చు. సంబంధిత బ్యాంకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానూ సమర్పించవచ్చు. ఈ పత్రాలు ఒక ఆర్థిక సంవత్సరానికి మాత్రమే చెల్లుబాటు అవుతాయి. కాబట్టి, ప్రతి ఆర్థిక సంవత్సరమూ వీటిని అందించాల్సిందే.ఎవరు ఇవ్వాలంటే..60 ఏళ్ల లోపు భారతీయులు, హెచ్‌యూఎఫ్‌లు, ట్రస్టులు ఫారం 15జీ ఇవ్వడానికి అర్హులు. సంబంధిత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి పన్ను బాధ్యత లేనప్పుడు మాత్రమే ఇది వర్తిస్తుంది. కంపెనీలు, ప్రవాసులు ఈ పత్రాన్ని సమర్పించడం కుదరదు.60 ఏళ్లకు మించిన సీనియర్ సిటిజన్లు ఫారం 15 హెచ్‌ను సమర్పించాల్సి ఉంటుంది.ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఎప్పుడైనా సరే ఈ పత్రాలను అందించేందుకు వీలుంది. కానీ, ప్రారంభంలోనే ఈ పత్రాలను అందించడం వల్ల మూలం వద్ద పన్ను కోత పడకుండా చూసుకోవచ్చు. సమర్పించిన తేదీ నుంచే టీడీఎస్‌ను మినహాయించరు. ఉదాహరణకు అక్టోబరులో మీరు ఈ పత్రాన్ని ఇచ్చారనుకుందాం. అప్పటి నుంచి టీడీఎస్ ఉండదు. కానీ, ఏప్రిల్-సెప్టెంబరు వరకూ విధించిన టీడీఎస్ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండుగా పొందాల్సి ఉంటుంది. కాబట్టి, వడ్డీ ఆదాయంపై టీడీఎస్ విధించకముందే ఈ పత్రాలను ఇవ్వడం ఉత్తమం.

# సైబర్ దాడులు.. మనపై ఎక్కువే

దిల్లీ: అమెరికా, బ్రిటన్ తర్వాత అంతర్జాతీయంగా ‘ఫిషింగ్’ దాడులను అత్యధికంగా ఎదుర్కొంటున్నది మన దేశమే. భారత దేశంపై జరిగిన సైబర్ దాడుల్లో 33% టెక్నాలజీ రంగంపైనే కనిపించాయని స్కేలర్ అనే సైబర్ భద్రతా సంస్థ తన నివేదికలో పేర్కొంది. గతేడాది కాలంగా అంతర్జాతీయ ఫిషింగ్ దాడులు 60% పెరిగాయని తెలిపింది. 2023 జనవరి-డిసెంబరులో కనిపించిన 200 కోట్ల బ్లాక్డ్ ఫిషింగ్ లావాదేవీల ఆధారంగా రూపొందిన ఈ నివేదిక ప్రకారం.. భారత్‌లో టెక్ రంగం(33%) అన్ని రంగాల కంటే ఎక్కువగా సైబర్ దాడులకు గురైంది.ఆర్థిక, బీమా రంగాల్లోనూ 2022తో పోలిస్తే సైబర్ దాడులు 393% పెరిగాయి. ఈ రంగాలు డిజిటల్ ప్లాట్‌ఫారాలపై ఆధారపడడం అధికమవ్వడం, సైబర్‌నేరగాళ్లకు కలిసొస్తోంది.తయారీ రంగంలో 2022, 2023 మధ్య ఫిషింగ్ 31% పెరిగింది. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటుండడంతో ఆయా రంగాలు దాడులకు ‘బలహీన లక్ష్యాలు’గా మారాయి.2023లో ఫిషింగ్ దాడులకు అమెరికా ఎక్కువగా బలైంది. మొత్తం దాడుల్లో 55.9% ఈ దేశంపైనే జరగ్గా.. బ్రిటన్‌పై 5.6%, భారత్‌పై 3.9% (7.9 కోట్ల దాడులు) చోటు చేసుకున్నాయి.భారత్‌లో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ అమలు వల్ల ఇటువంటి దాడులను నిలువరించడానికి సహకారం లభించినట్లయింది.2023లో అత్యంతగా అనుకరించిన బ్రాండ్లలో మైక్రోసాఫ్ట్ కనిపించింది. ఆ తర్వాతి స్థానంలో అడోబ్, అమెజాన్, గూగుల్ ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా దాడుల బారినపడ్డ సామాజిక మాధ్యమాల్లో టెలిగ్రాం (7,92,883 ఫిషింగ్ దాడులు) ఉంది. ఆ తర్వాతి స్థానంలో ఫేస్‌బుక్ (5,32,243), వాట్సప్ (3,78,968) ఉన్నాయి.

# 'హరిహర వీరమల్లు' దర్శకుడి మార్పు.. క్రిష్ స్థానంలో ఎవరంటే



పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరిహర వీరమల్లు'. తాజాగా విడుదలైన దీని టీజర్ ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియులందరిలో జోష్ నింపింది. పేదల పక్షాన పోరాడే యోధుడిగా పవన్ కల్యాణ్ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. అయితే, ఈ టీజర్ విడుదల సందర్భంగా నిర్మాతలు ఓ కీలక ప్రకటన చేశారు. ఈ చిత్రం మిగిలిన షూటింగ్‌ను పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను దర్శకుడు జ్యోతి కృష్ణ పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన కొన్ని పోస్టర్లపై క్రిష్ జాగర్లమూడి పేరు లేకపోవడంతో కొందరు నెటిజన్లు చిత్రబృందాన్ని ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. ఈ సినిమా నుంచి క్రిష్ వైదొలిగారా అనే కామెంట్స్ మొదలయ్యాయి. తాజాగా వారందరికీ నిర్మాతలు క్లారిటీ ఇచ్చారు.

"నీ మనసు నాకు తెలుసు', 'ఆక్సిజన్' వంటి చిత్రాలకు రచయితగా, దర్శకుడిగా చేసిన జ్యోతి కృష్ణ 'హరిహర వీరమల్లు' మిగతా షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. సినిమా పూర్తి చేయడంలో ఊహించని ఆలస్యం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీసుకురానున్నారు. మొదటి పార్ట్‌ను "స్వార్డ్ వర్సెస్ స్పిరిట్" పేరుతో విడుదల చేయనున్నారు. 'ధర్మం కోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. ఈ ఏడాది చివర్లో ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్, సునీల్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

# సిద్ధార్థ్‌తో నిశ్చితార్థం.. అందుకే వెల్లడించాల్సి వచ్చింది: అదితిరావు



నటి అదితిరావు హైదరీ )-సిద్ధార్థ్‌ల నిశ్చితార్థం గత నెలలో జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై అదితి స్పందించారు. మీడియా వాళ్లకు వెల్లడించడానికి గల కారణాన్ని తెలిపారు. తన తల్లి కోరికమేరకు నిశ్చితార్థం జరిగినట్లు పోస్ట్ పెట్టానన్నారు.

"జీవితంలో జరిగే ముఖ్యమైన వాటిని ప్రత్యేక ప్రదేశంలో చేసుకోవాలని అందరూ అనుకుంటారు. నేను నా నిశ్చితార్థాన్ని 400 ఏళ్ల నాటి గుడిలో చేసుకున్నాను. ఆ దేవాలయంతో మా కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంది. మా అమ్మ కారణంగానే ఎంగేజ్‌మెంట్ ఫొటోలను పోస్ట్ చేశాను. మా పెళ్లి గురించి తెలుసుకోవాలని ఎంతోమంది మా అమ్మకు ఫోన్లు చేశారు. నిరంతరం వచ్చిన కాల్స్‌కు ఆమె సమాధానం చెప్పలేకపోయింది. 'దయచేసి నీ ఎంగేజ్‌మెంట్ విషయం మీడియాకు వెల్లడించు' అని కోరింది. దీంతో నేను, సిద్ధార్థ్ దీనిపై పోస్ట్‌లు పెట్టాం" అని అదితిరావు తెలిపారు. మార్చి 27న వనపర్తి జిల్లాలోని శ్రీ రంగాపూర్ రంగనాథ స్వామి దేవాలయంలో వీళ్లిద్దరూ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలు, అతితక్కువమంది బంధువుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించారు.

తాజాగా అదితిరావు 'హీరామండీ: ది డైమండ్ బజార్' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించారు. సంజయ్‌లీలా బన్సాలీ దర్శకుడు. ఇందులో ఆమె బిబ్బోజాన్ పాత్రలో ఆకట్టుకున్నారు. వేశ్య వృత్తితో సమాంతర వ్యవస్థను నడుపుతున్న కొంతమంది మహిళల జీవిత కథే ఈ సిరీస్. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ సిరీస్‌లో మనీషాకొయిరాలా, సోనాక్షి సిన్హా, రిచా చద్దా, సంజీదాషేక్‌లు కీలకపాత్రలు పోషించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది ప్రసారమవుతోంది.

# మాట నిలబెట్టుకున్న రాజమౌళి- మహేశ్.. 'SSMB29' నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు



అగ్ర దర్శకుడు రాజమౌళి , స్టార్ హీరో మహేశ్ బాబు తనకిచ్చిన మాట నిలబెట్టుకున్నారని నిర్మాత కె.ఎల్. నారాయణ అన్నారు. #SSMB29 (వర్కింగ్ టైటిల్)ని వాళ్లే స్వయంగా ప్రకటించి, పనిపై ఉన్న నిబద్ధతను చాటారని కొనియాడారు. 'హలో బ్రదర్', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'సంతోషం' వంటి హిట్ చిత్రాలను నిర్మించారాయన. సుదీర్ఘ విరామం అనంతరం 'ఎస్ఎస్ఎంబీ 29'ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఆ సినిమా సంగతులు పంచుకున్నారు.

"ఉద్దేశపూర్వకంగా నేను నిర్మాతగా విరామం తీసుకోలేదు. రాజమౌళి- మహేశ్ బాబు కాంబినేషన్ సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ఇప్పుడు వాళ్లిద్దరి క్రేజ్ మరో స్థాయిలో ఉంది. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి నాకు సినిమా చేస్తున్నారు. నేను చెప్పకపోయినా 'దుర్గా ఆర్ట్స్ బ్యానర్'లో మూవీ తీయనున్నట్లు వాళ్లే ప్రకటించారు. అందుకు వాళ్లకి కృతజ్ఞుడిని. రాజమౌళికి హాలీవుడ్ నుంచీ ఆఫర్లు వచ్చాయి. వాటిని కాదనుకుని నా కోసం సినిమా చేస్తున్నారు. రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ వర్క్ సాగుతోంది"

"నిర్మాతలు కథా చర్చల్లో పాల్గొనరనే మాట ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తుంటుంది. అది అందరి విషయంలో నిజం కాదు. రాజమౌళి ప్రతి విషయాన్ని నిర్మాతలతో పంచుకుంటారు. పేపర్ వర్క్ చేస్తున్నప్పుడే క్లారిటీ ఉండడం మంచిదనే ఉద్దేశంతో ఏమైనా సందేహం ఉంటే చెప్పమని అడుగుతారు. చిన్న పాయింట్‌నీ ఆయన ఎంత క్షుణ్ణంగా పరిశీలిస్తారో దగ్గర ఉండి చూస్తున్నా. పాత్రకు తగ్గట్టు మహేశ్ తనని తాను మలుచుకుంటున్నారు. ఆగస్టు లేదా సెప్టెంబరులో చిత్రీకరణ ప్రారంభమవుతుంది. 'ఆర్ఆర్ఆర్' ) తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రం కాబట్టి ఆ అంచనాలను దృష్టిలో పెట్టుకునే ప్లాన్ చేస్తున్నారు. స్టోరీ బాగుంది. బడ్జెట్‌ని ఇంకా డిసైడ్ చేయలేదు. ప్రొడక్టుకు ఎంత అవసరమో అంత ఖర్చు పెట్టేందుకు సిద్ధం" అని అన్నారు.

# అక్టోబరులో మొదలు



'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. నిజానికి ఇది ఈపాటికే చిత్రీకరణ ప్రారంభించుకోవాల్సి ఉన్నప్పటికీ తారక్ 'వార్ 2'తో.. ప్రశాంత్ నీల్ 'సలార్ 2' పనులతో బిజీగా ఉండటంతో ఆలస్యమైంది. అయితే ఇది ఈ ఏడాదిలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. అక్టోబరు నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అప్పటికి ఎన్టీఆర్ 'వార్ 2'ని కూడా పూర్తి చేయనున్నారని తెలుస్తోంది. ఇక మరోవైపు ఈ సినిమా మొదలయ్యే లోగా ప్రశాంత్ నీల్‌తో 'సలార్ 2'ని ప్రారంభించేందుకు హొంబలే ఫిల్మ్స్ సంస్థ యత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. త్వరలోనే దీనిపైనా స్పష్టత రానుంది.

# ఎన్టీఆర్ నాకు తమ్ముడితో సమానం: రాజమౌళి



దర్శకుడు రాజమౌళి స్టార్ హీరో ఎన్టీఆర్ (కాంబోలో వచ్చిన సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లు వసూళ్లు చేశాయి. 'స్టూడెంట్ నెం.1', 'సింహాద్రి', 'యమదొంగ', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలు ఎన్టీఆర్ కెరీర్‌ను మలుపుతిప్పాయి. అంతేకాదు ఈ దర్శకధీరుడి డైరెక్షన్‌లో అత్యధిక సినిమాలు చేసిన హీరో కూడా తారక్ కావడం విశేషం. సినిమాల విషయం పక్కనపెడితే సందర్భం వచ్చిన ప్రతిసారి వీళ్లిద్దరూ వారి స్నేహం గురించి చెబుతుంటారు. తాజాగా 'కృష్ణమ్మ' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు రాజమౌళి హాజరయ్యారు. ఎన్టీఆర్‌పై ఆసక్తికర కామెంట్ చేశారు.

పరిశ్రమలో మీకున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఎవరని యాంకర్ ప్రశ్నించగా.. ఆడియన్స్ అందరూ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. దానికి రాజమౌళి సమాధానం చెబుతూ.. 'ఇండస్ట్రీలో నాకు ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ ఉన్నారు. 'బాహుబలి', 'ఈగ' నిర్మాతలు సాయి కొర్రపాటి, శోభు యార్లగడ్డ నాకు మంచి స్నేహితులు. ఎన్టీఆర్ నాకు తమ్ముడితో సమానం. మిత్రుడు కాదు. నా మొదటి సినిమా 'స్టూడెంట్ నెం.1' అవకాశం రావడానికి రచయిత పృథ్వీతేజ కారణం' అని చెప్పారు. ఇక ఇదే ఈవెంట్లో ఆయన మాట్లాడుతూ.. విజయవాడ అనగానే తనకు కనకదుర్గ గుడి గుర్తుకు వస్తుందన్నారు. తన స్కూల్ ఫ్రెండ్స్ అందరూ గోదావరి జిల్లావాళ్లని భోజనం ఎక్కువగా పెడతారంటూ సరదాగా అన్నారు. తనకు అన్నిరకాల స్వీట్స్ అంటే ఇష్టమని తెలిపారు.

'కృష్ణమ్మ' సినిమా మంచి విజయం సాధించాలని రాజమౌళి కోరుకున్నారు. ''కొరటాల శివ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారని తెలియగానే నా దృష్టి దీనిపై పడింది. దర్శకుడి మాటల్లోని నిజాయతీ ఈ సినిమాలోనూ ఉంటుందని నమ్ముతున్నా. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్లు సినిమా చూడాలనిపించేలా ఉన్నాయి. సత్యదేవ్ అద్భుతమైన నటుడని అందరికీ తెలుసు. అలాంటి నటుడికి ఒక సరైన సినిమా పడితే చాలు ఊహించని స్టార్‌డమ్ వస్తుంది. అది ఈ 'కృష్ణమ్మ' చిత్రంతో సాధ్యమవుతుందని నమ్ముతున్నా" అన్నారు. సత్యదేవ్ హీరోగా వి.వి.గోపాలకృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం మే 10న విడుదల కానుంది.

# ఇప్పటి వరకు 32మంది దర్శకులతో వర్క్ చేశా: అల్లరి నరేశ్




అల్లరి నరేశ హీరోగా మల్లి అంకం తెరకెక్కించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు' ఫరియా అబ్దుల్లా కథానాయిక. వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మే 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడివి శేష్ అతిథిగా హాజరయ్యారు.

'డైరెక్టర్‌గా మల్లికి ఇది తొలి సినిమా. నేను ఇప్పటివరకు 32మంది దర్శకులతో వర్క్ చేశాను. వాళ్లందరూ రిలీజ్‌కు ముందు ఒత్తిడి గురయ్యేవారు. కానీ, మల్లి మాత్రం నవ్వుతూ ఉన్నారు. అలా ఉండడం చాలా గ్రేట్. నిర్మాత ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఫరియా అబ్దుల్లాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆమె ఉన్నత స్థానాలకు వెళ్లాలి. 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా అందరినీ నవ్విస్తుంది. పెళ్లికాని వాళ్లు, సంబంధాలు వెతుకుతున్న వాళ్లు అందరూ ఈ చిత్రం చూడాలి. పెళ్లి పేరుతో జరుగుతోన్న మోసాలను ఇందులో చూపించాం. మీ అందరూ కూడా తెలుసుకోవాలి. మే3 థియేటర్‌కు వచ్చి సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని అల్లరి నరేశ్ కోరారు.

అడివి శేష్ మాట్లాడుతూ..'నరేశ్ నాకు మంచి ఫ్రెండ్. నా మొదటి సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయనే గెస్ట్‌గా వచ్చారు. నరేశ్ అంటే నాకు ఇంట్లో వాళ్లతో సమానం. ఫరియా అబ్దుల్లా మంచి అమ్మాయి. ఈ చిత్రబృందంలో చాలామంది నా కెరీర్ ప్రారంభంలో సపోర్ట్ చేశారు. అందుకే ఈ సినిమా నాకూ ప్రత్యేకమైనది. ఈ చిత్రం ప్రేక్షకాదరణ సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు.

# తలదించితే బానిసవి.. ఎత్తినావా నువ్వే బాదుషావి

"తలదించినావా బానిసవి.. ఎత్తినావా బాదుషావి.. తలపాగరే నీ కిరీటమైతే భూతలమంతా నీదేరా" అంటూ తను నమ్మిన జీవిత సూత్రాన్ని అందరికీ బోధిస్తున్నాడు పుష్పరాజ్. మరి ఈసారి అతని యాక్షన్ హంగామా ఎలా ఉండనుందో తెలియాలంటే 'పుష్ప: 2 ది రూల్' చూడాల్సిందే. అల్లు అర్జున్ టైటిల్ పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా సుకుమార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ



తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 15న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఈ చిత్ర టైటిల్ గీతాన్ని విడుదల చేసింది చిత్ర బృందం. "నువ్వు గడ్డం అట్టా సవరిస్తుంటే దేశం దద్దరిల్లే.. నువ్వు భుజమే ఎత్తి నడిచొస్తుంటే భూమే బద్దలయ్యే" అంటూ పుష్పరాజ్ పాత్ర గుణగణాల్ని.. తన శక్తియుక్తుల్నీ వర్ణిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందీ గీతం. దీనికి దేవిశ్రీప్రసాద్ సమకూర్చిన మాస్ బాణీలు.. చంద్రబోస్ అందించిన సాహిత్యం.. నకాష్ అజీజ్, దీపక్ బ్లూ ఆలపించిన తీరు.. విజయ్ పొల్లంకి, శ్రేష్టి వర్మల నృత్యరీతులు.. అన్నీ చక్కగా కుదిరాయి. అలాగే పాటలో అల్లు అర్జున్ వేసిన షూ డ్రాప్ స్టెప్, ఫోన్ స్టెప్, ఛాయ్ స్టెప్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆఖర్లో రెండు చేతులతో తన గడ్డాన్ని సవరించుకుంటూ "అస్సలు తగ్గేదేలే" అని బన్నీ చెప్పిన డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉంది.

# అల్పాహారం 8 గంటల్లోపే



ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామన్నదీ ముఖ్యమే. ఉదయం అల్పాహారం విషయంలో దీనికి మరింత ప్రాధాన్యముందని ఐఎస్‌గ్లోబల్ అధ్యయనం పేర్కొంటోంది. ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారితో పోలిస్తే ఉదయం 8 గంటల్లోపే టిఫిన్ తిన్నవారికి మధుమేహం ముప్పు 59% వరకు తగ్గుతున్నట్టు తేలింది మరి. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ చేయకపోవటం, పొగ తాగటం వంటి కారకాలు టైప్ 2 మధుమేహం ముప్పు పెరిగేలా చేస్తుంటాయి. వీటికిప్పుడు మరోటీ జోడించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అదే ఆహారం తినే సమయం. నిజంగానే తిండి వేళలు జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్), రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ మోతాదుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కొన్ని అధ్యయనాలే తిండి వేళల మీద దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో ఆహార వేళల మధ్య ఎడమ, తినే సమయం, టైప్2 మధుమేహం మధ్య సంబంధాన్ని గుర్తించటానికి ఐఎస్‌గ్లోబల్ పరిశోధకులు ప్రయత్నించారు. మొత్తం 1,03,312 మంది ఆహార అలవాట్లను విశ్లేషించారు. తొలి రెండేళ్ల సగటు ఆహార పద్ధతుల ఆధారంగా ఏడేళ్లకు పైగా వారి ఆరోగ్య తీరుతెన్నులను పరిశీలించారు. వీరిలో కొత్తగా 963 మంది మధుమేహం బారినపడగా.. రోజూ ఉదయం 9 గంటల తర్వాత అల్పాహారం చేసినవారికి ముప్పు గణనీయంగా ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. శారీరకంగా చూస్తే ఇది సబబే. ఎందుకంటే అల్పాహారం మానేయటం వల్ల గ్లూకోజు, కొలెస్ట్రాల్ నియంత్రణ గతి తప్పుతుంది. ఇన్సులిన్ హార్మోన్ మోతాదులూ అస్తవ్యస్తమయ్యే అవకాశమూ ఉంది. అల్పాహారమే కాదు. రాత్రి భోజనం ఆలస్యంగా చేసేవారికీ.. అంటే రాత్రి 10 గంటల తర్వాత తినేవారికీ మధుమేహం ముప్పు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. తక్కువ తక్కువగా రోజుకు ఐదు సార్లు తినేవారికైతే ముప్పు తగ్గుతున్నట్టు బయటపడింది. అలాగే ఎక్కువసేపు ఉపవాసం ఉన్నవారి విషయంలోనూ ఉదయం 8 గంటల్లోపు అల్పాహారం, పెందలాడే రాత్రి భోజనం చేస్తేనే మంచి ఫలితం కనిపిస్తున్నట్టు తేలటం గమనార్హం. రోజులో తొలి ఆహారం ఉదయం 8 గంటల్లోపు, రాత్రి ఆహారం సాయంత్రం 7 లోపు చేస్తే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు వివరిస్తున్నారు. ఇలాంటి ఆహార పద్ధతితో రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్టూ ఐఎస్‌గ్లోబల్ గతంలో నిర్వహించిన అధ్యయనంలోనూ వెల్లడైంది. మొత్తమ్మీద మధుమేహం, ఇతర సమస్యల నివారణకు ఆహారం, జీవ గడియారం, ఆరోగ్యం మధ్య సంబంధం (క్రోనోన్యూట్రిషన్) బలమైన ప్రభావం చూపుతున్నట్టు రుజువవుతోంది.

# మంచి నిద్రకు మార్గం



మన జీవితంలో దాదాపు సగం కాలాన్ని నిద్రలోనే గడుపుతాం. ఆరోగ్యానికిది ఎంతో అవసరం. సరిగా నిద్ర పట్టకపోతే చిరాకు, అలసట, విచారం కలుగుతాయి. శారీరక స్పందనల వేగమూ తగ్గుతుంది. తలనొప్పి, మానసిక ఒత్తిడి వంటి సమస్యలెన్నో చుట్టుముడతాయి. దీర్ఘకాలంగా తగినంత నిద్ర పట్టకపోతే నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది. దీనికి రకరకాల అంశాలు దోహదం చేస్తాయి. సరైన కారణాన్ని గుర్తిస్తే సరిదిద్దుకోవచ్చు.

పగటి నిద్ర: పగటి పూట ఏదో కాసేపు కునుకు తీస్తే ఇబ్బందేమీ ఉండదు. కానీ ఎక్కువసేపు పడుకుంటే రాత్రి పూట నిద్ర అవసరం తగ్గుతుంది. ఒంట్లో జీవ గడియారమూ గతి తప్పుతుంది. దీంతో పగటి పూట చురుకుగా, రాత్రి పూట నిద్ర వచ్చే ప్రక్రియ అస్తవ్యస్త మవుతుంది. కాబట్టి నిద్ర సమస్యలతో బాధపడేవారు పగటి నిద్రను మానేస్తే మంచిది.

రాత్రుళ్లు ఎక్కువసేపు పని: రోజంతా పనిచేయటానికి మనమేమీ యంత్రాలం కాదు. పనులతో సతమతమైన మనసుకు, కండరాలకు విశ్రాంతి తప్పనిసరి. అప్పటి వరకూ మనల్ని చురుకుగా ఉంచిన అడ్రినలిన్ హార్మోన్ మోతాదులు తగ్గుముఖం పట్టేలా చూసుకోవాలి. అంటే పడుకోవటానికి కొద్ది గంటల ముందే శరీరాన్ని నిద్రకు సన్నద్ధం చేయాలన్నమాట. అందువల్ల ఏ పనీ పెట్టుకోవద్దు. ఆఫీసు రిపోర్టుల వంటివి ముందేసుకొని మేలుకోవద్దు. ఇష్టమైన పుస్తకం చదవటం, శ్రావ్యమైన సంగీతాన్ని వినటం, ధ్యానం చేయటం వంటి మనసుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి.

వ్యాయామం చేయకపోవటం: శారీరక శ్రమ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుంది. కాబట్టి రోజూ ఉదయాన్నే వ్యాయామం చేయటం ఉత్తమం. ఆరుబయట నడక, పరుగు, సైకిల్ తొక్కటం వంటివి చేస్తే స్వచ్ఛమైన గాలికి మనసు, శరీరం ఉత్సాహంతో తొణికిసలాడతాయి. రాత్రిపూట గాఢంగానూ నిద్ర పడుతుంది.

వేళకు పడుకోకపోవటం: షిఫ్ట్ ఉద్యోగులు, తరచూ రాత్రిపూట ఆలస్యంగా పడుకునేవారిలో నిద్ర సమస్యలు తలెత్తటానికి ప్రధాన కారణం వేళకు నిద్ర పోకపోవటం. కాబట్టి రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం చాలా ముఖ్యం. దీంతో నిద్ర వేళలు నియమబద్ధం అవుతాయి. సాయంత్రం వేళ గోరు వెచ్చటి నీటితో స్నానం చేయటం, గ్లాసు పాలు తాగటం, ఇంట్లో లైట్ల వెలుగు తగ్గించుకోవటం ద్వారా మరింత త్వరగానూ నిద్ర పట్టేలా చూసుకోవచ్చు.

ఆలస్యంగా భోజనం: రాత్రిపూట ఆలస్యంగా పీకల దాకా భోజనం చేయటం, జీర్ణం కాని పదార్థాలు తినటం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత పెరుగుతాయి. ఇవి నిద్రను దెబ్బతీస్తాయి. కాబట్టి పడుకోవటానికి మూడు గంటల ముందే భోజనం ముగించెయ్యాలి. కొవ్వు పదార్థాలకు బదులు తేలికగా జీర్ణమయ్యేవి తినాలి.

కాఫీ, టీ ఎక్కువగా: సాయంత్రం వేళల్లో కాఫీ, టీ ఎక్కువగా తాగేవారికి రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కూల్ డ్రింకులు, రెడ్ వైన్, చాక్లెట్లు, ఛీజ్ వంటివీ నిద్రకు చేటు చేస్తాయి.

# డెక్సా స్కాన్‌తోనే గుండెపోటు ముప్పూ వెల్లడి



ఒకే పరీక్షకు రెండు ఫలితాలు. ఎముక సాంద్రతను తెలిపే డెక్సా స్కాన్ పరీక్షతో గుండె పోటు ముప్పును తెలుసుకోవచ్చని హార్వర్డ్ మెడికల్ స్కూల్‌తో పాటు వివిధ సంస్థల సహకారంతో నిర్వహించిన పరిశోధనలో బయటపడింది. ఎముకలు పెళుసు బారటాన్ని గుర్తించటానికి డెక్సా స్కాన్ పరీక్ష చేస్తుంటారు. ఈ క్రమంలో గుండె నుంచి కడుపులోకి వచ్చే బృహద్ధమనిలో గట్టిపడిన క్యాల్షియం కూడా కనిపిస్తుంది. ఇది రక్తనాళాలు గట్టిపడుతున్నాయనటానికి సూచిక. గుండెపోటు, మరణం ముప్పునూ ఇది పట్టి చూపుతుంది. కానీ కడుపులోని ధమనిలో పోగుపడిన క్యాల్షియంకు సంబంధించిన స్కాన్ పరీక్షలను పరిశీలించటానికి, స్కోర్‌ను కేటాయించటానికి చాలా నైపుణ్యం అవసరం. దీనికి సమయమూ ఎక్కువే పడుతుంది. అందుకే చాలామంది డెక్సా స్కాన్ దృశ్యాలను గుండెపోటు ముప్పును గుర్తించటానికి వాడుకోరు. వాటిని పట్టించుకోకుండా పక్కన పెట్టేస్తుంటారు. మరి ఈ ధమనిలోని క్యాల్షియాన్ని అప్పటికప్పుడే పసిగట్టి, స్కోర్‌ను తెలుసుకోగలిగితే? గుండెపోటు ముప్పూ బయటపడుతుంది కదా. పరిశోధకులను ఇదే ఆలోచింపజేసింది. మెషిన్ లెర్నింగ్ సాయంతో దీన్ని త్వరగా గుర్తించొచ్చని, వ్యక్తులతో పనిలేకుండా అప్పటికప్పుడే స్కోర్ ఇచ్చే అవకాశముందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిజ్ఞానం గట్టిపడిన క్యాల్షియాన్ని మనుషులతో సమానంగా గుర్తిస్తుండటం విశేషం. దీన్ని 'ఎంఎల్-ఏఏసీ-24' అని పిలుచుకుంటున్నారు. దీని స్కోర్ ఎక్కువగా గలవారికి గుండెపోటు ముప్పు పెరుగుతున్నట్టూ, దీర్ఘకాలంలో జబ్బు నుంచి కోలుకోవటమూ తక్కువగానే ఉంటున్నట్టూ తేలింది.

# కీళ్లవాతానికీ మధుమేహ మందు



రోగనిరోధక వ్యవస్థ పొరపాటున మన మీదే దాడిచేయటం వల్ల రుమటాయిడ్ కీళ్లవాతం, ల్యూపస్ వంటి స్వీయ రోగనిరోధక జబ్బులు తలెత్తుతుంటాయి. వీటికి మధుమేహ చికిత్సలో వాడే కానాగ్లిఫ్లోజిన్ మందు ఉపయోగపడుతున్నట్టు స్వాన్‌సీ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. కానాగ్లిఫ్లోజిన్ రోగ నిరోధక కణాల్లో భాగమైన టి కణాల మీద ప్రభావం చూపుతుండటం విశేషం. తెల్ల రక్తకణాల్లో భాగమైన టి కణాలు ఇన్‌ఫెక్షన్లు, జబ్బులతో పోరాడటంలో పాలు పంచుకుంటాయి. కానీ స్వీయ రోగనిరోధక జబ్బుల్లో ఇవి ఆరోగ్యకరమైన కణజాలం మీదా దాడికి దిగుతాయి. ఇలాంటి జబ్బుల విషయంలో టి కణాలను లక్ష్యంగా చేసుకొని పనిచేసే మందులతో మంచి ఫలితం కనిపిస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిశోధన ఫలితాలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. కానాగ్లిఫ్లోజిన్ మందు టి కణాలు ప్రేరేపితం కాకుండా నిలువరిస్తున్నందున దీన్ని రుమటాయిడ్ కీళ్లవాతం వంటి జబ్బులకూ వాడుకోవచ్చని భావిస్తున్నారు. మధుమేహ నియంత్రణకే కాకుండా ఇది ఇతర జబ్బులకూ ఉపయోగపడటం విశేషమని అనుకుంటున్నారు.

# క్యాన్సర్‌పై టీకాస్త్రం



క్యాన్సర్ చికిత్సలో టీకాల వాడకం కీలకం కానుందా? తాజా ప్రయోగాల ఫలితాలు ఇదే సూచిస్తున్నాయి. దశాబ్దాల పరీక్షల అనంతరం క్యాన్సర్ టీకాలు కొంగొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో మరెన్నో టీకాలు అందుబాటులోకి రావొచ్చని ఆశిస్తున్నారు. ఇవేమీ సంప్రదాయ టీకాలు కావు. జబ్బు నివారణకు ఉద్దేశించినవి కావు. కణితుల సైజు తగ్గించటం, క్యాన్సర్ తిరగబెట్టకుండా చూడటం వీటి ప్రత్యేకత. ప్రాణాంతక చర్మ క్యాన్సర్, క్లోమ క్యాన్సర్ మీద ఇటీవల నిర్వహించిన టీకా ప్రయోగాలు విజయవంతం కావటంతో రొమ్ము, ఊపిరితిత్తి క్యాన్సర్ల మీద శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. శరీర రోగనిరోధక వ్యవస్థ కంట పడకుండా క్యాన్సర్ ఎలా దాక్కుంటోందనేది మునుపటి కన్నా ఇప్పుడు బాగా అవగతమైంది. దీని ఆధారంగానే టీకాలను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని క్యాన్సర్లకు రోగనిరోధక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. టీకాలు సైతం వీటి మాదిరిగానే పనిచేస్తాయి. క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని చంపేలా రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి. కొన్ని కొత్త టీకాలు ఎంఆర్ఎన్ఏ పరిజ్ఞానాన్నీ వాడుకుంటున్నాయి. కొవిడ్ టీకాల తయారీలో ఎంఆర్ఎన్ఏ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవటం తెలిసిందే. టీకా పనిచేయాలంటే అది ముందుగా చేయాల్సిన పని- క్యాన్సర్ ప్రమాదకరమైందని గుర్తించేలా రోగనిరోధక వ్యవస్థలో భాగమైన టి కణాలకు నేర్పించటం. ఒకసారి దీన్ని నేర్చుకుంటే చాలు. శరీరంలో క్యాన్సర్ ఎక్కడున్నా టి కణాలు దాని పని పడతాయి. రక్తనాళాల ద్వారా పాక్కుంటూ వెళ్లి, కణజాలం లోపలికి చొచ్చుకెళ్తాయి. క్యాన్సర్ కణాలను అంతం చేస్తాయి. అయితే టీకాలు తీసుకోవటానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చే రోగులు లభించటమే పెద్ద సవాలు. ఇలాంటి కొందరిపై కొన్నిచోట్ల ప్రయోగాలు ఆరంభించారు. క్యాన్సర్ బాగా ముదిరిపోయి, ఇతర భాగాలకు వ్యాపించి, సంప్రదాయ చికిత్సలతో ఫలితం లేదని భావించినవారిపై నిర్వహిస్తున్న ప్రయోగాల్లో మంచి ఫలితాలూ కనిపిస్తున్నాయి. పదకొండు సంవత్సరాల క్రితం అండాశయ క్యాన్సర్ ముదిరిపోయిన దశలో టీకా తీసుకున్న ఒకరు ఇప్పటికీ జీవించి ఉండటం, ఆమెలో ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు లేకపోవటం విశేషం.

# నీరు తగ్గితే అధిక కొలెస్ట్రాల్



ఎండ అదరగొడుతోంది. విపరీతంగా ఉక్క పోస్తోంది. చెమట రూపంలో నీరంతా బయటకు వెళ్లిపోతోంది. దీన్ని భర్తీ చేయటానికి తగినంత నీరు తాగటం తప్పనిసరి. లేకపోతే ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది (డీహైడ్రేషన్). ఎక్కువసేపు ఒంట్లో నీరు తగ్గితే కాలేయం, కీళ్లు, కండరాలకు చిక్కులు తలెత్తటమే కాదు.. రక్తంలో మొత్తం కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల మోతాదులూ పెరుగుతున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. నీటిశాతం తగ్గినప్పుడు కాలేయం రక్తంలోకి మరింత ఎక్కువగా కొలెస్ట్రాల్‌ను విడుదల చేస్తుంది. మరోవైపు రక్తంలోంచి కొలెస్ట్రాల్‌ను తొలగించే ప్రక్రియా మందగిస్తుంది. ఎక్కువగా నీరు తాగేవారిలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతున్నట్టు, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతున్నట్టూ కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. నీటికి, కొలెస్ట్రాల్ మోతాదులకు మధ్య సంబంధమేంటన్నది కచ్చితంగా తెలియరాలేదు గానీ తగినంత నీరు తాగితే కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవచ్చనే అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల తగినంత నీరు తాగటం మంచిది. ఎండాకాలంలో ఇది మరింత అవసరం. ఇది శరీరానికి శక్తి నివ్వటమే కాకుండా కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గుముఖం పట్టటానికీ తోడ్పడుతుంది.

Printed and Published by Kesaram Penta Reddy on behalf of Bharatha Sakthi Publications Pvt Ltd, Printed at Bharatha Sakthi Publications Pvt Ltd, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar, RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar, Ranga Reddy(Dist), Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy